అనుదినం... జనస్వరం

www.navatelangana.com

నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

సోమవారం 04-3-2024

సంపుటి : 10 సంచిక : 13 | Published from Khammam, Rangareddy, Hyderabad, Karimnagar | 12 పేజీలు | వెల : 6.50





బలహీన వర్గాలపై నిర్లక్ష్యం

- ప్రజలమధ్య విద్వేషాలు రెచ్చగొడుతున్నారు : బీజేపీపై రాహుల్ గాంధీ ఫైర్
- దేశ రక్షణకు 'ఇండియా' గెలుపు అనివార్యం : సీతారాం ఏచూరి
- యూపీలో 80, బీహార్‌లో 40 సీట్లు గెలవడం ద్వారా బీజేపీ ప్రమాదాన్ని నివారించాలి : అఖిలేష్‌యాదవ్
- కేంద్రం బెదిరింపులకు భయపడం : తేజస్వీయాదవ్


విజయవంతంగా ఆర్జేడీ జన్ విశ్వాస్ ర్యాలీ

వివరాలు 3లో

రాష్ట్రాలుగా విడిపోయినా... మనుషులుగా కలిసుందాం

జాతీయ రాజకీయాల్లో తెలుగువారి ప్రాభవం తగ్గుతోంది

- ఫుల్ టైం బిజినెస్...పార్ట్ టైం పాలిటిక్స్ కారణం అయ్యిందొచ్చు
- 'గవర్నర్ పేట్ టు గవర్నర్ హౌజ్' పుస్తకావిష్కరణలో సీఎం రేవంత్‌రెడ్డి



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

తెలుగు ప్రజలు రాష్ట్రాలుగా విడిపోయినా, మనుషులుగా అందరం కలిసుండాలనీ, అదే స్ఫూర్తితో అభివృద్ధి వైపు పయనం సాగాలని ముఖ్యమంత్రి ఏ రేవంత్‌రెడ్డి అన్నారు. జాతీయ రాజకీయాల్లో తెలుగువారి ప్రాభవం క్రమేణా తగ్గుతున్నదనీ, దీనికి కారణాలను అన్వేషించాల్సిన అవసరం కూడా ఉందని అభిప్రాయపడ్డారు. ఆదివారంనాడిక్కడి మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ (ఎమ్సీహెచ్‌ఆర్డీ) ఆడిటోరియంలో మాజీ ఐపీఎస్ అధికారి, మాజీ గవర్నర్ పీఎస్ రామ్మోహన్‌రావు రాసిన 'గవర్నర్ పేట్ టు గవర్నర్ హౌజ్' అనే పుస్తకాన్ని ...11లో

తునికాకు సేకరణ ఎప్పుడు?

ఉపాధి కోల్పోతున్న గిరిజనులు

ప్రారంభం కాని కొమ్మకొట్టుడు పనులు

- 26 యూనిట్లకే టెండర్లు ఖరారు
- పెండింగ్‌లో 168 యూనిట్లు
- సకాలంలో ప్రారంభిస్తేనే మేలు

ఆందోళనలో ఆదివాసీలు, గిరిజనులు, పేదలు



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలో లక్షలాది మంది ఆదివాసీలు, గిరిజనులు, పేదలకు తునికాకు సేకరణ ఉపాధిని కల్పిస్తున్నది. ప్రతిఏటా డిసెంబర్, జనవరి నుంచే సేకరణ ప్రక్రియకు సంబంధించిన పనులను అటవీశాఖ మొదలుపెట్టేది. ఈ ఏడాది మాత్రం ఆ ప్రక్రియ నత్తనడకను తలపిస్తున్నది. ఇప్పటిదాకా టెండర్ల ప్రక్రియనే పూర్తవ్వలేదు. రాష్ట్రంలో 194 తునికాకు సేకరణ యూనిట్లు ఉంటే ఇప్పటి వరకు కేవలం 26 యూనిట్లకే టెండర్లు పూర్తిచేశారు. కొమ్మకొట్టుడు(ప్రూనింగ్) ప్రక్రియనూ మొదలుపెట్టలేదు. టెండర్లను, ప్రూనింగ్ ప్రక్రియలను సకాలంలో ...11లో

కిక్కే దిక్కా..!

త్వరలో మరిన్ని ఎలైట్ బార్లు

సాధారణ బార్లకంటె 25 శాతం ఫీజు అదనం

- ఖరీదైన కష్టమర్లే లక్ష్యంగా 2017లో ఏర్పాటు
- ఇప్పుడున్న 140 బార్లకు అదనంగా మరో 200
- త్వరలో నోటిఫికేషన్ విడుదలయ్యే అవకాశం
- ఆదాయం పెంపుపై అన్ని మార్గాలను అన్వేషిస్తున్న అబ్కారి శాఖ



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్ర ప్రభుత్వం ఆదేశం మేరకు ఆదాయం పెంచుకునేందుకు ఆబ్కారి శాఖ దృష్టి పెట్టింది. వాణిజ్య పన్నులు, ఎక్సైజ్, రిజిస్ట్రేషన్లు, మైనింగ్, రవాణా మొదలగు శాఖల రాబడి మరింత పెంచేలా చర్యలు చేపట్టాలని ఇటీవల నిర్వహించిన ఉన్నత స్థాయి సమీక్షలో సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన ఆదేశాల మేరకు ఆయా శాఖలు గల్ల పెట్టె నింపేందుకు మార్గాలను అన్వేశిస్తున్నాయి. ఖరీదైన కష్టమర్లే లక్ష్యంగా గత ప్రభుత్వం 2017లో ఏర్పాటు చేసిన ఎలైట్ బార్లను మరొసారి తెరపైకి తెచ్చేందుకు అబ్కారీ శాఖ సన్నాహాలు చేస్తోంది. ఇప్పటికే ఉన్న 140కి తోడు మరో 200 ఎలైట్ బార్లను అనుమతించాలని నిర్ణయించినట్టు సమాచారం.

రాష్ట్రంలో 2,620 మద్యం దుకాణాలు, 1,200 బార్లు, క్లబ్బులున్నాయి. హైదరాబాద్‌లో 100, రాష్ట్ర వ్యాప్తంగా ప్రధాన పట్టణాల్లో 40తో కలిపి మొత్తం 140 ఎలైట్ బార్లున్నాయి. వీటి ద్వారా ఖజానాకు అన్ని శాఖలకంటె ఎక్కువ మొత్తంలో ఆదాయం సమకూరుతోంది. కొత్తగా అధికారం చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం ...11లో

కాంగ్రెస్‌పై వ్యతిరేకత వచ్చింది

బీఆర్‌ఎస్‌తోనే మేలు అనే చర్చ మొదలైంది

- అసెంబ్లీ ఫలితాలు పట్టించుకోవద్దు
- లోక్‌సభ ఎన్నికల్లో సత్తా చాటాలి
- 12న కరీంనగర్‌లో బహిరంగ సభ
- బీఆర్‌ఎస్ నేతలకు మాజీ సీఎం కేసీఆర్ దిశానిర్దేశం



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

కాంగ్రెస్ సర్కారుపై ప్రజావ్యతిరేకత మొదలైందనీ, బీఆర్ఎస్ సర్కారుతోనే మేలు జరుగుతుందనే చర్చ ప్రజల్లో మొదలైందని మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ జాతీయ అధ్యక్షులు కే చంద్రశేఖరరావు అన్నారు. అసెంబ్లీ ఎన్నికల ఫలితాలను పట్టించుకోవాల్సిన అవసరం లేదనీ, అంతకు రెట్టింపు బలంతో లోక్‌సభ ఎన్నికల్లో విజయాలను నమోదు చేయాలని చెప్పారు. హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో ఆదివారంనాడాయన కరీంనగర్, పెద్దపల్లి నియోజకవర్గ బీఆర్ఎస్ నేతలతో సమావేశమయ్యారు. లోక్‌సభ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహంపై దిశా నిర్దేశం చేశారు. ఎలక్షన్ సెంటిమెంట్‌లో భాగంగా ఈ నెల 12న కరీంనగర్‌లోని ఎస్ఆర్ఆర్ కాలేజ్ గ్రౌండ్స్‌లో బహిరంగ సభ నిర్వహించాలని నిర్ణయించారు. కరీంనగర్ పార్లమెంట్ స్థానంలో బీఆర్ఎస్ గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. అతికొద్ది రోజుల్లోనే కాంగ్రెస్ ప్రభుత్వంపై వ్యతిరేకత వచ్చిందనీ, రైతులు రోడ్డెక్కుతున్నారని చెప్పారు. శాసన సభ ఎన్నికల ఫలితాలు పట్టించుకోవద్దనీ, నేతలు, కార్యకర్తలు అధైర్యపడొద్దని అన్నారు. అందరం కలిసి పనిచేద్దామనీ, మరోసారి బీఆర్ఎస్ సత్తా చాటాలన్నారు. లోక్‌సభ ...11లో

బాధ్యత మరిచిన మీడియా

- ఎన్నికల్లో అవకతవకలపై సరైన స్పందన కరువు
- బీజేపీకి అనుకూలంగా వ్యవహారం
- తప్పుబడుతున్న సామాజికవేత్తలు, మేధావులు



వివరాలు 3లో

ఎన్నికల లావాదేవీలు చెక్కుద్వారానే : సీఈసీ



న్యూఢిల్లీ : వచ్చే లోక్‌సభ ఎన్నికలకు సంబంధించిన అన్ని లావాదేవీలు చెక్కుల ద్వారానే జరుగుతాయని ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) రాజీవ్ కుమార్ తెలిపారు. యూపీలో ...11లో

జైలు గోడలు బద్దలు కొట్టి.. ఖైదీల పరార్

హైతీ దేశ రాజధాని పోర్ట్ ఆ ప్రిన్స్‌లో ఘటన

- మీడియాకు ఆ దేశ పోలీస్ యూనియన్ సోషల్ పోస్టు



హైతీ : "తీవ్రమైన నేరాలు చేసిన వారిని బంధించే ప్రధాన జైలులో ఖైదీల ముఠాలు ఒకరినొకరు కొట్టుకున్నారు. జైలు గోడలు బద్దలు కొట్టుకొని వందల మంది ఖైదీలు పారిపోతున్నారు. దీంతో హైతీ దేశ రాజధాని పోర్ట్ ఆ ప్రిన్స్ రణరంగాన్ని తలపిస్తోంది" అని ఆ దేశ పోలీస్ యూనియన్ సోషల్ మీడియాలో పోస్టు చేసింది. రాజధానిలోని అధికారులందరూ తక్షణమే కార్లు, ఆయుధాలు తీసుకొని జైలును అదుపు చేయడానికి రావాలని అభ్యర్థించింది. అంతేకక "దాడి చేసేవారు పూర్తిగా విజయం సాధిస్తే దాదాపు 3,000 మంది నేరగాళ్లు పట్టణంలోకి వస్తారు. ఎవరినీ వదిలిపెట్టరు" అని దానిలో పేర్కొంది. కెన్యాతో రక్షణ ఒప్పందం చేసుకోవడానికి హైతీ ప్రధాని ...2లో

మేడిగడ్డపై నిపుణుల కమిటీ

చైర్మెన్, నలుగురు సభ్యులు : ప్రకటించిన ఎన్‌డీఎస్‌ఏ



వివరాలు 2లో

కాళేశ్వరం నిపుణుల కమిటీ రాక పట్ల ఉత్తమ్ హర్షం



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

ఈనెల 6న కాళేశ్వరం ప్రాజెక్టు పరిశీలనకు నిపుణుల కమిటీ రాక పట్ల భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఆ కమిటీకి అన్ని విధాలుగా ...2లో

దేశంలో పేదరికం సంఖ్యలపై బీజేపీ ఎత్తులు..

- పేదరికం తగ్గిందంటూ నిటీఅయోగ్ మాయాజాలం
- అదే జరిగితే 80 కోట్ల మందికి సబ్సిడీ రేషన్ ఎందుకు? : వెబినార్‌లో డి.పాపారావు



వివరాలు 2లో

బీజేపీలో టికెట్ల చిచ్చు


సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి బంగారు శృతి

- ఈటలకు టికెట్‌తో కాంగ్రెస్ వైపు కూన, వీరేందర్ చూపు
- పాటిల్‌కు టికెట్‌పై జహీరాబాద్ శ్రేణుల కినుక
- రెండో విడతలో నాకే టికెట్ అంటున్న సోయం
- మహబూబ్‌నగర్‌లో డీకే వర్సెస్ జితేందర్‌రెడ్డి



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

బీజేపీ తెలంగాణ శాఖలో టికెట్ల చిచ్చు చెలరేగుతున్నది. ఇన్నాళ్లూ కష్టమొచ్చినా..నష్టమొచ్చినా పార్టీనే అట్టిపెట్టుకుని ఉన్న బంగారు శృతి ఇప్పుడు సీఎం రేవంత్‌రెడ్డిని స్వయంగా వెళ్లి కలవటం తీవ్ర చర్చనీయాంశం అవుతున్నది. ఆమె త్వరలో కాంగ్రెస్ తీర్థం పుచ్చుకోబోతున్నారనే ప్రచారమూ జరుగుతున్నది. మహబూబ్‌నగర టికెట్ తనకంటే తనకే అంటుండటంతో డీకే అరుణ వర్సెస్ జితేందర్‌రెడ్డి అన్నట్టుగా పరిస్థితి తయారైంది. బీఆర్ఎస్‌ను వీడి బీజేపీలో చేరిన తాజా ఎంపీ బీబీ పాటిల్‌కు రాత్రికి రాత్రే టికెట్ కన్ఫర్మ్ చేయడం విమర్శలకు తావిస్తున్నది. మొదటి నుంచి పార్టీ కోసం పనిచేస్తున్న శ్రేణుల ఆగ్రహానికి రాష్ట్ర నాయకత్వం గురవుతున్నది. రాష్ట్రస్థాయిలో ఎన్ని ...11లో



బీజేపీని ఓడించకపోతే గిరిజనులకు నష్టం

జార్ఖండ్ ముఖ్యమంత్రి

వివరాలు 2లో



విప్లవ పార్టీల మొదటి అడుగు ఐక్యత నినాదంతో ముందుకు..

- బీజేపీ ఉదారవాద విధానాలతో భయానక పరిస్థితులు
- దేశాన్ని హిందుత్వ రాష్ట్రంగా చేస్తున్న మోడీ
- కేసీఆర్ పాపాలే శాపలై కాంగ్రెస్‌కు అధికారం
- సీపీఐ (ఎంఎల్) మాస్ లైన్ బహిరంగ సభలో.. జాతీయ నాయకులు ప్రదీప్ సింగ్ ఠాగూర్, పోటు రంగారావు, సుభాష్ దేవ్

నవతెలంగాణ - ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

మోడీ ప్రభుత్వ ఉదారవాద విధానాల ఫలితంగా దేశంలో భయానక పరిస్థితులు నెలకొన్నాయని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ జాతీయ నాయకులు ప్రదీప్ సింగ్ ఠాగూర్, పోటు రంగారావు, సుభాష్ దేవ్ అన్నారు. దేశాన్ని హిందుత్వ రాష్ట్రంగా మార్చేందుకు కేంద్రం ప్రయత్నిస్తోందని ఆరోపించారు. మోడీ పాలనలో రాజ్యాంగ సంస్థలు విధ్వంసానికి గురయ్యాయని తెలిపారు. ప్రజాస్వామిక వ్యవస్థలను ఆర్థికంగా, రాజకీయంగా, సామాజికంగా దెబ్బతీసేందుకు ఆర్ఎస్ఎస్, బీజేపీ ప్రయత్నిస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. విప్లవ పార్టీల ఐక్యతను ఓ చారిత్రక పరిణామంగా అభివర్ణించారు. ఖమ్మంలోని పెవిలియన్ గ్రౌండ్‌లో (రవన్న, సంతోష్‌రాణానగర్) కెచ్చల రంగయ్య అధ్యక్షతన ఆదివారం నిర్వహించిన సీపీఐ (ఎంఎల్) మాస్ లైన్ బహిరంగ సభలో నాయకులు మాట్లాడారు. ఆర్ఎస్ఎస్, బీజేపీ ఫాసిస్టు శక్తులను ఓడించడానికి విప్లవ పార్టీలైన తో సీపీఐ (ఎంఎల్) ప్రజాపంథ, పీసీసీ సీపీఐ (ఎంఎల్), సీపీఐ (ఎంఎల్) ఆర్ఐ కలిసి ఖమ్మంలో మూడు రోజుల పాటు (3,4,5 తేదీల్లో) మహాసభలను నిర్వహిస్తున్నట్టు తెలిపారు. విప్లవోద్యమ చరిత్రలో జరిగిన తప్పులను సరిదిద్దాలనే లక్ష్యంతో ఈ పార్టీలు ఒక్కటిగా ముందుకు సాగుతున్నాయన్నారు. ప్రజా వ్యతిరేక విధానాలను ఖండించడంలో కమ్యూనిస్టులు ముందుంటారని ఆ చెప్పారు. మోడీ నేతృత్వంలో మైనార్టీలు, లౌకిక, ప్రజాస్వామ్య శక్తులపై తీవ్ర నిర్బంధాలు ఎదురవుతున్నాయన్నారు. పంటలకు కనీస మద్దతు ధర ఇవ్వకుండా మోడీ ప్రభుత్వం రైతు వ్యతిరేక విధానాలను అవలంబిస్తుందని విమర్శించారు. ప్రభుత్వం అంటే ప్రజల బాధలను, గాథాలను అర్థం చేసుకోవాలని సూచించారు.

కేసీఆర్ మరో నిజాం నవాబ్ అని, ఆయన పాపాలే శాపాలై కాంగ్రెస్‌కు అధికారాన్ని కట్టబెట్టాయని విప్లవపార్టీల నాయకులు స్పష్టంచేశారు. మోడీ ప్రజాస్వామిక గ్యారంటీ ఇవ్వాలని కోరారు. కాంగ్రెస్ రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలను తప్పకుండా అమలు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వాన్ని కూలదోయడమే లక్ష్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. అంతకుముందు స్థానిక ఎస్ఆర్ అండ్ బీజీఎన్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల నుంచి వైరా రోడ్డు మీదుగా పెవిలియన్ గ్రౌండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. బహిరంగ సభలో అరుణోదయ కళాకారులు ప్రదర్శించిన ఆటపాటలు ఆకట్టుకున్నాయి. ఈ సభలో సంజయ్ సింగ్వీ, దినేష్ గుహాయ్, కేజీ రామచందర్, కే రమ, రాయల చంద్రశేఖర్, గుమ్మడి నరసయ్య, పూజారి, జీవకుమార్, రవిబాబు, ప్రవీణ్ నట్టర్, భాస్కర రావు, బీమర్ త్రివేది, అలీక్ చక్రవర్తి, చిన్న చంద్రన్న, సూర్యం, చంద్ర అరుణ, సదానందం తదితరులు పాల్గొన్నారు.

మేడిగడ్డపై నిపుణుల కమిటీ

- చైర్మెన్, నలుగురు సభ్యులు : ప్రకటించిన ఎన్‌డీఎస్‌ఏ

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి -హైదరాబాద్

కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల డిజైన్లు, నిర్మాణాన్ని పరిశీలించేందుకు నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ నిపుణుల కమిటీని నియమించింది. కేంద్ర జల సంఘం మాజీ చైర్మెన్ జె.చంద్రశేఖర్ అయ్యర్ నేతృత్వంలో ఐదుగురు సభ్యులతో కమిటీ పని చేయనుంది. ఇందులో సభ్యులుగా యు.సి. విద్యార్థి, ఆర్.పాటిల్, శివకుమార్ శర్మ, రాహుల్ కుమార్ సింగ్‌తోపాటు ఎన్డీఎస్ఏ డైరెక్టర్ (టెక్నికల్) అమితాబ్ మీనా ఈ కమిటీకి మెంబర్ సెక్రెటరీగా వ్యవహరిస్తారు.

మేడిగడ్డ బ్యారేజీలోని పిల్లరు కుంగిపోవటంతో అప్రమత్తమైన రాష్ట్ర ప్రభుత్వం ఈ ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం. సుందిళ్ల బ్యారేజీలపై సమగ్రంగా విచారణ జరపాలని ఫిబ్రవరి 13న నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీకి లేఖ రాసిన సంగతి తెలిసిందే. మూడు బ్యారేజీల డిజైన్లతోపాటు నిర్మాణాలను నిపుణుల ఆధ్వర్యంలో అన్ని కోణాల్లో పరిశీలించాలని ఎన్డీఎస్ఏ విజ్ఞప్తి చేసింది.

స్పందించిన నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ ఈ మూడు బ్యారేజీలపై విచారణకు ప్రత్యేకంగా కమిటీని నియమిస్తూ ముందుగా చంద్రశేఖర్ అయ్యర్ ను నియమిస్తూ మార్చి 2వ తేదీన ఉత్తర్వులు జారీ చేసిన విషయం విధితమే. ఫిల్లర్ల కుంగుబాటు, పగుళ్లకు గల కారణాలను విశ్లేషించాలని, ఇప్పుడున్న పరిస్థితుల్లో చేపట్టాల్సిన ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించాలని సూచించింది. నాలుగు నెలల్లోపు తమ రిపోర్టును అందజేయాలని కమిటీకి నిర్ణీత గడువును విధించింది.

అంగన్‌వాడీ కేంద్రాల్లో సీసీ కెమెరాలు సరికాదు

- బయో మెట్రిక్ పేరుతో బ్లాక్ మెయిలింగ్
- రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయాన్ని వెంటనే మార్చుకోవాలి
- తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్ డిమాండ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

.ఉద్యోగులను దొంగలుగా చిత్రీకరిస్తూ, అంగన్‌వాడీ కేంద్రాల్లో సీసీ కెమెరాలు, బయోమెట్రిక్ పెట్టాలనే నిర్ణయాన్ని రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఉపసంహరించుకోవాలని తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కె.సునిత, ప్రధాన కార్యదర్శి పి.జయలక్ష్మి, కోశాధికారి పి.మంగ ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. శనివారం హైదరాబాద్‌లోని సచివాలయంలో జరిగిన ఐసీడీఎస్ సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అంగన్‌వాడీలను అవమానించే విధంగా మాట్లాడారని ఆందోళన వ్యక్తం చేశారు. ఐసీడీఎస్ ఏర్పడి 48 ఏండ్లు గడుస్తున్నా ఇప్పటి వరకు 60 శాతం కేంద్రాలకు పక్కా భవనాలు, 90 శాతం కేంద్రాల్లో డబుల్ సిలిండర్ లేదని అన్నారు. కొన్ని కేంద్రాల్లో బాత్రూంలు, మంచినీటి సౌకర్యం, కాంపౌండ్లు లేవని ఆవేదన వ్యక్తం చేశారు. పదేండ్లుగా మెస్ చార్జీలు పెంచక పోవడం వల్ల పెరుగుతున్న ధరలతో ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. కూరగాయలు, పాలు భద్రపర్చుకోవడానికి ఫ్రిజ్‌లు లేవని వివరించారు.

పురుగుల బియ్యం, ముక్కిపోయిన పప్పు, మురిగిపోయిన కోడి గుడ్లు సరఫరా చేస్తున్నారని పేర్కొన్నారు. అంగన్‌వాడి కేంద్రాల్లో మౌళిక వసతులు, పిల్లలకు ఆహారాన్ని అందించే వ్యవస్థను మెరుగుపర్చాలని డిమాండ్ చేశారు. దశాబ్దాలుగా పనిచేస్తున్న ఉద్యోగులకు ఇప్పటికీ ఈఎస్ఐ, ఉద్యోగ భద్రత లేదన్నారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ మ్యానిఫెస్టోలో పెట్టిన రూ. 18వేల వేతనం, పీఎఫ్ సౌకర్యంపె స్పష్టమైన ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. గతంలో చేసిన 24 రోజుల సమ్మె కాలానికి ఇంతవరకు వేతనాలు చెల్లించలేదని గుర్తు చేశారు.

ఐసీడీఎస్ పర్యవేక్షణ కోసం సూపర్‌వైజర్లు, ఆరోగ్యలక్ష్మి తదితర యాప్స్ అనేకం ఉండగా కొత్తగా వీటిని ఏర్పాటు చేయాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. సర్వేల పేరుతో బయట తిరిగే ఉద్యోగులకు బయోమెట్రిక్ పెట్టడాన్ని వారు తప్పు పట్టారు. సిబ్బందిపై నిఘా పెట్టడం మాని కేంద్రాలకు పోషకాహారాన్ని సరఫరా చేసే కాంట్రాక్టర్లపై నిఘా పెట్టాలని సూచించారు. ఐసీడీసీని బలోపేతం చేయడంతో పాటు పెండింగ్‌లో ఉన్న ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలనీ, లేదంటే పోరాటాన్ని ఉధృతం చేస్తామని వారు హెచ్చరించారు

అవినీతి ఆగేదెప్పుడు..?

- లంచాల మత్తులో ప్రభుత్వ అధికారులు
- ఏసీబీ దాడులు చేస్తున్నా మారని తీరు
- 20 రోజుల వ్యవధిలోనే ఇద్దరిపై కేసు నమోదు



నవతెలంగాణ-సిటీబ్యూరో

ప్రభుత్వ శాఖల్లో అవినీతి వేళ్లూనుకుంది. చేతులు తడిపితే తప్ప కాగితం కార్యాలయం గడప దాటడం లేదు. అవసరం కోసం ప్రభుత్వ ఆఫీసుకు వెళ్తే అధికారులు అడిగినంత ఇచ్చుకోలేక, అటు సమయానికి పనులు కాక సామాన్యులు నానా ఇబ్బందులు పడుతున్నారు. ఉన్నతాధికారుల నుంచి క్షేత్రస్థాయి సిబ్బంది వరకు పని చేసేందుకు లంచం డిమాండ్ చేస్తున్నారనే ఆరోపణ లున్నాయి. అధికారుల వేధింపులతో విసుగు చెందిన బాధితులు తప్పని పరిస్థితుల్లో ఏసీబీని ఆశ్రయిస్తున్నారు. గడిచిన 20 రోజుల వ్యవధిలోనే జిల్లాలో ఇద్దరు అవినీతి అధికారులపై ఏసీబీ కేసులు నమోదు చేసిన ఘటనలు ఉన్నాయి.

పట్టాదారు పాస్ బుక్ జారీ కోసం రూ.30 లక్షలు డిమాండ్ చేసిన శామిర్‌పేట తహసీల్దార్ ఏసీబీకి చిక్కారు. తహసీల్దార్ సత్యనారాయణ, అతని డ్రైవర్ భండారి డబ్బులు తీసుకుంటూ అడ్డంగా బుక్కయ్యారు. గచ్చిబౌలికి చెందిన రామశేషగిరిరావుకు శామీర్‌పేట్ మండలంలోని లాల్ గడిమలక్‌పేటలో 29 ఎకరాల వ్యవసాయ స్థలం ఉంది. ఆయన పట్టదారు పాసుబుక్‌లు, ధరణిలో నమోదు కోసం దరఖాస్తు చేసుకున్నాడు. కలెక్టర్‌కు అనుకూలంగా రిపోర్టు రాసేందుకుగాను తాహసీల్దార్ సత్యనారాయణ రూ.30 లక్షలు డిమాండ్ చేశారు.

దాంతో రామ శేషగిరిరావు ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. మరుసటి రోజు డబ్బులు రెడీ అయ్యాయని తాహసీల్దార్‌కు శేషగిరిరావు సమాచారం ఇచ్చారు. దీంతో సత్యనారాయణ తన డ్రైవర్ పి.భండారిని డబ్బులు తీసుకోవాల్సిందిగా ఆదేశించాడు. రూ.10 లక్షల నగదుతో పాటు, రూ.20 లక్షలకు సంబంధించిన చెక్కును తీసుకుని డ్రైవర్ తహసీల్దార్‌కు ఇస్తుండగా, పక్కా ప్లాన్‌తో ఏసీబీ డీసీపీ మజీద్ అలీఖాన్, ఇతర ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. సత్యనారాయణ ఇంటితోపాటు ఆయన బంధువుల ఇండ్లల్లోనూ ఏసీబీ అధికారులు తనిఖీలు చేశారు.

ఉలిక్కిపడ్డ అధికారులు..

పెద్ద మొత్తంలో డబ్బులు తీసుకుంటూ శామీర్‌పేట తహసీల్దార్ పట్టుబడటంతో రెవెన్యూ అధికారుల్లో తీవ్ర చర్చనీయాంశమైంది. శామీర్‌పేట తహసీల్దార్ కార్యాలయంలో ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహించి పలు కీలక రికార్డులను స్వాధీనం చేసుకున్నట్టు తెలియడంతో పలువురు రెవెన్యూ ఉన్నతాధికారులు సైతం ఉలిక్కిపడుతున్నారు. ఏసీబీ అధికారులు స్వాధీనం చేసుకున్న రికార్డుల ప్రకారం కలెక్టరేట్‌లోని ఆయా సెక్షన్లలో పని చేస్తున్న అధికారులను విచారించేందుకు సిద్ధమౌ తున్నట్టు సమాచారం. ఇప్పటికే డీ సెక్షన్ ఇన్‌చార్జితో పాటు ఆర్డీవోను కూడా ఏసీబీ అధికారులు పిలుపించుకుని పలు ప్రశ్నలు సంధించినట్టు సమాచారం. ముఖ్యంగా ధరణి ప్రక్రియపైనే ఏసీబీ అధికారులు పలు అనుమానాలను లేవనెత్తినట్టు తెలిసింది. ముఖ్యంగా తహసీల్దార్ సత్యనారాయణతో సత్సంబంధాలు నడిపిన పలువురు అధికారులు భయాందోళనలు గురౌతున్నట్టు సమాచారం.

తాజాగా విద్యుత్‌శాఖలో..

విద్యుత్ శాఖలో జూనియర్ అకౌంటెంట్‌గా పని చేస్తున్న ఉద్యోగి ఒకరు లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు రెడ్‌హ్యాండెడ్‌గా చిక్కారు. వివరాల్లోకి వెళ్తే.. హబ్సిగూడలోని టీఎస్ఎస్‌పీడీసీఎల్ కార్యాలయంలో జూనియర్ అకౌంటెంట్‌గా విధులు నిర్వహిస్తున్న సామ విజయసింహ రెడ్డి అనే ఉద్యోగి రూ.35,000 లంచం తీసుకుంటూ పట్టుబడ్డారు. అదే శాఖలో ఆర్టిజన్‌గా పని చేసిన భరత్ తనకు రావాల్సిన బకాయిల కోసం జూనియర్ అకౌంటెంట్‌ను సంప్రదించగా డబ్బులు డిమాండ్ చేశారు. దీంతో సదరు బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించగా ఏసీబీ అధికారులు హబ్సిగూడ కార్యాలయంపై దాడి చేసి లంచం తీసుకుంటుండగా ఏవోను పట్టుకున్నారు. ఏవో వద్ద నుంచి రూ.35 వేలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.

దేశంలో పేదరికం సంఖ్యలపై బీజేపీ ఎత్తులు...

నిటిఅయోగ్ మాయాజాలం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్



దేశంలో పేదరికం తగ్గలేదని సీనియర్ జర్నలిస్టు, ఆర్థికవేత్త డి.పాపారావు తెలిపారు. ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రం మేనేజింగ్ కమిటీ కార్యదర్శి ఎస్.వినయ్ కుమార్ సమన్వయంలో దేశంలో పేదల సంఖ్య ఐదు శాతానికి పడిపోయిందా? ఇది వాస్తవమా? నిటిఅయోగ్ మాయాజాలమా? అనే అంశంపై వెబినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా పాపారావు మాట్లాడుతూ, 2011-12లో చేసిన సర్వేతో 2022-23లో చేస్తున్న సర్వేను పోల్చడం సరికాదని తెలిపారు. అప్పుడు సర్వేకు ఎంచుకున్న మెథడాలజీ, పరిస్థితులు వేరని, ప్రస్తుతం వేరుగా ఉన్నాయని తెలిపారు. గతంలో ఒకేసారి సర్వే నిర్వహించగా ప్రస్తుతం మూడు దఫాలుగా నిర్వహిస్తున్నారనీ, రెండో దఫా ఇంకా పూర్తి కాకముందే నిటిఅయోగ్ ఐదు శాతానికి పేదరికం పడిపోయిందని చెప్పడం వెనుక కేవలం రాజకీయమే కారణమని చెప్పారు. దేశంలో బీజేపీ సాధించిన విజయాలు ఏమీ లేవని బీజేపీ విధానాలను బలపరిచేందుకు నిటిఅయోగ్ ఇలాంటి మాయాజాలానికి తెరలేపిందని చెప్పారు. నిటిఅయోగ్ మాటలను బీజేపీ శ్రేణులు, వారి సానుభూతిపరులను కొంత మేరకు నమ్మించవచ్చేమో గానీ, దేశంలో పేదలకు వాస్తవం తెలుసన్నారు. చైనాపై ఉన్న వ్యతిరేకతతో భారతదేశాన్ని మచ్చిక చేసుకునేందుకు అమెరికా కూడా పిల్లికి ఎలుక సాక్ష్యమన్నట్టు భారతదేశంలో పేదరికం తగ్గిందని చెబుతున్నదని ఎద్దేవా చేశారు. పేదరికం తగ్గితే దేశంలో ఇప్పటికీ 60 శాతం మంది అంటే 80 కోట్ల మందికి సబ్సిడీ రేషన్ బియ్యం ఇచ్చే పరిస్థితి ఎందుకుందని బీజేపీని ప్రశ్నించారు. నిటి అయోగ్ గ్రామీణుల తలసరి ఆదాయం రూ.3,773కు పెరిగిందని చెబుతున్నదనీ, గ్రామాల్లో ఒక కుటుంబంలో సగటున ఐదుగురు ఉంటారనీ, ఆ లెక్కన నెలకు దాదాపు రూ.18 వేల కుటుంబ ఆదాయముం టుందని వివరించారు. అయితే నిటిఅయోగ్ ఇచ్చిన సర్వే లెక్కల ప్రకారమే... గ్రామీణ కుటుంబాల సగటు నెల ఆదాయం రూ.10 వేల వరకే ఉంటుందని తెలిపారు. పరస్పర విశ్వసనీయత లేని, భిన్నమైన లెక్కల ద్వారా ఇది కేవలం బీజేపీకి రాజకీయ ప్రయోజనం చేకూర్చేందుకే అని అర్థమవుతుందని తెలిపారు. నిటిఅయోగ్ 2017-18లో చేసిన సర్వే ఫలితాలను శాస్త్రీయత లేదని తొక్కిపెట్టారని పాపారావు ఈ సందర్భంగా గుర్తుచేశారు. అప్పుడు శాస్త్రీయత లేని మెథడాలజీనే ఉపయోగించి చేసిన ప్రస్తుత సర్వే ఏ విధంగా శాస్త్రీయమైంది అవుతుందని ప్రశ్నించారు.

గ్రామాల్లో ఫాస్ట్ మూవింగ్ కన్స్యూమర్ గూడ్స్ అమ్మకాలు పెరగడం లేదనీ, షేర్ల మార్కెట్లో ఎఫ్ఎంసీజీ షేర్లూ పెరగడం లేదన్నారు. వీటి ద్వారా గ్రామాల్లో వ్యవసాయ సంక్షోభం ఉందని తెలుస్తుందన్నారు. నోట్ల రద్దు, జీఎస్టీలతో పాటు అసంఘటిత రంగాన్ని పూర్తిగా సంఘటిత రంగంగా మార్చేందుకు బీజేపీ అనుసరించిన విధానాలతో కార్పొరేట్లు బలపడ్డారని తెలిపారు.

వాటికి సంబంధించిన లెక్కలను కూడా పేదరికం తగ్గిందనేందుకు చెప్పేందుకు ఉపయోగిం చుకున్నారని తప్పుపట్టారు. చిన్న వ్యాపారులు దెబ్బతిన్నారని గుర్తుచేశారు.

జైలు గోడలు బద్దలు కొట్టి ఖైదీల పరార్

(మొదటిపేజీ తరువాయి)

ఏరియల్ హెన్రీ ఇటీవల ఆ దేశ పర్యటనకు వెళ్లిన సమయంలో పోర్ట్ ఆ ప్రిన్స్‌లో నేరగాళ్ల ముఠాలు ఒక్కసారిగా రెచ్చిపోయాయి. పోలీస్ స్టేషన్లు, అంతర్జాతీయ విమానాశ్రయాలు, జైళ్లను లక్ష్యంగా చేసుకొని దాడులు మొదలుపెట్టాయి. దీంతో అమెరికా విమానయాన సంస్థలు సర్వీసులను రద్దు చేశాయి. అదే సమయంలో దేశంలోనే అత్యంత తీవ్రమైన నేరగాళ్లను ఉంచే పోర్ట్ ఆ ప్రిన్స్ జైలుపై దాడులు మొదలయ్యాయి. ఈ జైల్లో దేశాధ్యక్షుడి హంతకులతో పాటు 18 మంది కొలంబియా నేరగాళ్లు కూడా ఉన్నారు. ఈ జైలు సామర్థ్యం కేవలం 3,900 మంది ఖైదీలుండేది కాగా.. ఇప్పుడు అందులో 11,778 మంది ఖైదీలు ఉన్నారు. ఈ క్రమంలోనే జైలుపై బయటి నుంచి ఓ ముఠాకు చెందిన దుండగులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో బాజ్-5 ముఠా హస్తం ఉన్నట్లు భావిస్తున్నారు. మరోవైపు కెన్యాతో ఒప్పందం అమల్లోకి వస్తే.. ఆ దేశ దళాలు హైతీ రక్షణకు సాయం చేస్తాయి. దీనిపై ఓ నేరగాళ్ల ముఠా నాయకుడు జిమ్మీ చెరిజియర్ అలియాస్ బార్బెక్యూ మాట్లాడుతూ.. ప్రధాని హెన్రీని పదవి నుంచి దించుతామన్నాడు. పోలీసులు, సైన్యమే ప్రధానిని అరెస్టు చేయాలని డిమాండ్ చేశాడు. కాగా, జిమ్మీ గతంలో పోలీస్ అధికారిగా పనిచేశాడు. ఆ తర్వాత గ్యాంగులతో సంబంధాలు పెట్టుకొని నేరగాడిగా మారాడు. అతడిపై అమెరికా, ఐరాస ఆంక్షలు ఉన్నాయి.


తెలంగాణలో మరో జర్నలిస్టు సంఘం ఆవిర్భావం..

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తెలంగాణలో మరో జర్నలిస్టు సంఘం ఆవిర్భవించింది. ఆదివారం హైదరాబాద్ నాంపల్లి టీఎన్జీవోస్ భవన్‌లో హైదరాబాద్ తో పాటు 10 ఉమ్మడి జిల్లాల జర్నలిస్ట్ ముఖ్యనేతలు సమావేశమయ్యారు. 10 టీవీ జర్నలిస్ట్ కొండల్ గౌడ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జర్నలిస్టు యూనియన్ ఆఫ్ స్టేట్ తెలంగాణ(జేయూఎస్టీ) ఏర్పడింది. సంఘం కన్వీనర్‌గా ఎంవీ రమణ, కో కన్వీనర్లుగా పీ.వీ శ్రీనివాస్, జమాల్పూర్ గణేష్, బిజిగిరి శ్రీనివాస్, శశికాంత్ , మల్లీశ్వరి, నాంపల్లి మురళి, సలహాదారుగా కొండల్ రావు ఎన్నికయ్యారు. గుంటిపల్లి వెంకట్ స్టేట్ కో కన్వీనర్‌తో పాటు వరంగల్ ఉమ్మడి జిల్లా ఇన్ ఛార్జిగా వ్యవహరిస్తారు.. స్టేట్ అడ్ హక్ కమిటీ సభ్యులుగా కొండల్ గౌడ్(హైదరాబాద్), గోపాలకృష్ణ(కరీంనగర్), డి.నర్సింహచారి (నిజామాబాద్), లక్ష్మీనారాయణ(రంగారెడ్డి), బస్వరాజు(మహబూబ్ నగర్), యోగనంద్ రెడ్డి(మెదక్), క్రాంతి(నల్గొండ), రాజేష్(ఆదిలాబాద్) ఎన్నికయ్యారు. జర్నలిస్టుల సంక్షేమం, సమస్యల సాధన కోసం పని చేస్తూనే ప్రజల గొంతుకగా నిలుస్తామని కన్వీనర్ రమణ ఈ సందర్భంగా తెలిపారు.

ఏడు కీలక రాష్ట్రాలలో బైడెన్‌కంటే ట్రంప్‌నకు ఆధిక్యత

- తాజా సర్వే



వాషింగ్టన్: అమెరికా మాజీ అధ్యక్షుడు, రిపబ్లికన్ అధ్యక్ష ఎన్నికల ఫ్రంట్‌రన్నర్ డొనాల్డ్ ట్రంప్ ఏడు స్వింగ్ రాష్ట్రాలలో అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ కంటే ఆధిక్యతలో ఉన్నాడు. అమెరికన్లలో ఎక్కువ శాతం అధికారంలో వున్న వ్యక్తిని "చాలా ముసలివాడు"గా చూస్తున్నారు. 81 ఏండ్ల బైడెన్‌కు మద్దతు ఇచ్చేవారి సంఖ్య 43% తో పోలిస్తే, 48% మంది ఓటర్లు రిపబ్లికన్ అధ్యక్ష అభ్యర్థికి మద్దతు ఇస్తారని బ్లూమ్‌బెర్గ్ న్యూస్/మార్నింగ్ కన్సల్ట్ గురువారం విడుదల చేసిన ఒక సర్వేలో తేలింది. అరిజోనా (6%), జార్జియా (6%), మిచిగాన్ (2%), నెవాడా (6%), నార్త్ కరోలినా (9%), పెన్సిల్వేనియా (6%), విస్కాన్సిన్ (4%) - మొత్తం ఏడు కీలక రాష్ట్రాల్లో ట్రంప్ తన ప్రత్యర్థి కంటే అనేక పాయింట్ల ఆధిక్యంలో ఉన్నారని సర్వే చూపిస్తుంది. సర్వేలో పాల్గొన్న వారిలో 82% మంది 81 ఏండ్ల బిడెన్‌ను "చాలా ముసలివాడు" అని అభిప్రాయపడ్డారు. అయితే 47% మంది 77 ఏండ్ల ట్రంప్‌కు కూడా

ఈ వివరణ వర్తిస్తుందని అభిప్రాయపడ్డారు. 38 శాతం మంది వీరిద్దరికీ అధ్యక్షుడిగా పని చేయటానికి వయసు మీరిందని పేర్కొన్నారు.

అయితే 59% మంది ట్రంప్‌ను "ప్రమాదకరం" అని అభివర్ణించగా, 48% మంది బైడెన్ గురించి కూడా అలాగే చెప్పారు. 14% మంది ఇద్దరు నాయకులను "ప్రమాదకరమైన" వారిగా అభివర్ణించారు. అంతేకాక 30% మంది మాత్రమే బైడెన్ "మానసికంగా ఆరోగ్యంగా ఉన్నాడు" అని చెప్పారు. 47% మంది ఇది ట్రంప్‌కు కూడా వర్తిస్తుందని చెప్పారు. ఎక్కువ మంది అమెరికన్లు ట్రంప్‌ను "మంచి ఆరోగ్యంతో", "బలమైన నాయకుడు"గా చూస్తారు. మరికొంత మందికి బైడెన్ మరింత దయగల అధ్యక్షుడిగా కనిపిస్తాడు.

బీజేపీని ఓడించకపోతే గిరిజనులకు నష్టం

రాంచీ : రానున్న లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీని ఓడించకపోతే గిరిజనుల భూములను దోచుకునీ.. అడవులు, బొగ్గు ఉన్న ప్రాంతాల నుంచి వారిని వెళ్లగొడుతుందని జార్ఖండ్ ముఖ్యమంత్రి చంపాయ్ సోరెన్ అన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం గిరిజన హక్కులను పరిరక్షించే వివిధ చట్టాలను సవరించటానికి ప్రయత్నించిందనీ, అయితే రాష్ట్రంలోని సంకీర్ణ ప్రభుత్వం అలాంటి ప్రయత్నాలకు వ్యతిరేకంగా నిరసన తెలుపుతుందని ఆయన అన్నారు. అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా.. బీజేపీ శాసనసభ్యులు సభ నుంచి వాకౌట్ చేసిన నేపథ్యంలో సీఎం రాష్ట్ర అసెంబ్లీలో తన ముగింపు ప్రసంగం చేశారు.

ఫిబ్రవరి 23 నుంచి ప్రారంభమైన ఏడు రోజుల అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలను స్పీకర్ రవీంద్ర నాథ్ మహెతో వాయిదా వేశారు. సెషన్ ముగింపు రోజున ఇంటర్నేషనల్ యూనివర్సిటీ బిల్లు, 2024తో సహా నాలుగు బిల్లులు ఆమోదించబడ్డాయి.

బీజేపీ ఉద్దేశం గురించి ప్రజలకు అవగాహన కల్పించాలని అధికార కూటమి శాసనసభ్యులను ఆయన కోరారు. బీజేపీ వ్యూహాన్ని మాజీ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ అర్థం చేసుకున్నారని సీఎం అన్నారు.

కరువుతో పంటలు నష్టపోయిన రైతులను ఆదుకోండి

- సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి
- మంగళపల్లి గ్రామంలో ఎండిపోయిన పంటల పరిశీలన



నవతెలంగాణ-నకిరేకల్

కరువుతో పంటలు నష్టపోయిన రైతులను ఆదుకోవాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం నల్లగొండ జిల్లా నకిరేకల్ మండలంలోని మంగళపల్లి గ్రామాన్ని సీపీఐ(ఎం), రైతు సంఘం ప్రతినిధి బృందం పర్యటించింది. గ్రామంలో ఎండిపోయిన చెరువులు, కుంటలు, పంటపొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జూలకంటి మాట్లాడుతూ.. జిల్లాలో కరువు విలయతాండవం చేస్తోందన్నారు. ఏ గ్రామానికెళ్లినా భూగర్భ జలాలు తగ్గి బోర్లు, బావులు, చెరువులు, కుంటలు ఎండి పండ్ల తోటలు, వరి పంట ఎండిపోయి రైతాంగం నష్టపోయిందన్నారు. గ్రామంలో 2000 ఎకరాల్లో వరిసాగు చేయగా సుమారు 1500 ఎకరాల్లో ఎండిపోయిందని తెలిపారు. రైతులు పంట కాపాడుకునేందుకు ఐదు నుంచి 11 బోర్లు వేయగా మొత్తం గ్రామంలో 1500 బోర్లు కొత్తగా వేసి నీళ్లు పడక నష్టపోయాని తెలిపారు. గుడిపాటి ఐలయ్య అనే కౌలు రైతు 30 ఎకరాలు వరి పంట చేస్తే అందులో 25 ఎకరాలు పూర్తిగా ఎండిపోవడంతో పశువులను మేపుతున్నారన్నారు. పున్నం రాజు బుచ్చయ్య అనే రైతు ఆరు ఎకరాల పొలాన్ని కాపాడుకోవడానికి 11 బోర్లు వేసినా చుక్క నీరు పడలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ యంత్రాంగం కదిలి క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి పంట నష్టపరిహారం అంచనా వేసి ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కరువులో తాగునీరు ఎద్దడి నివారణకు ఎస్ఎల్బీసీ నీటిని విడుదల చేసి చెరువులు, కుంటలు నింపాలని కోరారు. పరిశీలించినవ వారిలో.. సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి, రైతుసంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి కందాల ప్రమీల, జిల్లా అధ్యక్షులు వీరేపల్లి వెంకటేశ్వర్లు, రాష్ట్ర కమిటీ సభ్యులు బండ శ్రీశైలం, పార్టీ మండల కార్యదర్శి రాచకొండ వెంకట్‌గౌడ్, రైతు సంఘం మండల కార్యదర్శి మర్రి వెంకటయ్య, కొప్పుల అంజయ్య, నాయకులు హసం, బచ్చుపల్లి ప్రకాశరావు, బచ్చుపల్లి లక్ష్మణ్‌రావు, గ్రామశాఖ కార్యదర్శి మర్రి బక్కయ్య, తదితరులు ఉన్నారు.

బీజేపీకి పార్టీ ఫండ్‌గా మోడీ రూ.2వేలు విరాళం

- అందరూ సహకరించాలని ప్రధాని పిలుపు

న్యూఢిల్లీ : లోక్‌సభ ఎన్నికలకు ముందు బీజేపీకి 'పార్టీ ఫండ్' గా రూ. 2,000 విరాళం అందించారు ప్రధాని మోడీ. ఇందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఆయన అన్నారు. నమో యాప్ ద్వారా 'డోనేషన్ ఫర్ నేషన్ బిల్డింగ్' ప్రచారంలో భాగస్వాములు కావాలని 'ఎక్స్' ద్వారా ప్రజలను ఆయన కోరారు." బీజేపీ4ఇండియా(ఇది బీజేపీ సోషల్ మీడియా ఖాతా పేరు) కి సహకరించటం, వికసిత్ భారత్ నిర్మాణానికి మా ప్రయత్నాలను బలోపేతం చేయటం నాకు సంతోషంగా ఉన్నది.

నమోయాప్ ద్వారా 'డోనేషన్ ఫర్ నేషన్ బిల్డింగ్'లో భాగస్వాములు కావాలని నేను ప్రతి ఒక్కరినీ కోరుతున్నాను!" అని పార్టీకి తన విరాళాల రశీదుతో పాటుగా మోడీ ట్వీట్ చేశారు. బీజేపీ విరాళాల ప్రచారాన్ని మార్చి 1న బీజేపీ జాతీయాధ్యక్షుడు జె.పి నడ్డా ప్రారంభించారు. అప్పుడు ఆయన పార్టీకి రూ.1,000 విరాళం అందించారు.ఏటికేడు బీజేపీకి అందే విరాళాలు వందల కోట్లల్లోనే ఉంటున్నాయి. ముఖ్యంగా, 2022-2023 ఆర్థిక సంవత్సరంలో ఆ పార్టీకి రూ. 719 కోట్ల నిధులు అందాయి. ఇది అంతకముందు ఏడాదితో పోలిస్తే 17 శాతం వృద్ధిని సాధించిందని ఎన్నికల కమిషన్ డేటా వెల్లడించింది. 2021-2022లో కాషాయ పార్టీకి రూ. 614 కోట్ల విరాళాలు అందాయి.

ఎలక్టోరల్ బాండ్‌లపై కోర్టు నిషేధం.. విరాళాల సేకరణ ప్రారంభించిన బీజేపీ

ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెస్‌కు విరాళాలు 2021-2022 ఆర్థిక సంవత్సరంలో రూ. 95.4 కోట్ల నుంచి 2022-2023 ఆర్థిక సంవత్సరంలో రూ. 79 కోట్లకు తగ్గాయి. రాజకీయ పార్టీలకు అనామక నిధులను అనుమతించే బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఎలక్టోరల్ బాండ్‌లను సుప్రీంకోర్టు నిషేధించిన కొన్ని రోజుల తర్వాతే అధికార పార్టీ విరాళాల ప్రచారం ప్రారంభించటం గమనార్హం. బీజేపీ మొత్తం ఆదాయంలో సగానికిపైగా ఎలక్టోరల్ బాండ్లు ఉన్నాయి.

కాళేశ్వరం నిపుణుల కమిటీ రాక పట్ల ఉత్తమ్ హర్షం

(మొదటిపేజీ తరువాయి)

సహకరిస్తామని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కుంగిపోయిన మెడిగడ్డ బ్యారేజ్‌ను గతంలో నేషనల్ డ్యామ్ సెఫ్టి అథారిటీ పరిశీలించి, నీటిని ఖాళీ చేయాలని సూచించిందని గుర్తు చేశారు.

అథారిటీ సూచన మేరకే రాష్ట్ర ప్రభుత్వం నీటిని ఖాళీ చేస్తుందన్నారు. ఈ విషయంలో బీఆర్ఎస్ రాజకీయాలు చేస్తూ.. నీటిని నింపాలని డిమాండ్ చేయడం బాధ్యతారాహిత్యమన్నారు.

బలహీన వర్గాలపై నిర్లక్ష్యం

ప్రజలమధ్య విద్వేషాలు రెచ్చగొడుతున్నారు : బీజేపీపై రాహుల్ గాంధీ ఫైర్

- దేశ రక్షణకు 'ఇండియా" గెలుపు అనివార్యం : సీతారాం ఏచూరి
- యూపీలో 80, బీహార్‌లో 40 సీట్లు గెలవడం ద్వారా బీజేపీ ప్రమాదాన్ని నివారించాలి : అఖిలేష్‌యాదవ్
- కేంద్రం బెదిరింపులకు భయపడం: తేజస్వీయాదవ్
- విజయవంతంగా ఆర్జేడీ జన్ విశ్వాస్ ర్యాలీ





పాట్నా : దేశంలో 73శాతం ఉన్న బలహీన వర్గాల ప్రజలను కేంద్రంలోని మోడీ ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ఆరోపించారు. ఆదివారం బిహార్ రాజధాని పట్నాలో ఆర్‌జేడీ ఏర్పాటు చేసిన జన్ విశ్వాస్ ర్యాలీలో పాల్గొన్న రాహుల్, బీజేపీపై పరోక్షంగా విరుచుకుపడ్డారు. ఒక పార్టీ ప్రజల మధ్య విద్వేషాలు రెచ్చగొడుతోందని, కానీ తాము విద్వేషపు మార్కెట్‌లో ప్రేమ దుకాణం తెరుస్తున్నామని చెప్పారు. ఈ ప్రభుత్వ పాలనలో రైతులు, యువత ఇలా ప్రతి ఒక్కరికీ అన్యాయం జరుగుతోందని ఆరోపించారు.

"దేశంలో ఏదైనా మార్పు జరుగుతుంటే, అది మొదటగా బిహార్‌లోనే ప్రారంభమవుతుంది. ఆ తర్వాత దేశమంతా వ్యాపిస్తుంది. బిహార్ దేశ రాజకీయాలకు ప్రధానమైంది. ప్రస్తుతం దేశంలో రెండు సిద్ధాంతాల మధ్య యుద్ధం జరుగుతోంది. ఒకవైపు ద్వేషం, హింస, అహంకారం ఉంటే, మరోవైపు ప్రేమ, గౌరవం, సోదరభావం ఉంది. ఇండియా కూటమి గురించి ఒక్క మాటలో చెప్పాలంటే, విద్వేషపు మార్కెట్‌లో ప్రేమ దుకాణం."య అన్నారు.

"ప్రధానమంత్రి ఇద్దరు, ముగ్గురు కుబేరుల కోసమే పనిచేస్తారు. వారికి గత పదేండ్లలో రూ.16లక్షల కోట్ల మేర రుణమాఫీ చేశారు. కానీ దేశంలో రైతులు, కార్మికులకు ఎంత రుణమాఫీ చేశారు? అందుకే దేశంలో అసహనం పెరిగిపోతోంది. గత 40 ఏండ్లలో ఎన్నడూ లేనంతగా దేశంలో నిరుద్యోగం పెరిగిపోయింది. దేశంలో వెనుకబడిన వర్గాల వారు ఎంతమంది ఉన్నారో తెలుసా? 50 శాతం. దళితులు ఎంతమంది ఉన్నారో తెలుసా? 15శాతం గిరిజనులు 8 శాతం ఉన్నారు. మొత్తం 73 శాతం మంది. దేశంలోని పెద్ద కంపెనీల యజమానుల జాబితా తీసుకుంటే అందులో ఈ 73 శాతానికి చెందిన వారు ఒక్కరు కూడా ఉండరు. ప్రైవేటు ఆసుపత్రులు, విద్యాసంస్థల యజమానుల జాబితా తీసినా, ఈ 73శాతానికి చెందిన వారు ఒక్కరూ ఉండరు. కేంద్ర ప్రభుత్వం బడ్జెట్ నుంచి రూ.100 ఖర్చు చేస్తే, ఈ 73 శాతానికి 6 రూపాయలు మాత్రం దక్కుతోంది. ఈ 73శాతానికి అగ్ర వర్ణ పేదలను కూడా కలిపితే వారికి ఈ దేశంలో ఎలాంటి అవకాశాలు లేవు." అని రాహుల్ గాంధీ అన్నారు.

'కేంద్ర దర్యాప్తు సంస్థలతో విపక్షాలకు బెదిరింపులు'

బీజేపీ సర్కారు సీబీఐ, ఈడీ, ఐటీ సంస్థలను విపక్షాలపైకి సంధించి భయపెట్టాలని చూస్తోందని ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్ ఆరోపించారు. ప్రతిగా అవినీతిపరులను బీజేపీలో చేర్చుకుంటూ, వారు సచ్చీలురు అనే సర్టిఫికెట్ ఇస్తోందని మండిపడ్డారు.

"మీరు (బీజేపీ) ఎంతగా భయపెట్టాలని చూసినా, ఎంతగా అణగదొక్కాలని చూసినా మా తండ్రి ఏమాత్రం వెనకడుగు వేయలేదు, భయపడలేదు. లాలూ భయపడనప్పుడు, ఆయన కుమారుడు భయపడతాడా? చివరి శ్వాస వరకు పోరాడతాం. గతంలో రాహుల్ గాంధీకి ఈడీ సమన్లు ఇచ్చారు. తాజాగా ఉత్తర్‌ప్రదేశ్‌లో మా పొత్తులు ఖరారు కాగానే, అఖిలేశ్ యాదవ్‌కు సీబీఐ నోటీసులు ఇచ్చారు. మాకైతే కుటుంబసభ్యులం దరికీ సమన్లు పంపారు. కానీ భయపడే వ్యక్తులం కాదు. మీరు వాషింగ్ మెషిన్‌ను చూశారు కదా. అవినీతిపరులంతా బీజేపీలోకి వెళ్లగానే వారంతా మంచి వారు అయిపోతారు. బీజేపీ వాషింగ్ మెషిన్‌తోపాటు చెత్తబుట్ట పార్టీగానూ మారిపోయింది. ఎందుకంటే మిగతా పార్టీల్లో చెత్త అంతా వెళ్లి బీజేపీలో చేరుతోంది." అని తేజస్వీ యాదవ్ విరుచుకుపడ్డారు.

యూపీ, బీహార్ ఎంపీ సీట్లపై అఖిలేశ్ వ్యాఖ్యలు

యూపీలోని 80 సీట్లు, బీహార్‌లోని 40 స్థానాలు.. మొత్తం 120 లోక్‌సభ స్థానాల్లో బీజేపీని ఓడించి ఇండియా కూటమి దక్కించుకోవాలనీ, దీంతో కాషాయపార్టీకి రాజకీయంగా ఎదురుదెబ్బ తగులుతుందని వ్యాఖ్యానించారు. 2024లో రాబోయే 'సంవిధాన్ మంథన్'.. రాజ్యాంగాన్ని రక్షించేవారికి, ఉల్లంఘించేవారికి మధ్య ఏర్పడే వైష మ్యాలను వెలుగులోకి తెస్తుందని అఖిలేశ్ చెప్పారు.

మోడీ హఠావో, దేశ్ బచావో : సీతారాం ఏచూరి

లాలూ యాదవ్..మోడీపై విమర్శల దాడి ఎక్కుపెట్టారు. "మోడీకి సొంత కుటుంబం లేకపోతే మనం ఏమి చేయగలం? ఆయన రామ మందిరం గురించి గొప్పగా చెప్పుకుంటాడు. ఆయన నిజమైన హిందువు కూడా కాదు. హిందూ సంప్రదాయంలో ఒక కొడుకు తన తల్లితండ్రుల మరణానంతరం తల వెంట్రుకలు, గడ్డం తీయాలి. తల్లి చనిపోయినప్పుడు మోడీ అలా చేయలేదు" అని అన్నారు. సీపీఐ(ఎం) నేత సీతారాం ఏచూరి కూడా బీజేపీ ప్రభుత్వంపై, వారి విధానాలపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. 'మోడీ హఠావో, దేశ్ బచావో' అంటూ నినాదాలు చేశారు. ప్రతికూల వాతావరణం ఉన్నప్పటికీ ర్యాలీలో పాల్గొనేందుకు మద్దతుదారులు ముందుగానే చేరుకోవడంతో కార్యక్రమానికి భారీ సంఖ్యలో ప్రజలు తరలివచ్చారు.

సంపన్నుల కోసమే 'రైల్వే' విధానాలు

కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ

న్యూఢిల్లీ: సంపన్నులను దష్టిలో ఉంచుకొనే కేంద్ర ప్రభుత్వం భారతీయ రైల్వేలో విధానాలను రూపొందిస్తోందని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ఆరోపించారు. మోడీ ప్రభుత్వం వివిధ చార్జీల పేరుతో రైల్వే టికెట్టు ధరలను పెంచడమే కాక.. ఏసీ బోగీలను గణనీయంగా పెంచుతూ సాధారణ ప్రయాణికులకు రైల్వేలను దూరం చేస్తున్నదని దుయ్యబట్టారు. భారతీయ రైల్వే విధానాలను వ్యతిరేకిస్తూ ఎక్స్ వేదికగా ఆయన మండిపడ్డారు.

"పేదలు అడుగు పెట్టలేని ఉన్నత వర్గం రైలును చూపించి ప్రజలను మభ్యపెడుతున్నారు. డైనమిక్ చార్జీల పేరుతో దోపిడీ, పెరుగుతున్న క్యాన్సలేషన్ రుసుం, ప్లాట్‌ఫామ్ టికెట్ల ధరల పెంపు, ఇతర పేర్లతో టికెట్లపై ఏటా 10 శాతం పెంచుతున్నారు. వయోవద్ధులకిచ్చే మినహాయింపులను వెనక్కి తీసుకోవడం ద్వారా గడిచిన మూడేండ్లలో ప్రభుత్వం రూ.3700 కోట్ల ఆదాయం పొందింది. కార్మికులు, రైతులే కాక విద్యార్థులు ప్రయాణించే జనరల్ బోగీలను తగ్గిస్తూ ఏసీ కోచ్‌లను గణనీయంగా పెంచుతున్నారు. దీంతో పేదలు, మధ్యతరగతి ప్రయాణికులకు రైల్వేల్లో ప్రాధాన్యత లేకుండా పోయింది' అని రాహుల్ గాంధీ పేర్కొన్నారు.

ఇలాంటి దోపిడీలను దాచేందుకే రైల్వే ప్రత్యేక బడ్జెట్‌కు ముగింపు పలికారని రాహుల్ గాంధీ ఆరోపించారు. రైల్వేపై ఆధారపడే కోట్ల మంది ప్రజలను మోసం చేస్తున్నారని మండిపడ్డారు.



బాధ్యత మరిచిన మీడియా

- ఎన్నికల్లో అవకతవకలపై సరైన స్పందన కరువు
- బీజేపీకి అనుకూలంగా వ్యవహారం
- తప్పుబడుతున్న సామాజికవేత్తలు, మేధావులు

న్యూఢిల్లీ : దేశంలో మీడియా పాత్ర ఎంతో విలువైనది. సమాజంలో జరిగే అన్యాయాన్ని ప్రశ్నించి.. ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా నిలుస్తూ ఎంతో కీలక పాత్రను పోషిస్తున్నది. అయితే, అంతటి బాధ్యత కలిగిన మీడియా దానికి విరుద్ధంగా వ్యవహరిస్తున్నది. దేశంలో ఎక్కడైనా ఎన్నికలు సజావుగా, పూర్తి పారదర్శకంగా జరిగేలా ఎన్నికల సంఘానికి తోడ్పాటునందించాల్సిన బాధ్యత మీడియాపై ఉన్నది. అయితే, ఒక వర్గం మీడియా మాత్రం తన బాధ్యతను విస్మరిస్తున్నది. అధికార బీజేపీకి అనుకూలంగా వ్యవహరిస్తున్నది. అన్యాయం జరిగినా.. దానిని కప్పి ఉంచేలా వార్తలను ప్రసారం చేస్తున్నది. ఈ రకం మీడియా తీరుపై ఇటు సామాజికవేత్తలు, మేధావులు ఆందోళనను వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి మీడియా పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు.

సదరు మీడియా డబ్బుకు దాసోహమంటూ అసత్యాలను ప్రచారం చేస్తున్నది. లేనిది ఉన్నట్టు చూపిస్తూ బీజేపీకి కనీవిని ఎరుగని ప్రచారం కల్పిస్తున్నదని విశ్లేషకులు చెప్తున్నారు. గత కొన్ని వారాలుగా జరిగిన రెండు పరిణామాలు ఇలాంటి ఆరోపణలకు బలాన్ని చేకూరుస్తున్నాయి. ఈ ఏడాది జనవరి 30న చండీగఢ్ మున్సిపల్ కార్పొరేషన్‌కు మేయర్ ఎన్నిక, దాదాపు ఒక నెల తర్వాత రాజ్యసభ ఎన్నికలకు సంబంధించి హిమాచల్ ప్రదేశ్ అసెంబ్లీలో నెలకొన్న రాజకీయ అనిశ్చితిని విశ్లేషకులు ఉదహరిస్తున్నారు.

చండీగఢ్ మేయర్ ఎన్నికల విషయంలో రిటర్నింగ్ అధికారి అవకతవకలకు పాల్పడ్డాడనీ, దీనిని సుప్రీంకోర్టు సైతం గుర్తించిందని సామాజికవేత్తలు గుర్తు చేశారు. ఇలాంటి విషయాలను బాధ్యత గల మీడియా ఎందుకు గుర్తించలేకపోతున్నదని వారు ప్రశ్నిస్తున్నారు. విలువలకు తిలోదకాలిస్తున్న ఒక వర్గం మీడియా.. ధనార్జనే ధ్యేయంగా పని చేస్తున్నదని వారు అంటున్నారు. ఇలాంటి మీడియా కారణంగా నిష్పక్షపాతంగా పని చేసేవారు సైతం చెడ్డ పేరును ఎదుర్కోవాల్సి వస్తున్నదని ఆందోళనను వ్యక్తం చేస్తున్నారు. ఇటు కేంద్రంలో, అటు ఆయా రాష్ట్రాల్లో ఉన్న బీజేపీ ప్రభుత్వాలు తమ ధన, అధికార బలంతో మీడియాను తమకు అనుకూలంగా మార్చుకొని నకిలీ వార్తలను ప్రచారం చేస్తున్నాయని విశ్లేషకులు అంటున్నారు. ఈ విధానాన్ని మీడియా విడనాడి.. సమాజ హితం కోసం పాటుపడాలని సూచిస్తున్నారు.

రైతన్నలు చనిపోయినా..
కరుణించని కేంద్రం

- అన్నదాతలకు లభించని హామీ
- ఇప్పటి వరకు ఆరుగురు మృతి
- 'ఢిల్లీ చలో'పై చలనం లేని మోడీ సర్కారు

న్యూఢిల్లీ : రైతన్నల 'ఢిల్లీ చలో' మార్చ్‌ను కేంద్రం అంత సీరియస్‌గా తీసుకోవటం లేదు. 20 రోజుల పాటు జరిగిన ఆందోళనలో ఆరుగురు పంజాబ్ రైతులు చనిపోయారు. కానీ కేంద్రంలో ఎలాంటి చలనమూ రాలేదు. ప్రభుత్వం నుంచి ఒక ఒప్పందమూ కనిపించలేదు. 'ఢిల్లీ చలో' పాదయాత్ర 20వ రోజుకు చేరుకోవటంతో శంభు, ఖానౌరీ సరిహద్దుల్లో జరిగిన నిరసనలో ఆరుగురు మృతి చెందారు. శుభకరన్‌ను కాల్చి చంపటంతోపాటు 500 మందికి పైగా రైతులు గాయపడ్డారు. ఇంత పోరాడినా.. ప్రభుత్వంలో చలనం లేదని రైతులు, రైతు సంఘాల నాయకులు, సామాజిక కార్యకర్తలు మోడీ సర్కారుపై ఆగ్రహాన్ని వ్యక్తం చేస్తున్నారు.

ఇప్పటివరకు మరణాలు

పాటియాలా జిల్లాలోని ఆర్నో గ్రామానికి చెందిన కర్నైల్ సింగ్ (62) ఫిబ్రవరి 26న మరణించారు. గురుదాస్‌పూర్ జిల్లా చచెకి గ్రామానికి చెందిన జ్ఞాన్ సింగ్ (63) ఫిబ్రవరి 14న మృతి చెందాడు. పాటియాలా జిల్లాకు చెందిన మంజీత్ సింగ్ (72) ఫిబ్రవరి 18న, నరీందర్‌పాల్ సింగ్ (43) ఫిబ్రవరి 20న మరణించారు. భటిండా జిల్లాలోని బల్లోహ్ గ్రామానికి చెందిన శుభకరన్ సింగ్ ఫిబ్రవరి 21న చనిపోయాడు. ఫిరోజ్‌పూర్ జిల్లాలోని మన్సూర్‌దేవాకు చెందిన గుర్జంత్ సింగ్ (23) ఫిబ్రవరి 23న ప్రమాదంలో మరణించాడు.


అజయ్ మిశ్రాకు టికెట్ కేటాయించటంపై రైతుల ఆగ్రహం

బీజేపీ నేత అజయ్ మిశ్రా తేనీకి లోక్‌సభ టికెట్ కేటాయించడం శంభు, ఖానౌరీ సరిహద్దుల్లో నిరసన తెలుపుతున్న రైతు సంఘాల నేతలకు ఆగ్రహం తెప్పించింది. 2021లో లఖింపూర్ ఖేరీలో నలుగురు రైతులను చంపినట్టు తేని కుమారుడు ఆశిష్‌పై ఆరోపణలు ఉన్నాయి. వందలాది మంది రైతులు మరణించినా, గాయపడినప్పటికీ, సంయుక్త కిసాన్ మోర్చా (నాన్ పొలిటికల్), కిసాన్ మజ్దూర్ మోర్చా (కేఎంఎం) బ్యానర్‌పై నిరసనలు చేస్తున్న సంఘాలకు కేంద్రం నుంచి ఇప్పటికీ ఎలాంటి హామీ లభించకపోవటం గమనార్హం.

రాజకీయాలకు బీజేపీ ఎంపీ హర్షవర్ధన్ గుడ్‌బై

టికెట్ నిరాకరించిన బీజేపీ

- టికెట్ ఇచ్చినా పోటీ చేయను అంటున్న మరో బీజేపీ నేత పవన్‌సింగ్
- వచ్చే లోక్‌సభ ఎన్నికలకు తొలి జాబితా విడుదల చేసిన మరునాడే ప్రకటన
- ఇప్పటికే తప్పుకున్న ఎంపీలు గౌతమ్ గంభీర్, జయంత్ సిన్హాలు



న్యూఢిల్లీ : వచ్చే లోక్‌సభ ఎన్నికలకు బీజేపీ తొలి జాబితా ప్రకటించిన మరునాడే దేశ రాజధాని ఢిల్లీలోని చాందినీ చౌక్ లోక్‌సభ స్థానం నుంచి ఎంపీగా కొనసాగుతున్న డాక్టర్ హర్షవర్ధన్ రాజకీయాలకు బై బై చెప్పారు. అయితే హర్షవర్ధన్‌కు ఈ సారి టికెట్ ఇచ్చేందుకు హైకమాండ్ నిరాకరించింది. ఆయన స్థానంలో ప్రవీణ్ ఖండేల్వాల్‌కు టికెట్ ఇచ్చింది. దీంతో నిరాశకు గురైన ఆయన రాజకీయాల నుంచి తప్పుకుంటున్నట్టు ప్రకటించారు. ఇప్పటికే ఎంపీ గౌతమ్ గంభీర్, హజారీభాగ్ ఎంపీ జయంత్ సిన్హా క్రియాశీల రాజకీయాల నుంచి తమను తప్పించాలని కోరారు. తాజాగా మాజీ కేంద్రమంత్రి హర్షవర్ధన్ సైతం రాజకీయాలకు దూరంగా ఉండాలని నిర్ణయించుకున్నారు. సోషల్ మీడియా ద్వారా ఈ విషయాన్ని ధ్రువీకరించారు.

బీజేపీ ఎంపీ, డాక్టర్ హర్షవర్ధన్ ముప్పై సంవత్సరాలకుపైగా రాజకీయాల్లో కొనసాగారు. ఐదుసార్లు అసెంబ్లీ, రెండుసార్లు పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ చేసి గెలుపొందారు. అలాగే పార్టీ రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల్లోనూ కీలక పదవులను చేపట్టారు. ఇప్పుడు రాజకీయాల నుంచి తప్పుకుని ఆయన మళ్లీ డాక్టర్ వత్తిని కొనసాగించేందుకు నిర్ణయం తీసుకున్నారు. కష్ణనగర్‌లోని ఈఎన్‌టీ క్లినిక్‌కు తిరిగి వెళ్లేందుకు ప్రణాళికను సిద్ధం చేసుకున్నారు. 50 సంవత్సరాల కిందట పేదలకు సహాయం అందించాలనే కోరికతో కాన్పూర్‌లోని ఎస్ఎస్‌వీఎం మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ అడ్మిషన్ తీసుకున్నానని.. ఆ సమయంలో మానవాళికి సేవ చేయడమే ఆయన నినాదమని పేర్కొన్నారు.

అయితే, అప్పటి ఆర్ఎస్ఎస్ నాయకత్వం అభ్యర్థన మేరకు హర్షవర్ధన్ రాజకీయాల్లోకి వచ్చానన్నారు. ఈ సందర్భంగా పార్టీ కార్యకర్తలు, అభిమానులకు, మద్దతు తెలిపిన ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. మూడు దశాబ్దాలకుపైగా సాగిన ప్రయాణానికి ఎంతో దోహదపడ్డారన్నారు. ఇదిలా ఉండగా.. బీజేపీ తమ తొలి జాబితాలో ఢిల్లీలోని ఐదు స్థానాలకు అభ్యర్థులను ప్రకటించింది. ఇందులో చాందినీ చౌక్, న్యూఢిల్లీ, ఈశాన్య ఢిల్లీ, దక్షిణ ఢిల్లీ, పశ్చిమ ఢిల్లీ స్థానాలున్నాయి. ఈశాన్య ఢిల్లీ ఎంపీ మనోజ్ తివారీ మినహా సిట్టింగ్‌లకు మళ్లీ సీట్లు ఇచ్చేందుకు బీజేపీ అధిష్ఠానం నిరాకరించింది.

పోటీ చేయలేను :ఆసన్‌సోల్(పశ్చిమబెంగాల్) అభ్యర్థి భోజ్‌పురి సింగర్, నటుడు పవన్‌సింగ్

బీజేపీ తొలి జాబితాలో చోటు దక్కించుకున్న భోజ్‌పురి సింగర్, నటుడు పవన్ సింగ్ తాను పోటీ చేయలేనని ఎక్స్ వేదికగా ప్రకటన చేశాడు. దీంతో జాబితా విడుదల చేసిన మరుసటి రోజే ఆ పార్టీకి చుక్కెదురయ్యింది.

"భాజపా అగ్ర నాయకత్వానికి హదయపూర్వక కతజ్ఞతలు తెలియజేస్తున్నా. నాపై విశ్వాసం ఉంచి పశ్చిమ బెంగాల్‌లోని ఆసన్‌సోల్ అభ్యర్థిగా ప్రకటించింది. కానీ, కొన్ని కారణాల వల్ల అక్కడి నుంచి పోటీ చేయలేక పోతున్నాను" అని భాజపా అధ్యక్షుడు జేపీ నడ్డాకు పవన్ సింగ్ తెలియజేశాడు.

వారణాసి నుంచే మోడీ పోటీ

లోక్‌సభ పోరులో బరిలో ఉండే అభ్యర్థుల తొలి జాబితాను విడుదల చేసిన బీజేపీ కొంత మంది పాతవారిని తప్పించి, కొత్తవారికి అవకాశం కల్పించింది. వారణాసి నుంచి ప్రధాని నరేంద్ర మోదీ, గాంధీనగర్ నుంచి అమిత్ షా, లఖ్‌నవూ నుంచి రాజ్‌నాథ్ సింగ్ బరిలో నిలుస్తున్నారు. తొలి జాబితాలో 28 మంది మహిళలుండగా.. 47 మంది 50 ఏండ్లలోపువారే ఉండటం గమనార్హం.



ఆర్టీసీ బస్సులో ప్రయాణించిన మంత్రి పొన్నం

- మహిళా ప్రయాణికులతో ఉచిత ప్రయాణ విషయాలను పంచుకున్న మంత్రి
- షాద్‌నగర్ వరకు నిలబడే ప్రయాణం

నవతెలంగాణ-షాద్‌నగర్

రాష్ట్ర రోడ్డు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆర్టీసీ బస్సులో ప్రయాణించారు. ఆదివారం మహబూబ్‌నగర్ జిల్లాలో గౌడ సంఘ సమావేశానికి వెళుతున్న ఆయన.. హైదరాబాద్ నుంచి షాద్‌నగర్ వరకు ఆర్టీసీ బస్సులో ప్రయాణించారు. నారాయణపేట డిపోకు చెందిన బస్సులో ఆయన ప్రయాణించి ప్రయాణికులతో మాట్లాడారు. బస్సులో ఆయన కూర్చోకుండా నిల్చుండే ప్రయాణికులతో ఉచిత ప్రయాణం గురించి అడిగి తెలుసుకున్నారు. మహిళా ప్రయాణికులతో వారి క్షేమ సమాచారం అడిగి తెలుసుకోవడంతో పాటు ఉచిత ప్రయాణం ఎలా ఉందని అందరిని ప్రశ్నించారు. ఉచిత ప్రయాణం పట్ల మహిళా ప్రయాణికులు ఎంతో సంతోషం వ్యక్తం చేయడంతో ఇది కాంగ్రెస్ ప్రభుత్వం ఘనత అని చెప్పారు. షాద్‌నగర్ శివారులో హోటల్ 44 దాబా వద్ద ఆయన బస్సు దిగారు. బస్సు దిగగానే ఆయనకు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మాజీ ఎమ్మెల్యే ప్రతాప్ రెడ్డి, మాజీ జడ్పీటీసీ శ్యాం సుందర్ రెడ్డి, మాజీ ఎంపీపీ శివశంకర్ గౌడ్ తదితరులు స్వాగతం పలికారు.

కాంకేర్ అడవుల్లో ఎదురుకాల్పులు


- పోలీస్ కానిస్టేబుల్ సహా ఒక మావోయిస్టు మృతి
- వివరాలు వెల్లడించిన ఏఎస్పీ

నవతెలంగాణ-చర్ల

సరిహద్దు చత్తీస్‌గడ్‌లోని కాంకేర్ జిల్లా అంబుజమాడు దండకారణ్యం ఛోటేబెథియా పోలీస్ స్టేషన్ పరిధి హిందూర్ అడవుల్లో ఆదివారం పోలీసులు, మావోయిస్టులకు మధ్య గంట పాటు జరిగిన ఎదురుకాల్పుల్లో ఓ మావోయిస్టు మృతి చెందారు. మావోయిస్టులు జరిపిన కాల్పుల్లో కాంకేర్ జిల్లా సంఘం పఖంజోర్ గ్రామ నివాసి బస్తర్ ఫైటర్‌లో విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ రమేష్ కురేతి సైతం మృతి చెందారు. సెర్చ్ ఆపరేషన్ ఘటనా స్థలంలో మావోయిస్టు మృతదేహంతో పాటు ఏకే 47 తుపాకీ, మావోయిస్టుల దైనందిక సామగ్రి, విప్లవ సాహిత్యం లభించిందని కాంకేర్ ఏఎస్పీ వివరించారు. తప్పించుకున్న మావోయిస్టుల కోసం పోలీసు బలగాలు భారీగా అడవులను జల్లెడ పడుతున్నాయని వివరించారు.

సామాజిక సమానత్వం కోసం పోరాడాలి

- జయపురంలో ఘనంగా అంబేద్కర్ విగ్రహావిష్కరణ : రిటైర్డ్ ఐఆర్‌టీఎస్ డాక్టర్ ఏ.భరత్ భూషణ, కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్కైలాబ్ బాబు



నవతెలంగాణ-మరిపెడ

భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగాన్ని అట్టడుగు వర్గాల ప్రజలకు దక్కకుండా నేటి ప్రభుత్వాలు కాలరాస్తున్నాయని రాజకీయ ఆర్థిక, సామాజిక, సమానత్వం సాధన కోసం ప్రతి గ్రామంలో అంబేద్కర్ ఆశయాలను ముందుకు తీసుకువెళ్లాలని రిటైర్డ్ ఐఆర్‌టీఎస్ డాక్టర్ ఏ.భరత్ భూషణ్ పిలుపు నిచ్చారు. ఆదివారం మహబూబాబాద్ జిల్లా నరసింహులపేట మండలం జయపురం గ్రామంలో స్థానిక అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన అంబేద్కర్ విగ్రహాన్ని ఉస్మానియా యూనివర్సిటీ తెలుగు శాఖ అధ్యక్షులు చింతకింద కాసిమ్, కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తప్పట్ల స్కైలాబ్ బాబు, ఆంధ్రప్రదేశ్ సామాజికవేత్త చిర్ర గోపాల్‌తో కలిసి భరత్ భూషణ్ ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రాజ్యాంగం కల్పించిన భావ స్వేచ్ఛ ప్రకటనకు ఆటంకం కలుగుతుందన్నారు. విద్యార్థులు.. హక్కుల కోసం పోరాడితే దాడులు చేస్తున్నారని, దేశ బొద్దున రైతులు తమ హక్కుల కోసం ధర్నాలు చేస్తుంటే వారిని చితకబాదుతున్నారే తప్ప వారి సమస్యలను పరిష్కరించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని రాజ్యాంగం లో హక్కు కల్పించినప్పటికీ దాన్ని అమలు చేయడం లేదన్నారు. ప్రొఫెసర్ చింతకింద కాసిం మాట్లాడు తూ.. దేశంలో రైతులు, మహిళలు, విద్యార్థులు, దళితులకు ఎక్కడ చూసినా అవమానా లు జరుగు తున్నాయన్నారు. మహిళలు, దళితులపై దాడులు, అవమానాలు పెరుగుతున్నా యన్నారు. ఉద్యోగాల రిజర్వేషన్లలో అన్యాయం జరిగినప్పుడు ప్రశ్నించే వారి గొంతు నొక్కుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వీటన్నింటికీ కారణం కుల, మత రాజకీయాలతో దేశాన్ని పరిపాలించడమేనని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రపంచంలో ఎక్కడా లేని కుల పీడన ఈ దేశంలో ఉందని, వాటిని బద్దలు కొట్టి సమ సమాజ స్థాపనకు యువత ముందుకు రావాలని కోరారు.

స్కైలాబ్‌బాబు మాట్లాడుతూ.. ప్రపంచంలో మేధావులు ఇద్దరే ఇద్దరని, వారే కార్ల్ మార్క్స్, బీఆర్ అంబేద్కర్ అని అన్నారు. దేశంలో ఏ గ్రామంలో చూసినా అంబేద్కర్ విగ్రహాలు ఉన్నాయని, అయన్ను స్మరించుకోవడానికి ఇది ఒక అవకాసమన్నారు. కానీ విగ్రహాల కంటే యువతకు విజ్ఞానాన్ని అందించేలా లైబ్రరీలు, విజ్ఞాన కేంద్రాలు నిర్మించడం మంచిదని తెలిపారు. ప్రతి గ్రామంలో అంబేద్కర్ విజ్ఞాన కేంద్రాలు నిర్మించి యువత.. సామాజిక న్యాయం, సమానత్వం కోసం పోరాడేందుకు స్ఫూర్తి పొందాలని కోరారు. కార్యక్రమంలో జంపాల అశోక్, చందు వెంకన్న, ఎస్ఐ సతీష్, కల్లు గీత కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు గునిగంటి మోహన్, జిల్లా ప్రధాన కార్యదర్శి దుడ్డెల రామ్మూర్తి, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు గుగ్గిళ్ళ పిరయ్య, సామాజికవేత్త సోమవారపు వీరస్వామి, విగ్ర ప్రతిష్ఠ కమిటీ అధ్యక్షులు మందుల యాకూబ్, ఉపాధ్యక్షులు మందుల అర్జున్, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

తగ్గనున్న వరి దిగుబడి..

గత ఎనిమిదేండ్లలో ఇదే తొలిసారి

ముంబై: దేశంలో గత ఎనిమిదేండ్లలో తొలిసారిగా వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో వరి దిగుబడులు తగ్గే అవకాశం ఉన్నదని కేంద్ర వ్యవసాయ శాఖ అంచనా వేసింది. ఈ ఏడాది జూన్‌తో ముగిసే 2023–24 పంటకాల సంవత్సరంలో వరి ఉత్పత్తి 123.8 మిలియన్ మెట్రిక్ టన్నులకు పడిపోతుందని తెలిపింది. గత ఏడాదితో పోలిస్తే గోధుమ ఉత్పత్తిలో మాత్రం 1.3 శాతం పెరుగుదల కనిపిస్తుందని అంచనా వేసింది. గతేడాది 110.6 మిలియన్ టన్నుల గోధుమలు ఉత్పత్తి కాగా.. ఈ ఏడాది 112 మిలియన్ టన్నులకు పెరిగే అవకాశం ఉన్నదని పేర్కొన్నది. మరోపక్క బియ్యం ఎగుమతులపై ఆంక్షలను కొనసాగించే అవకాశం ఉన్నదని నిపుణులు అంటున్నారు.

మార్పు తప్పని కాలం



బహుశా చీకటి గుహల్లో నివసించే ఉంటాం!
గతం తాలూకు వాసనలు
ఎప్పటికీ చుట్టుకునే ఉంటాయేమో!
బూజు జల్లెళ్ళ రాతి గోడలు, సాలెగూళ్ళూ
దుమ్ము పేరుకుపోయిన నేల
అక్కడక్కడా పగుళ్ల బాసిన దారి
సందుల నుండి వరుస కట్టి నడిచే చీమలబారు
వాటి తోకల వెంట ఆహారం
అటూ ఇటూ అప్పుడప్పుడూ కదిలే బల్లుల కిచకిచలు
ఆ చివర్ల పగుళ్ళనుండి చుక్కలు చుక్కలుగా జారే
నీటి బిందువుల తాళం గుంపులుగా ముచ్చటిస్తూ
వాటి కోరమీసాలతో పలకరించుకుని
ఐదారు కాళ్ళను ఒకేసారి కదిలిస్తూ నడిచే జెర్రిముఖాలు
కలుగుల్లో దూరుతూ బైటకు లోపలికీ
గునగునా పరుగెడుతూ ఎలుకల గారడీ
మట్టిని కప్పుకొని గుట్టుగా కూడుండే తేళ్ళ కుప్పలు
వాటిదారినవి కదులుతూ ఓసారి వెనుదిరిగి
మెలికలు చుట్టుకుని ఆటలాడి
నెమ్మదిగా నిశ్శబ్దంలో శబ్దంగా పాకే సర్పాల బుసలు
చీకటికోనలో మిణుకు తీగలల్లుతూ మిణుగురుల నక్షత్ర
జ్వాలల్లో భయకంపితమై కీచురాళ్ళ భైరవ సంగీతం
ఊలలు వేస్తూ తల నిక్కబొడిచి చూసే
గుడ్లగూబలు వాటి ఎర్రచారల కళ్ళు
బుయ్యిమంటూ దోమల సయ్యాటలు
బండలను చీల్చుకుని పుట్టిన
ఆ రావిచెట్ల లేత కొమ్మల్లో గండుచీమలు
రసినట్టిపెట్టిన తెల్లనాచు ముద్దలు
తలపైకెత్తకు...
వేళ్ళాడే గబ్బిలాలకు మనిషి ఒక వింత వస్తువు!
అదిగో ఉషోదయం!
సన్నని వెలుగురేఖలు చొరబడ్డాయి
గుహ ముందు రెపరెపలాడుతూ
రంగురంగుల సీతాకోకచిలకలు
పచ్చని చెట్ల గుబుర్లపై వాలి తుర్రుమంటున్న
రకరకాల పక్షులు
ఎక్కడో మావిపూతను కంకుతూ కోకిల....
ఆకాశాన్ని తదేకంగా చూస్తూ
గాలితెమ్మెరలతో ఊసులుపోతుంది వసంతపు వాసన
వసంతగాలి రేగుతుందని
తెగ కూతలు వేస్తుంది కూ కూ అని!
గుహలోకి చొరబడిన వెలుగురేఖల్లో
జీవితమిప్పుడు అందమైన సీతాకోక చిలకల్లా
ఇంద్రధనుస్సుల సుందరాకాశం!!

- అరుణ నారదభట్ల

సమతా భేరి - 'సాక' కథలు

సమాజంలోని అసమానతల మీద సమానతకై సమతా భేరి మోగించే దళిత కథల వార్షిక సమాహారమే 'సాక' దళిత కథా వార్షిక -2022. జంబూ సాహితి ప్రచురించిన దళిత కథా వార్షిక 2022 'సాక' లో ప్రచురితమైన 16 కథలు చదివినప్పుడు ఎందుకో గానీ నాకు తల్లా - పెళ్ళామా సినిమా కోసం సి.నా.రే రాసిన "ప్రాంతాలు వేరైనా మన అంతరంగాలు ఒకటే అన్నా" అన్న పాట గుర్తుకొచ్చింది. ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని 16 మంది కథకుల ప్రచురితమైన కథాసంకలనం ఇది. ప్రాంతాలు వేరైనా దళితులు ఎదుర్కొంటున్న వివక్ష, దోపిడీ, అణిచివేతల వెతలు ఒకటిగానే ఉన్నాయి అని అర్థం చేయించే కథా సంకలనమే 'సాక'.


జంబూ సాహితి తరపున వెలువరించిన ఈ కథా సంకలన సంపాదక వర్గ సభ్యులైన గుడిపల్లి నిరంజన్, సిద్దెంకి యాదగిరి దళిత కథావార్షికలు వెలువరిస్తున్న నేపథ్యం గురించి వివరించారు.

ఈ 16 కథలు వర్తమాన దళిత సాహిత్య దిశకు సంకేతాలు. ఏ సాహిత్యమైనా అకస్మాత్తుగా పైనుండి ఊడిపడదు. సామాజిక అలజడులను సాహిత్యం ప్రతిబింబిస్తుంది. తెలుగు సాహిత్యంలో స్త్రీవాద, దళితవాద, ముస్లింవాద సాహిత్యం అన్న విభజన రాకముందు కూడా మహిళలు, దళితులు, ముస్లింలు సమాజంలో ఎదుర్కొంటున్న వివక్ష, అణిచివేత, వేధింపుల గురించి కథలు, కవిత్వం అడపాదడపా నవలలు వచ్చాయి. అయితే ఇవన్నీ అప్పటి స్థల, కాల, భావజాల ప్రభావం పరిధిలో ఉన్నాయి.

స్వాతంత్రోద్యమ కాలంలో తొలిగా ఈ ఉద్యమం బుద్ధిజీవుల మధ్య, ఎగువ తరగతుల పోరాటంగా మొదలయ్యింది. అప్పట్లో జాతీయ కాంగ్రెస్ నిర్వహించిన ఈ ఉద్యమ స్వరూపం సభలకు, తీర్మానాలకు, మహాజర్ల సమర్పణకు పరిమితమై ఉండింది. 1920 లలో కార్మిక సంఘాల ఏర్పాటు, రైతు సంఘాల ఏర్పాటు తర్వాత శిస్తు తగ్గింపు, దున్నేవాడికే భూమి అన్న నినాదాలతో రైతాంగాన్ని ఆనక కార్మిక సమస్యల మీద తీర్మానాల ద్వారా ఈ రెండు వర్గాల ప్రజానీకాన్ని స్వాతంత్రోద్యమం ఇముడ్చుకోగలిగింది. తద్వారా నూతన శక్తిని సంతరించుకుంది. హరిజనోద్ధరణ నినాదం ద్వారా సమాజంలో గణనీయంగా ఉన్న బలీయమైన దళిత ప్రజానీకాన్ని స్వాతంత్రోద్యమం ఇముడ్చుకుంది. అప్పటికి గానీ స్వాతంత్రోద్యమానికి సమగ్రత చేకూరలేదు. ఉద్యమం మిలిటెంట్ స్వభావం సంతరించుకుంది. నాటికి అంబేద్కర్ భావజాలం ఉన్నప్పటికీ జాతీయ కాంగ్రెస్ భావజాలానిదే పై చెయ్యిగా కొనసాగింది. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తరువాత కూడా చాలాకాలం ఆ భావజాలానిదే పై చెయ్యిగా సాగింది. అందుకే తొలితరం దళిత సాహిత్యంలో మనకు గాంధేయ భావజాల ప్రభావం ఎక్కువగా కనిపిస్తుంది. ఎక్కువలో ఎక్కువగా దళిత సమాజం ఎదుర్కొంటున్న వివక్ష, దోపిడీ, అణిచివేతల పట్ల సమాజం సహానుభూతితో స్పందించాలనే రీతిలో సాహిత్యం వెలువడింది.

అంబేద్కర్ భావజాలం దేశవ్యాప్తంగా అనేక ప్రాంతాల్లో రాజకీయ నిర్మాణ స్వరూపం సంతరించుకున్నాక దళిత సాహిత్యం పెద్ద మలుపు తిరిగింది. తమవైన ఆకాంక్షలను, అభిప్రాయాలను బలంగా వ్యక్తీకరించింది. ప్రశ్నించే ధోరణి ప్రబలంగా ముందుకొచ్చింది. 1980-90 వ దశకానికి వచ్చేసరికి సమాజాన్ని నిగ్గదీసే దశకు చేరింది.

మద్దూరి నగేష్ బాబు, పైడి తెరేష్ బాబు, కలేకూరి ప్రసాద్, నాగప్పగారి సుందరరాజు, సతీష్ చందర్, ఎండ్లూరి సుధాకర్ తదితరుల రచనలు ధిక్కార దశకు సంకేతం. 2010-20 ల దశకానికి వచ్చేసరికి ప్రతిఘటనా దశకు చేరిందని చెప్పుకోవచ్చు.



సాక కథా వార్షికలో ప్రచురితమైన కథల నేపథ్యాన్ని వివరిస్తూ అందులో ప్రచురించబడిన స్వీయ కథ 'సాము'కు కథావస్తువు వాస్తవ ఘటనే అయినప్పటికీ కొంత ఉటోపియన్ ధోరణితో రాసానని స్వరూపరాణి వివరించారు. నాకైతే ఈ కథలో కీలకం 'శరీరం-కర్ర ఈ రెండే మన ఆయుధాలు' అన్న వాక్యం అనిపించింది. భూతం ముత్యాలు రాసిన 'పచ్చనాకు సాక్షి', జిలుకర శ్రీనివాస్ రాసిన 'బురద గుంట కథలు' కూడా 'సాము' కథ మాదిరి దళితుల ఐక్యత, తిరుగుబాటు తత్వాన్ని ప్రతిఫలించే కథలే. జూపాక సుభద్ర రాసిన 'అప్పువడ్డది సుమీ' కథ గుజరాత్‌లో ఉనా ఘటనను గుర్తుకు తీసుకురాక మానదు. చచ్చిన ఆవు చర్మం ఒలిచారని నలుగురు దళిత యువకులను అగ్రవర్ణాలవారు దారుణ హింసకు గురిచేసిన నేపథ్యంలో చంద్రశేఖర్ రావణ్ ఇచ్చిన పిలుపు మేరకు దళితులు చచ్చిన పశు కళేబరాలను తరలించడానికి నిరాకరించి 'గోమాత గోమాత' అని పూజించుకుంటారుగా చచ్చిన మీ 'మాత'లనుమీరే పారేసుకోండి అని ధిక్కార స్వరం వినిపించి అగ్రవర్ణాల్లో గుబులు పుట్టించారు. 'అప్పువడ్డది సుమీ' కూడా దాదాపు అటువంటి ప్రతిఘటననే చిత్రీకరించింది. ఉనా లో పశు కళేబరం అయితే ఈ కథలో ఎయిడ్స్‌తో చనిపోయిన ఒక అగ్రవర్ణ స్త్రీ మృతదేహ ఖననం కథా వస్తువు అయింది. గీల్ల సావులు మన సావులకత్తన్నాయి. "గీల్లు మనకు తరాల తంతెల కాన్నించి బడ్డ రునము, బాకీ, ఎన్నడు దీరుస్తరో" అని మదనపడుతూ చివరికి ఆ శవాన్ని బొందల పెట్టి "ఎంతయినా మనయి ఆర్తిగల్ల పుట్కలే. గీ మన ఆడోల్లు దొరతోని తన్నులువడ్డా యిగులవడ్డా.. ఆడు సచ్చిపోతే ఇంకా మన ఆడోల్లు బోయి యేడ్సీ అత్తరు" - అర్థికల్లా ధర్మంగల్లోల్లు మరి అని తెగుడుకుంటారు.

మెర్సీ మార్గరెట్ రాసిన 'వర్షం సాక్షిగా' కథ స్థూలంగా క్రైస్తవం ఆరాధించేది ఒకే దైవాన్ని అయినా క్యాథలిక్, ప్రొటెస్టెంట్ మతస్థుల మధ్య వైరుధ్యం, వ్యతిరేకతలు ఎందుకు ఉన్నాయి' అన్న ప్రశ్నను లేవదీస్తుంది. అంతకు మించి అయ్యప్పమాల లాగానే మరియమ్మ మాల వేసుకుని శ్రమ దినాలలో నిష్ఠగా దీక్ష చేసే సంప్రదాయం క్రైస్తవంలోకి ఎలా వచ్చింది? క్రైస్తవం కూడా హైందవీకరించబడుతుందా లేక మునుపు హిందువులుగా ఉన్నవాళ్లు తమకు నచ్చిన దేవుణ్ణి తమకు తెలిసినట్లే పూజించుకుంటున్నారా అన్న కీలకమైన ప్రశ్న లేవనెత్తుతుంది. కొంచెం ఆలోచిస్తే అర్థమయ్యే విషయమే అని కథాపరంగా రాసిందేమో గానీ అసలు ప్రశ్న ఇదే. జూపాక సుభద్ర గతంలో సమ్మక్క సారలక్క జాతర క్రమంగా ఎలా హైందవీకరించబడుతుందో ఒక కథలో వివరించారు. ఆర్.ఎస్.ఎస్ కనుసన్నల్లో నడిచే వనవాసి కళ్యాణ్ ఆశ్రమ్ ఆంధ్ర, ఒడిశా, జార్ఖండ్, ఛత్తీస్ ఘడ్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, రాజస్థాన్ రాష్ట్రాలలో గిరిజన ప్రాంతాల్లో కేంద్రీకరించి పనిచేస్తూ స్థానిక ఆచారాలను, దేవీదేవాలయం హైందవీకరిస్తుంది. సిక్కు, జైన, పార్సీ మతాలు కూడా హిందూ మతంలో భాగమే అని ప్రకటిస్తుంది. చర్చి వ్యవహారనామం చాలా ప్రాంతాల్లో యేసు ఆలయం, దేవాలయంగా మారిపోవడం రాబోయే ప్రమాదానికి సూచిక అని గమనించక తప్పదు.

దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తరువాత కూడా చాలాకాలం ఆ భావజాలానిదే పై చెయ్యిగా సాగింది. అందుకే తొలితరం దళిత సాహిత్యంలో మనకు గాంధేయ భావజాల ప్రభావం ఎక్కువగా కనిపిస్తుంది. ఎక్కువలో ఎక్కువగా దళిత సమాజం ఎదుర్కొంటున్న వివక్ష, దోపిడీ, అణిచివేతల పట్ల సమాజం సహానుభూతితో స్పందించాలనే రీతిలో సాహిత్యం వెలువడింది.

అగ్రవర్ణాల దోపిడీ కుట్రలో దళితులు ఎలా పావులుగా మారుతున్నారో, సాటి బి.సి కులాల మీద దాడికి దళితులను ఎలా వాడుకుంటున్నారో తెలియచెప్పే కథ కెంగార మోహన్ రాసిన 'సమిధలు'. ఉన్నతోద్యోగాలు చేస్తూ ఆర్థికంగా పై మెట్టులో ఉన్నా దళితులు ఎదుర్కొనే వివక్షను అనిల్ డ్యాని 'వీకెండ్' కథలో పరిచయం చేశాడు. సమాజంలో థర్డ్ జెండర్ ఎదుర్కొనే వివక్షతో పాటు ఇప్పటికీ ఊళ్లల్లో కులాలు వీధుల అవతారం దాల్చి ఉన్న వైనాన్ని పెనుమాక రత్నాకర్ 'రమణి' కథలో అద్దం పట్టాడు.

జి హైమవతి రాసిన 'బొందలగడ్డకు దూరంగా' కథ దళిత వాడల్లో ఇప్పటికీ దూరం కాని అనాచారాలను పట్టి చూపిస్తుంది. బాలింత పీనుగు ఊరికి అరిష్టమని ఊరి కట్టుబాటు పేరుతో ఆ బాలింత పీనుగుని ఏటిలో పాతిపెట్టడానికి నిర్ణయిస్తే ఆమె తల్లితండ్రులు తప్ప ఊరు ఊరంతా మౌనం వహించడం ఆ బాలింతరాలి స్నేహితురాలినే కాదు, మనల్ని కూడా భయపెడుతుంది. సోలోమెన్ విజయకుమార్ రాసిన 'ఊరు గాసిన కానుపు' కథ కూడా కడుపుతో ఉండి చనిపోయిన మాలచ్చుమ్మ కథే. కుల కట్టుబాటు పేరుతో శవం కడుపు కోసి మత పిండాన్ని బయటికి తీసి రెండు మృతదేహాలకు అంత్యక్రియలు జరిపించే అనాచారపు కథ ఇది. ఈ క్రతువు చెయ్యాల్సిన పొందు తాత 'ఎప్పటి శాస్త్రరాల్లా ఇయ్యా? వొయసు పిలకాయిలు మీగ్గుడా ఏందిరా ఈ శాదవలా' అని అశక్తతతో ప్రశ్నించింది మనల్నే కదా అనిపిస్తుంది. 'సదువుకున్నోళ్లు పల్లెల్లో గెట్టంగా నిలబడితే ఇట్టాంటియన్ని మారొచ్చు' అన్న కాకెన్న ఆశ తీరే మార్గం ఉందా అని ఆలోచింపచేస్తుంది. ఈ ఇద్దరు కథా రచయితలు ఒకరు తెలంగాణకు, మరొకరు ఆంధ్ర ప్రాంతానికి చెందినవారైనా రెండు ప్రాంతాల్లో ఉన్న కట్టుబాట్లు, అనాచారాలు ఒకటిగా ఉండడం మన గమనింపుకు వస్తుంది.

గుడిపల్లి నిరంజన్ 'తప్పెట సిటుకు' కథ అద్భుతమైన మానవీయతను ప్రభోదిస్తుంది. డబ్బు బలిసిన షావుకారింటి ఆడపిల్ల వ్యాపారం, వ్యవహారం చక్కబెట్టడంలో కుటుంబానికి చేదోడుగా నిలుస్తుంది. కానీ అగ్రవర్ణ అహంకారాన్ని మాత్రం ఎక్కడా వదులుకోదు. కింది కులాల మనుషులను అసుంటా పెడుతుంది. స్త్రీలోలుడైన భర్త మూలంగా ఎయిడ్స్ జబ్బున పడితే కుటుంబమే ఆమెను నడిరోడ్డు పాల్జేస్తుంది. అలాంటి కళావతిని మాదిగ్గేరికి చెందిన కాలీకమ్మ చేరదీసి కొత్త బతుకు ఇవ్వడం కథాంశం. జీవుడే దేవుడనుకునే తత్వం నమ్మిన మాదిగ్గేరి జనం గురించి కళావతి అర్థం చేసుకునే తీరును వివరించడంలో గానీ, కథనాన్ని నడిపించడంలో గానీ నిరంజన్ వాడిన మాండలిక భాష సొగసు అబ్బుర పరుస్తుంది. సిద్దెంకి యాదగిరి 'రుణం' కథ కూడా మానవీయతను ప్రభోదించేదే. కథన రీతిని కొత్త పుంతలు తొక్కించిన కథ ఇది.

ఈ కథలన్నీ ఆధునిక వ్యవస్థకు ఇంకా ఆమడ దూరంలో ఉంచబడిన దళిత జీవిత వ్యధార్థ గాధలే. కుల వ్యవస్థను పదిలపరిచి మరింత పటిష్టం చెయ్యాలని చూస్తున్న మతతత్వ శక్తులు అధికారం చెలాయిస్తున్న వర్తమాన భారతంలో దళిత సాహిత్యం మరింత మెలుకువతో, మరింత బలంగా తన గొంతు వినిపించాల్సిన అవసరాన్ని ఇలాంటి కథా సంకలనాలు అందిపుచ్చుకుంటాయన్న ఆశాభావం కలుగుతుంది.



- సత్య రంజన్,
9182449279

పల్లెతనపు పచ్చికలో సేదతీర్చే 'ఇల్లింతపండ్లు'



- శృంగవరపు రచన

మనిషి మనిషికి తను పొందిన అనుభూతులు, తను చూసిన నేపథ్యం వల్ల కలిగే అనుభవాలు భిన్నంగా ఉంటాయి. కానీ తన అనుభూతులను పాఠకుడి ఊహానేత్రంలో తన అక్షర బలంతో, తను చెప్పే తీరులోనే ప్రత్యక్షం అయ్యేలా చేస్తే ఆ కథారచయితలు చెప్పడంలో సఫలీకృతమయినట్లే. అటువంటి కథలే హుమాయున్ సంఘీర్ చెప్పిన 'ఇల్లింత పండ్లు'. ఈ కథాసంపుటిలో పద్నాలుగు కథలున్నాయి. కానీ 'ఇల్లింత పండ్లు' శీర్షికతో ఏ కథా లేదు. సాధారణంగా కథాపుస్తక శీర్షిక ఎప్పుడు ఆ కథల్లోని ఒక పేరుగా ఉంటుంది. కానీ ఈ పుస్తక శీర్షిక అందుకు భిన్నం. అరుదుగా దొరికే అడవి పళ్ళు ఇల్లింత పండ్లు. ఎక్కడా విక్రయించని ఈ పళ్ళు గ్రామీణ ప్రాంతాల్లోనే ఎక్కువ కనిపిస్తూ ఉంటాయి. తియ్యగా, పులుపుగా, వగరుగా ఉండే ఈ పళ్ళు అందించే ఈ భిన్న రుచుల సంగమంలానే ఈ కథలు కూడా రకరకాల అనుభూతులు పాఠకుల్లో కలిగిస్తాయని రచయిత ముందుమాటలో పేర్కొన్నారు. ప్రకృతితో, పల్లెతో మమేకమై అనేక దృశ్యాలను పాఠకుల కళ్ళకు కట్టేలా చేసే ఆ కథల భిన్నతను సూచించేదే ఈ పుస్తక శీర్షిక.

వివాహం తరువాత భార్యాభర్తలు ఒకరిపై మరొకరు చూపించే ప్రేమ. తన కంటే తన భాగస్వామికే ప్రాధాన్యత ఇవ్వడం. 'ఐడియలైజ్' వాతావరణంలో స్పేస్ లేని మానసిక ఆవరణ గురించి చర్చించే కథే 'ప్రేమ'. ప్రపంచవ్యాప్తంగా నేడు అనేక మానసిక సమస్యలకు కారణం 'సెల్ఫ్ లవ్' లేకపోవడమే అని 'హీల్ యువర్ సెల్ఫ్' (Heal yourself) పుస్తకంతో ప్రసిద్ధి చెందిన లూయిస్ హే స్పష్టం చేశారు.

'అనైతికం'. సాధారణంగా నైతికత అంటే వ్యక్తి విలువలతో ముడిపడిన అంశంగా భావించే నేపథ్యంలో, దానికి భిన్నంగా మనిషి తోటి మనిషిని మనిషిగా చూడలేని తారతమ్యాలను తమ మనసుల్లో నిర్మించుకుని మనిషికి మనిషికి మధ్య అసమానత్వ గోడలు నిర్మించే సంస్కృతే 'అనైతికం' అని ఈ కథలో రచయిత స్పష్టం చేస్తారు. ముఖ్యంగా ఈ కథాసంపుటిలోని అనేక కథల్లో పల్లె వాసనలు, ఆ పల్లెను విడిచి వచ్చి పట్టణాల్లో ఉండేవారిని వేటాడే ఆ మధుర స్మృతులు, జ్ఞాపకాలు ఒక భాగంగా ఉంటాయి.

మనిషికి అన్నిటి కన్నా ఎక్కువ భద్రత భావనను కలిగించేది డబ్బు అనడంలో అతిశయోక్తి లేదు. కానీ నచ్చిన దాని కన్నా డబ్బుతో కుటుంబానికి భద్రత ఇవ్వాలని తాపత్రయపడుతున్న నేటి యువత కోల్పోతున్న జీవితపు ఆనందాన్ని గురించి చెప్పే కథ 'బుటునా'. ఈ కథలో అనేక చోట్ల రచయిత వాక్యవిన్యాసాలు సూటిగా హృదయాన్ని తాకుతాయి.


దేశం కానీ దేశంలో సంపాదన కోసం యవ్వనమంతా కరిగించుకుని ఉండి, డబ్బు పరంగా లోటు లేకుండా కుటుంబాన్ని స్థిరపరిచి, వెనక్కి తిరిగి చూసుకుంటే ఆ సంపాదనాపరుడికి మిగిలేది ఏమిటి? కోల్పోయిన యవ్వనం, కోల్పోయిన కుటుంబ అనుభూతులు, భార్యతో ముద్దు ముచ్చట్లు. ఈ నేపథ్యంలో దినార్ల కోసం మనసుకు అయ్యే గాయాలకు మందు లేదని చెప్తూ, ఎందరో భార్యాభర్తలు తమ యవ్వనాన్ని, నడి వయసును కోల్పోతూ చివరకు 'ఏం మిగిలింది?'

స్త్రీలపై జరిగే అత్యాచారాలకు సమాజ స్పందన బయటకు ఒకలా కనిపించినా బాధితురాలు-బాధితుడి మతాల సమీకరణ ఎప్పుడు ముఖ్య ప్రాముఖ్యత వహిస్తుందనేది కాదనలేని సత్యం. ఈ విషయాన్ని పరోక్షంగా చెప్తూ, హిజ్రాలపై దాడి, వారిని దోచుకుంటూ, వారికి కనీస గౌరవం ఇవ్వని మనుషుల గురించి చెప్పే కథ 'జయమాలిని'. ఒక ప్రత్యేక ప్రపంచంగా ఏర్పడి థర్డ్ జెండర్ వాళ్ళు తమ సంతోషాలను, బాధలను, అనుభూతులను పంచుకుంటూ సమాజం అంగీకరించని పరిస్థితుల్లో, అవమానాలకు గురవుతూనే, మనిషితనంలో ఎదగని మనుషుల మధ్య కూడా తమ సంస్కారాన్ని నిలుపుకునే వారి పట్ల పాఠకులకు ఈ కథ చదివితే గౌరవం రెట్టింపు కాక మానదు.

'ఇబ్లీస్' కథ చదువుతుంటే 'ఎంత గొప్ప కథ రాశాడు రచయిత!' అన్న భావన కలుగక మానదు. మతం మనిషిలో ఒకరి కోసం ఎంతో మంది ఉంటారన్న భరోసాను కలిగిస్తుంది. కానీ మతోన్మాదం మనిషిని రాక్షసుడిని చేస్తుంది. వ్యక్తికి మతం పట్ల గౌరవం ఉండాలి తప్ప, దాని కోసం మనిషిగా ఉండలేని వాతావరణాన్ని ఏర్పరిచే సంకెళ్లతో బంధి కాకూడదని, 'మతం కన్నా మానవత్వం గొప్పదని' చెప్పే కథ ఇది. దీనికి నేపథ్యంగా 'మిలాదున్న' పండుగ వేడుకలను తీసుకోవడం, పిల్లలను చిన్నప్పటి నుండే ఏది వాస్తవం? ఏది కాదు? ఏది మూఢ నమ్మకం? వంటి విషయాల గురించి తెలుసుకునేలా చేయలేకపోతే వారు ప్రమాదకరులుగా మారే అవకాశం ఉందని చాలా గట్టిగా చెప్పిన కథ.

సమాజంలో ఉన్న అసమానతలను భిన్న కోణంలో పరిచయం చేసే కథ 'కోపిన్ బియ్యం'. 'గుండె గది.' కోవిడ్ సమయంలో మనుషులు మనుషులు కాకుండా మారిపోయిన తరుణంలో ఓ వృద్ధ జంట ప్రేమను, ఆ ప్రేమతో వారు కరోనాను జయించిన తీరును హృద్యంగా రాసిన కథ 'గుండె గది'. ముస్లిముల కుటుంబాల్లో ముఖ్యంగా తల్లిదండ్రులు లేని ఆడపిల్లలను పైకి చూసుకునే బాధ్యత తీసుకున్నా, ఆ ముసుగులో వారిని వ్యాపార వస్తువులుగా మార్చుకునే వారి నుండి, ఇద్దరూ అక్కాచెల్లెళ్ళు ఎలా తప్పించుకున్నారో చెప్పే కథ 'చమ్కీ'.


దేశం కానీ దేశంలో సంపాదన కోసం యవ్వనమంతా కరిగించుకుని ఉండి, డబ్బు పరంగా లోటు లేకుండా కుటుంబాన్ని స్థిరపరిచి, వెనక్కి తిరిగి చూసుకుంటే ఆ సంపాదనాపరుడికి మిగిలేది ఏమిటి? కోల్పోయిన యవ్వనం, కోల్పోయిన కుటుంబ అనుభూతులు, భార్యతో ముద్దు ముచ్చట్లు. ఈ నేపథ్యంలో దినార్ల కోసం మనసుకు అయ్యే గాయాలకు మందు లేదని చెప్తూ, ఎందరో భార్యాభర్తలు తమ యవ్వనాన్ని నడి వయసును కోల్పోతూ చివరకు 'ఏం మిగిలింది?' అని బాధ పడే జీవితాలను పరిచయం చేసే కథ 'దినార్ గాయం'. ఇవి కాక ఇందులో 'ఆత్మకథ, చింత, దేవ్లానాయక్, నమిత, దిద్దుబాటు' కథలు వున్నాయి.



ప్రతి కథారచయిత కథల్లో భిన్నత ఉన్నా, కథన క్రమంలో మాత్రం ఒక భావమో, వాదమో లేక అభిప్రాయమో తప్పకుండా ఆ కథల్లో స్థిరంగా ఉంటుంది. సంఘీర్ ఈ 'ఇల్లింత పండ్లు' కథల్లో, మనిషి ప్రకృతి నుండి దూరంగా జరగకూడదని, బాల్యంలో పల్లెటూరి జీవితంలో ఉన్న మధుర స్మృతులను వీలుంటే ఇప్పుడు కూడా పునరావృతమయ్యేలా చేసుకోగలిగితే ఆ అవకాశం వదులుకోకూడదని, బాల్యంలో చూసిన వాటిని గొప్ప జ్ఞాపకాలుగా మనసులో స్థిరపరుచుకుంటే, అవి ఓ కొత్త బలాన్ని ఇస్తాయన్న భావన ఉంది. సమాజంలో అసమానత్వం కులం, మతం, వర్గం వంటి వాటి మీద ఉండటం నాణేనికి ఒక వైపు అయితే ప్రతిభా చౌర్యం వల్ల జరిగే అన్యాయం వల్ల తలెత్తే అసమానత్వం ఇంకో వైపు ఉంది. బయటకు కనిపించకుండా జరిగిపోయే వీటిని గుర్తించి, ఎదిరించాలన్న వాదము ఉంది.

హుమాయున్ సంఘీర్ మొదటి కథా సంపుటి 'కామునికంత'కు 'శ్రీమతి కొలకలూరి భాగీరథీ కథానిక పురస్కారం-2024' ప్రకటించారు. ఇప్పటి రెండవ కథాసంపుటి కూడా పల్లెటూరి పచ్చికల్లో మన సేదతీరిస్తూ, అక్కడి జీవనంలో ప్రకృతితో మమేకమయ్యే ఆహ్లాదమైన భావనను కలిగిస్తాయి. గొప్ప కథా నేర్పుతో, వాక్య విన్యాసాలతో, పల్లెటూరి మనసులను స్వచ్ఛంగా బయలు పరిచే పదజాలంతో, లోతైన అంశాలను సున్నితంగా, ప్రశ్నించాల్సిన అంశాల పట్ల ఘాటుగా స్పందిస్తూ రాస్తున్న హుమాయున్ సంఘీర్ గారికి ఈ సందర్భంగా అభినందనలు. జీవితంలో మధురస్మృతులుగా మారే జ్ఞాపకాలను మీ గుండెగదుల్లో పదిలం చేసుకోవాలంటే మీరు కూడా ఈ 'ఇల్లింత పండ్లు' తప్పకుండా చదవండి.

మనసు పొరల్లో పూలవనం



బొట్టు బొట్టుగా
ఎరుపు మెరుపేదో ప్రవహిస్తూ
గుండెను చేరుతున్న అలజడి
ఒకే ఒక్క క్షణంలో
జలదరింపుల వాన
మనసంతా తడైపోయిన స్థితి
పదే పదే పరుగుతీస్తున్న
ప్రవాహ ఘర్షణకు
దేహమంతా పుండై పోతుంది
కొన్ని గాయాలతో
అంతర్గత కుహరం
సామూహిక మూలుగవుతుంది
ఏదో మూలన దాక్కున్న
ఆనంద మొలకొకటి
అంకురించి
నవ్వుల సిరులను పండిస్తుంది
లోలోపలి గది గోడలకు అంటిన
స్వేదపు చెమ్మకు
ఓ సౌందర్య గీతం
ఆలాపనను అందుకుంటుంది
యముకల గూళ్ళను
కప్పేసుకున్న
పంజరపు చీకటిలో
మాటల దివిటీ కాంతుల వేడి
మనసు కళ్ళను తడుతుంది
ఎన్నో దు:ఖపు రాశుల నడుమ
అమృత బిందువోలే
కొన్ని అమూల్య వాక్కులు
మనసు పొరల్లో
పూలవనమై గుభాళిస్తాయి

-డా॥కటుకోఝ్వల రమేష్, 9949083327

సాహితీ వార్తలు

'నానీ లోచనాలు' ఆవిష్కరణ

శ్రీమతి గడ్డం సులోచన రచించిన 'నానీ లోచనాలు' కవితా సంపుటి ఆవిష్కరణ సభ ఈ నెల 9నఉదయం 10 గంటలకు రవీంద్రభారతి సమావేశ మందిరంలో జరుగుతుంది. ఈ సభలో డా॥ఎస్.గోపి, ఆచార్య సూర్యా ధనంజయ్, డా॥ ఉదారి నారాయణ, కుడికాల వంశీధర్, డా॥ జి. ఆదినారాయణ పాల్గొంటారు. **- కుడికాల వంశీధర్**

ఫీచర సునీతా రావు పురస్కారాలు

ఫీచర సునీతారావు పురస్కారాలకు 2023 కు ఎన్నికైన వాళ్ల పేర్లను ప్రకటించింది. కవిత్వంలో 'దీపముండగానే' సంపుటం గజ్జల రామకృష్ణకు, కథా రచనలో 'ఉడుకు బెల్లం' చింతకింది శ్రీనివాస్‌కు, విమర్శలో 'షట్చక్రం' లక్ష్మణ చక్రవర్తి, 'దిక్ చక్రం' ఆడెపు లక్ష్మీపతికి, లభించాయి. ప్రతి విజేతకు 15000 నగదు జ్ఞాపికతో సత్కారం ఉంటుంది.

సాహితీ పురస్కారాలు - 2024

'దశమ పుస్తక పురస్కారాలు' లో భాగంగా శ్రీ మక్కెన రామ సుబ్బయ్య కథా పురస్కారం, ఆచార్య నెల్లుట్ల కవితా పురస్కారం, డా॥ కె.వి.రావు కవితా ప్రక్రియ పురస్కారం, సాహితీ పురస్కారం, బాలసాహిత్య పురస్కారం, విజ్ఞాన/మనోవైజ్ఞానిక పుస్తక పురస్కారం విభాగాలలో పురస్కారాలున్నాయి. అన్ని రాష్ట్రాల రచయితలు 2023 సం॥లో ప్రచురించిన పుస్తకాలను పంపొచ్చు. రచయితలు పుస్తకాల మూడు ప్రతులను డా॥ మక్కెన శ్రీను, అసోసియేట్ డీన్, కాలేజ్ ఆఫ్ వెటర్నరీ సైన్స్, గరివిడి, విజయనగరం జిల్లా-535 101, ఎ.పి. చిరునామాకు ఏప్రిల్ 8వ తేదీ లోపు పంపాలి.

అడవులు అంతరించిపోవటం పర్యావరణకు నష్టం

పర్యావరణ శాస్త్రవేత్త జేవీఎస్ చంద్రశేఖర్ వారియర్

నవతెలంగాణ-కల్లూరు

రోజురోజుకి అడువులు అంతరించిపోవడం, కొండలు, నదులు తరిగిపోవడం పర్యావరణంలో పెను మార్పులకు దారితీస్తుందని గ్రీన్ వారియర్ అవార్డు గ్రహీత, పర్యావరణ శాస్త్రవేత్త జేవీఎస్ చంద్రశేఖర్ వారియర్ అన్నారు. ఆదివారం స్థానిక సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో పర్యావరణ దినోత్సవ సందర్భంగా విద్యార్థులకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీదేవి, అనిత, విద్యార్థులు పాల్గొన్నారు.



ఉచిత వైద్య శిబిరం

నవ తెలంగాణ-కల్లూరు

ఉచిత వైద్య శిబిరంలో 150 మందికి ఆదివారం వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. స్థానిక బాలాజీ హైస్కూల్, క్లినిక్ ఆధ్వర్యంలో మెగా వైద్యం నిర్వహించారు.ఈ క్యాంపులో వినికిడి, మాట, వైద్య నిపుణులు డాక్టర్ మసాలా వెంకట ఉదయ్ కిరణ్, చెవ్వు, ముక్కు, గొంతు, శాస్త్ర చికిత్స నిపుణులు డాక్టర్ గుడిపూడి రాజేష్, మెదడు, వెన్నుముక, శాస్త్ర చికిత్స నిపుణులు డాక్టర్ బి తన్మయ్‌లు శిబిరంలో వైద్య సేవలు అందించారు. వైద్య పరీక్షలు అనంతరం మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు బాలాజీ హై స్కూల్ కరస్పాండెంట్ వలసల బాలాజీ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతంలో పేదలకు మెరుగైన వైద్యం అందించేందుకు వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో వలసల బాలాజీ, కొదమ సింహం నరేంద్ర, వలసాల శ్రీను, కిషోర్, కిరణ్ కుమార్, పద్మాకర్, రాంబాబు పాల్గొన్నారు.

ఉచిత విద్యుత్ కోసం దరఖాస్తు చేసుకోండి

నవతెలంగాణ- కల్లూరు

రేషన్ కార్డు కలిగి ఉండి ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకోకపోతే ఉచిత విద్యుత్ కోసం ఎంపీడీవో కార్యాలయంలో దరఖాస్తు రిజిస్ట్రేషన్ చేయించుకుంటే ఉచిత విద్యుత్‌కు అర్హులవుతారని విద్యుత్ శాఖ ఏఈ వజినేపల్లి గణేష్ తెలిపారు. కల్లూరు సబ్ స్టేషన్ పరిధిలో 11 వేల గృహ విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయని, సబ్ స్టేషన్ పరిధిలో 8వేల మంది రేషన్ కార్డులు కలిగి ఉన్నారని తెలిపారు. రేషన్ కార్డు ఉన్నా ప్రజా పాలన దరఖాస్తులో ఉచిత విద్యుత్ కావాలని దరఖాస్తు చేసుకున్న వారికి మాత్రమే ఈ పథకం అమలవుతుందన్నారు. దరఖాస్తులో ఉచిత విద్యుత్ కావాలని దరఖాస్తు చేసుకోకపోతే రేషన్ కార్డు ఉన్నా ఉచిత విద్యుత్ అమలు కాదని అన్నారు. పెద్ద కోరుకొండి సబ్ స్టేషన్ పరిధిలో 6,500 విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయని, రేషన్ కార్డులు 5,200 కలిగి ఉన్నారని ఏఈ తిరుపతిరావు తెలిపారు. రేషన్ కార్డు ఉండి ఉచిత విద్యుత్ రానివారు దరఖాస్తు చేసుకోవాలని అన్నారు.



ఖమ్మం డిస్ట్రిక్ట్ మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్స్ కార్యాలయం ప్రారంభం

నవతెలంగాణ- ఖమ్మం

ఖమ్మం నగరంలోని వైరా రోడ్డు సమీపంలో ఖమ్మం డిస్ట్రిక్ట్ మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్స్ అసోసియేషన్ నూతన ఆఫీస్ కార్యాలయాన్ని ప్రముఖ చిన్న పిల్లల డాక్టర్ కూరపాటి ప్రదీప్ కుమార్ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ల్యాబ్ టెక్నీషియన్స్ అందరూ ఒక యూనిట్‌గా ఉండి వారి సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు. అర్హులైన ల్యాబ్ టెక్నీషియన్లకు తమ వంతు సహాయ సహకారాలు ఎల్లవేళల్లో ఉంటాయన్నారు. కార్యక్రమంలో ప్రెసిడెంట్ గుండెపోటు నరేష్, వైస్ ప్రెసిడెంట్ వినయ్ కుమార్, సెక్రటరీ క్రాంతికుమార్, లవ్‌కుమార్, ట్రెజరర్ వంకాయల నవీన్, ల్యాబ్ టెక్నీషియన్స్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా బంద్

నవతెలంగాణ-వైరాటౌన్

నేడు సోమవారం ఉదయం 9:30 గంటల నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా బంద్ ఉంటుందని వైరా విద్యుత్ శాఖ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ మరమ్మతుల నేపథ్యంలో వైరా మండల పరిధిలోని సోమవారం, తాటిపూడి, రెబ్బవరం, కొష్టాల, జింకలగుడం, గొల్లపూడి గ్రామాలలో విద్యుత్ సరఫరా నిలిపి వేయడం జరుగుతుందని, ప్రజలు గమనించి విద్యుత్ అధికారులకు సహకరించాలని కోరారు.

గురుకుల పాఠశాల టీచర్‌గా జానకి ఎంపిక

నవతెలంగాణ-ముదిగొండ



మండలంలోని పమ్మి గ్రామానికి చెందిన జానకి అనే గృహిణి రాష్ట్ర ప్రభుత్వ గురుకుల పాఠశాలలో (టిజిటి) సోషల్ టీచర్‌గా ఎంపికైంది. భర్త రామ్ కుమార్ ప్రోత్సాహంతో జానకి చదువు కొనసాగించి 2023 ఆగస్టులో నిర్వహించిన గురుకుల పాఠశాల పరీక్షల్లో అత్యంత ప్రతిభ కనబరిచి ఉత్తీర్ణత సాధించి ప్రభుత్వ ఉద్యోగానికి అర్హత సంపాదించి ఉద్యోగం పొందిన జానకి పట్టుదలను కుటుంబసభ్యులు, గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

పలువురు శుభాకాంక్షలు...

జానకిని జర్నలిస్టు ఆవుల రామారావు, రాయబారపు బేబి రమేష్, టిఎస్ కళ్యాణ్, లాయర్, కవి, రచయిత పమ్మి రవిబాబు, గ్రామ మాజీ సర్పంచ్ కొండమీది సువార్తరఘుపతి తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.

గ్రానైట్ కార్మికుడు ఆత్మహత్య

నవతెలంగాణ-ముదిగొండ

మండల కేంద్రమైన ముదిగొండ పారిశ్రామిక ప్రాంతంలో కల్పన గ్రానైట్ నందు ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన రితేష్ కుమార్ గౌతమ్(24) అనే కార్మికుడు పనిచేస్తున్నారు.అవివాహితుడుగా ఉన్న రితేష్ కుమార్ గౌతమ్ ఇటీవల కాలంలో అనారోగ్యానికి గురై జీవితం మీద విరక్తితో కల్పన గ్రానైట్ ప్రాంతంలో ఆదివారం తెల్లవారుజామున చెట్టుకి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడని ఎస్సై గజ్జెల నరేష్ తెలిపారు.

ఎస్ఎఫ్ఐ జిల్లా స్థాయి టాలెంట్ టెస్ట్ విజేతల ప్రకటన

నవతెలంగాణ-వైరాటౌన్

ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 27 తారీఖున నిర్వహించిన పదవ తరగతి టాలెంట్ టెస్ట్ జిల్లా స్థాయి విజేతల వివరాలను ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు కోటా ప్రేమ్ కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ స్కూల్స్ ప్రత్యేక కన్సోలేషన్ బహుమతి బోనకల్ మండలం చిరునోముల జెడ్.పిఎస్ఎస్ పాఠశాల విద్యార్థి వేమా అరవింద్ కుమార్, మొదటి స్థానం ఖమ్మం త్రివేణి స్కూల్ విద్యార్థి మోక్షిత సాయి, రెండవ స్థానం వైరా వాణి వివేకానంద స్కూల్ విద్యార్థి ఎస.కె షాహిద్, మూడవ స్థానం ఖమ్మం గీతాంజలి స్కూల్ విద్యార్థి భవ్య సాధించారని తెలిపారు. జిల్లా స్థాయి టాలెంట్ టెస్టులో జిల్లాలోని పలు మండలాలకు చెందిన 113 మంది ఎంపిక చేసిన విద్యార్థులు పరీక్షలలో పోటీపడ్డారని, విజేతలకు సర్టిఫికెట్, షీల్డ్‌తో పాటు ముగ్గురికి ప్రైజ్ మనీ అందిస్తున్నట్లు చెప్పారు. టాలెంట్ టెస్టు విజేతలకు, పాల్గొన్న విద్యార్థులకు అభినందన సభను ఖమ్మంలోని మంచికంటి ఫంక్షన్ హాల్లో నిర్వహిస్తామని తెలిపారు.

టాస్క్ ఫోర్స్ దాడులు



40 క్వింటాల రేషన్ బియ్యం పట్టివేత

నవతెలంగాణ-ముదిగొండ

మండలపరిధిలోని పెద్ద మండవలో డీలర్ల వద్ద 40 క్వింటాలు రేషన్ బియ్యం కొనుగోలు చేసి అక్రమంగా ట్రాలీ ఆటోలో తరలిస్తుండగా టాస్క్ఫోర్స్ పోలీస్ అధికారులు పట్టుకున్నారు. సీజ్ చేసి బియ్యాన్ని స్వాధీనం చేసుకొని పౌర సరఫరా శాఖ అధికారులకు అప్పజెప్పారు.

దోపిడీదారుల గుట్టు రట్టు చేయడమే కళాకారుల లక్ష్యం

పిఎన్ఎం జిల్లా కార్యదర్శి సదానంద్

నవతెలంగాణ-ఖమ్మంరూరల్



దోపిడీదారుల గుట్టు రట్టు చేయడమే కళాకారుల లక్ష్యమని ప్రజానాట్యమండలి ఖమ్మం జిల్లా కార్యదర్శి వేముల సదానంద్ అన్నారు. మండలంలోని నాయుడుపేట గ్రామానికి చెందిన సీనియర్ డప్పు కళాకారుడు నందిగామ వెంకన్న ఐదో వర్ధంతిని ఆదివారం నాయుడుపేట గ్రామంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో సదానంద్ మాట్లాడుతూ ఖమ్మం జిల్లా కళా రంగంలో ప్రధాన భూమిక పోషించి జిల్లాలో డప్పు మాస్టర్‌గా అనేక దళాలను నిర్మించిన చరిత్ర వెంకన్నకు ఉందన్నారు. వెంకన్న ప్రస్తుతం మన మధ్యలో లేకపోయినా ఆయన వారసులు నేడు కళారంగంలో చాలామంది ఉండటం అభినందించదగ్గ విషయం అన్నారు. వెంకన్న ఆశయ సాధన కొరకు కళల ద్వారా ప్రజలను చైతన్యవంతం చేయాలని డప్పు కళాకారులను కోరారు. ఈ కార్యక్రమంలో వెంకన్న కుమారులు నాగరాజు, సురేష్, సతీమణి మైసమ్మ ప్రజానాట్యమండలి నాయకులు నందిగామ కృష్ణ, మిత్రులు మానుకొండ శ్రీనివాస్,కనకం గురునాథం, కెవిపిఎస్ ఖమ్మం రూరల్ మండల నాయకులు నూకల బాలరాజు, మధు, గోపి, లక్ష్మి, కళ్యాణి, అరుణ, దినేష్ పాల్గొన్నారు.

రాష్ట్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

నవ తెలంగాణ-మధిర

ఎన్నికల్లో ఇచ్చిన హామీలను 10 సంవత్సరాల అధికారంలో ఉండి అమలు చేయని గత బీఆర్ఎస్ పాలకులు మూడు నెలలు పూర్తికాని కాంగ్రెస్ ప్రభుత్వంపై గ్యారంటీలు అమలు చేయడం లేదని విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. రాష్ట్ర అభివృద్ధి ప్రజల సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వంపై బిఆర్ఎస్ నాయకులు చేస్తున్న విమర్శలను చూస్తుంటే జాలేస్తున్నదని ఎద్దేవా చేశారు. ఆదివారం మధిర నియోజకవర్గంలోని మధిర మండలంలోని రొంపిమల్ల, జాలుముడి ప్రాజెక్టుల వద్ద బిటి రోడ్డులకు శంకుస్థాపన చేసిన అనంతరం స్థానికంగా ఏర్పాటు చేసిన కార్యాక్రమంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. ప్రజలకు ఇచ్చిన మాట కోసం



కాంగ్రెస్ ప్రభుత్వం నిబద్ధతతో పని చేస్తున్నదని వివరించారు. కాంగ్రెస్ ప్రకటించిన 6 గ్యారంటీల అమల్లో భాగంగా మహిళలకు ఉచిత బస్సు రవాణా పథకం ప్రవేశపెట్టామన్నారు. ఇప్పటి వరకు 19 కోట్ల మంది మహిళలు ఉచిత బస్సులో జీరో టికెట్స్ తీసుకున్నారని చెప్పారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ 10 లక్షల రూపాయలకు పెంచడం, మహిళలకు 500 రూపాయలకే సిలిండర్ ఇవ్వడం, అర్హులైన లబ్ధిదారులకు 200ల యూనిట్ల వరకు ఉచితంగా గృహ విద్యుత్‌ను అందిస్తున్నామని వివరించారు. కాంగ్రెస్ పార్టీ చేయగలిగిన వాటికే మాట ఇస్తుందని, ఇచ్చిన మాటను కచ్చితంగా అమలు చేసి తీరుతుందన్నారు. డ్వాక్రా మహిళా సభ్యులకు త్వరలోనే వడ్డీ లేని రుణాలను ఇస్తామన్నారు.

యెండుపల్లిలో పారిశ్రామిక వాడ ఏర్పాటు

మధిర నియోజకవర్గంలో పరిశ్రమలను నెలకొల్పి స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడానికి మధిర మండలం యెండుపల్లిలో పారిశ్రామిక వాడను ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. యెండుపల్లి గుట్టలను ఇప్పటికే సర్వే చేసి పరిశ్రమల స్థాపన కోసం గుర్తించమని చెప్పారు. యెండుపల్లి పారిశ్రామిక వాడలో పరిశ్రమలు పెట్టడానికి వచ్చేటువంటి పారిశ్రామికవేత్తలను ప్రోత్సహిస్తామన్నారు. యెండుపల్లి పారిశ్రామిక వాడ అభివృద్ధిలో భాగంగా రొంపిమల్ల నుంచి యెండుపల్లి వరకు బిటి రోడ్డు నిర్మాణానికి 2.80 కోట్ల రూపాయల నిధులు మంజూరు చేసి రోడ్డు పనులకు శంకుస్థాపన చేశామన్నారు. త్వరలో యెండుపల్లి పారిశ్రామిక వాడకు భూమి పూజ చేస్తామని ప్రకటించారు. జాలిముడి ప్రాజెక్టు ఎడమ, కుడి కాలువల ద్వారా రెండు మండలాలకు తాగు, సాగునీరు అందిస్తున్నట్టు తెలిపారు. పేద మధ్య తరగతి ప్రజలు వీకెండ్ సెలవుల్లో ఉల్లాసంగా, ఉత్సాహంగా గడపడానికి జాలుముడి ప్రాజెక్టుని పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేస్తామన్నారు. జాలముడి ప్రాజెక్టు వద్ద బీటీ రోడ్ నిర్మాణానికి 52 లక్షల రూపాయలు నిధులు మంజూరు చేశామన్నారు. ఎన్నికల్లో మధిర నియోజకవర్గ అభివృద్ధికి ఇచ్చిన ప్రతి హామీని నేరవేరుస్తామన్నారు.

ఉచిత విద్యుత్ నిబంధనలు సవరించాలి

తెల్ల రేషన్ కార్డులు జారీ ప్రక్రియ చేపట్టాలి

నవతెలంగాణ-వైరాటౌన్

సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు

బొంతు రాంబాబు

నవతెలంగాణ-వైరాటౌన్



రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 200 యూనిట్లు ఉచిత విద్యుత్తులో ప్రభుత్వ నిబంధనలు సవరించాలని సిపిఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బొంతు రాంబాబు అన్నారు. ఆదివారం వైరా బోడేపూడి వెంకటేశ్వరరావు భవనంలో జరిగిన స్టడీ సర్కిల్‌లో బొంతు రాంబాబు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తెల్ల రేషన్ కార్డులు కలిగిన కుటుంబాలకు రెండు వందల యూనిట్లు ఉచిత విద్యుత్తు అందిస్తామని హామీ ఇచ్చి అమలులోకి తెచ్చారని, మహిళలు ఉచిత బస్సు, రెండు వందల యూనిట్లు ఉచిత విద్యుత్తు, గ్యాస్ సబ్సిడీ సిపిఐ(ఎం) స్వాగతిస్తుందని అన్నారు. కానీ ప్రభుత్వం అమలు నిబంధనలు పేరుతో అర్హులు సంఖ్య కుదింపు చేస్తుందని అన్నారు. కాంగ్రెస్ వాగ్దానం ప్రకారం తెల్ల రేషన్ కార్డులు కలిగిన కుటుంబాలకు రెండు వందల యూనిట్లు ఉచిత విద్యుత్తు ఇవ్వాలని, రెండు వందల యూనిట్లు వినియోగం దాటితే రెండు వందల పైన ఎన్ని యూనిట్లు ఉంటే అంతవరకు మాత్రమే బిల్లు వసూలు చేయాలని డిమాండ్ చేశారు. అలా కాకుండా రెండు వందల యూనిట్లు కంటే అదనంగా ఒక యూనిట్ ఉన్న మొత్తం యూనిట్లు బిల్లు చెల్లించాలనే నిబంధన సరికాదని అన్నారు. గ్యాస్ సిలిండర్ల సబ్సిడీ కంపెనీలకు రాష్ట్ర ప్రభుత్వం చెల్లించి వినియోగదారులకు 500 రూపాయలకు గ్యాస్ సిలిండర్ల అందించాలని కోరారు. గత ప్రభుత్వం పది సంవత్సరాలుగా తెల్ల రేషన్ కార్డులు జారీ చేయలేదని, నూతన ప్రభుత్వం ప్రభుత్వ పథకాల నిబంధనలు ప్రకారం తెల్ల రేషన్ కార్డులు కలిగిన కుటుంబాలకు మాత్రమే అర్హులుగా ప్రకటించిందని, తెలంగాణ రాష్ట్రంలో లక్షల కుటుంబాలు తెల్ల రేషన్ కార్డులు జారీ కోసం ఎదురు చూస్తున్నారని, తెల్ల రేషన్ కార్డులు జారీ ప్రక్రియ చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో స్టడీ సర్కిల్ వ్యవస్థాపక సభ్యులు పారుపల్లి చంద్రశేఖర్ బాబు, మాజీ ఎంపిపి బొంతు సమత, సిపిఐ(ఎం) మండల కార్యదర్శి తోట నాగేశ్వరరావు, వడ్లమూడి మధు, కోటా ప్రేమ్ కుమార్, పుష్పాల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

నేడు, రేపు జిల్లాలో మంత్రి పొంగులేటి పర్యటన

నవతెలంగాణ- ఖమ్మం

తెలంగాణ రెవెన్యూ, గృహనిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సోమ, మంగళవారంలో ఖమ్మం జిల్లాలో పర్యటించనున్నారని మంత్రి పొంగులేటి క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జ్ తుంబూరు దయాకర్‌రెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. పర్యటనలో భాగంగా సోమవారం ఉదయం 10 గంటలకు ఖమ్మం బైపాస్ రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన వరలక్ష్మి షోరూం ప్రారంభోత్సవ వేడుకలో పాల్గొంటారని తెలిపారు. 11 గంటలకు సత్తుపల్లిలోని ఎం.ఆర్ గార్డెన్స్‌లో జరిగే జిల్లా, నియోజకవర్గస్థాయి అధికారుల సమీక్షా సమావేశంలో పాల్గొంటారని, అదే విధంగా మధ్యాహ్నం రెండు గంటల నుంచి అక్కడే జరిగే సత్తుపల్లి మున్సిపల్ కార్పొరేషన్ బడ్జెట్ సమావేశంలోనూ పాల్గొంటారని పేర్కొన్నారు. సాయంత్రం ఐదు గంటలకు వైరా నియోజకవర్గంలో జరిగే పార్లమెంట్ నియోజకవర్గ ఎన్నికల సన్నాహక సమావేశంలో పాల్గొంటారని తెలిపారు. మంగళవారం ఉదయం 10 గంటలకు నేలకొండపల్లి మండలం ముజ్జుగూడెంలో వెటర్నరీ ఆసుపత్రి నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారన్నారని, 10.30 గంటలకు తిరుమలపురంలో గ్రామపంచాయతీ భవనాన్ని ప్రారంభిస్తారని తెలిపారు. 10.45 గంటలకు అక్కడే గృహజ్యోతి పథకాన్ని ప్రారంభిస్తారని పేర్కొన్నారు. 11 గంటలకు రామచంద్రపురంలో ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తారని, 11.30గంటలకు నేలకొండపల్లిలో గ్రంథాలయ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారని, 12 గంటలకు అక్కడే నూతనంగా నిర్మించిన మోడల్ డిగ్రీ కళాశాల భవనాన్ని ప్రారంభిస్తారని తెలిపారు. అనంతరం సాయంత్రం నాలుగు గంటలకు డోర్నకల్ నియోజకవర్గంలో జరిగే పార్లమెంట్ నియోజకవర్గ ఎన్నికల సన్నాహక సమావేశంలో పాల్గొంటారని పేర్కొన్నారు.

ధన్యజీవి తూము ప్రకాశరావు : సీపీఐ

నవతెలంగాణ - బోనకల్

బడుగు బలహీన వర్గాల అభివృద్ధి కోసం సర్వస్వాన్ని త్యాగం చేసిన తూము ప్రకాశరావు ధన్యజీవి అని సిపిఐ ఖమ్మం జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ అన్నారు. మండల కేంద్రంలోని మేఘ శ్రీ హస్పటల్ నూతన భవనాన్ని ఆదివారం పోటు ప్రసాద్ ప్రారంభించారు. అదేవిధంగా ప్రతి నెల మొదటి ఆదివారం బత్తినేని చారిటబుల్ ట్రస్ట్ సౌజన్యంతో అమరజీవి తూము ప్రకాశరావు జ్ఞాపకార్థం నిర్వహించే బిపి, షుగర్, కంటి ప్రత్యేక క్యాంపు నేటికి విజయవంతంగా 42వ క్యాంపుకు చేరింది. ఈ కార్యక్రమాలకు ముఖ్య అతిథిగా పోటు ప్రసాద్ పాల్గొన్నారు. నూతన క్యాంపును సందర్శించారు. ఈ కార్యక్రమంలో బత్తినేని చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, నారాయణపురం సహకార సంఘం అధ్యక్షులు బత్తినేని నాగప్రసాదరావు, బత్తినేని నీరజ దంపతులు, వైద్యనిపుణులు పారుపల్లి నిశాంత్, మేఘ శ్రీహాస్పటల్ ప్రముఖ జనరల్ వైద్య నిపుణులు డి సాయికుమార్, దంత వైద్యనిపుణులు జంగా నిఖిల్ కుమార్, నేత్ర హైకేర్ వైరా శ్రీకాంత్, క్యాంప్ నిర్వాహకులు, ఆర్ఎంపిడబ్ల్యూఏ టిఎస్ జిల్లా అధ్యక్షులు బొమ్మినేని కొండలరావు, ఆకెన పవన్, యంగల గిరి, విశ్రాంత ఉపాధ్యాయులు బండారుపల్లి వెంకయ్య, ప్రకాశరావు సతిమణి తూము సుశీలమ్మ, ఆయన సోదరి బండారుపల్లి జానకి, సిపిఐ జిల్లా సమితి సభ్యులు తూము రోషన్ కుమార్, సిపిఐ మండల కార్యదర్శి యంగల ఆనందరావు, సిపిఐ మండల సహయ కార్యదర్శి జక్కుల రామారావు పాల్గొన్నారు.

సీనియర్ కమ్యూనిస్ట్ నాయకులు యేపూరి కృష్ణారావుకు నివాళి

నవతెలంగాణ-ఖమ్మం

ఇటీవల మరణించిన ఖమ్మం జిల్లా తల్లాడ మండలం రంగాపురానికి చెందిన సీనియర్ కమ్యూనిస్టు నాయకులు కామ్రేడ్ ఏపూరి కృష్ణారావు సంస్మరణ సభ ఆదివారం ఖమ్మం గొరిల్లాపార్క్ ఫంక్షన్‌హాల్‌లో జరిగింది. ఈ సంస్మరణ కార్యక్రమానికి సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పి.సుదర్శన్‌రావు, రాష్ట్ర కమిటీ సభ్యులు పొన్నం వెంకటేశ్వరరావులు పాల్గొని ఆయనను స్మరించుకుంటూ నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు యం.సుబ్బారావు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బండి రమేష్, బొంతు రాంబాబు, పార్టీ జిల్లా కమిటీ సభ్యులు మాదినేని రమేష్, యర్రా శ్రీనివాసరావు, బండి పద్మ, బండారు రమేష్, ఆర్.ప్రకాష్, పి.రమ్య, తాళ్ళపల్లి కృష్ణ, సీనియర్ నాయకులు తాతా భాస్కరరావు, మండల కార్యదర్శులు రామలింగేశ్వరరావు, శీలం సత్యనారాయణరెడ్డి, కె.నాగేశ్వరరావు, జిల్లా నాయకులు కత్తుల అమరావతి, కె.దేవేంద్ర, వై.శ్రీనివాసరావు, అఫ్జల్, వాసిరెడ్డి వీరభద్రం, పగడాల నాగేశ్వరరావు, ప్రముఖ వైద్యులు డాక్టర్ భారవి, ప్రముఖ అడ్వకేట్ కొల్లి సత్యనారాయణ తదితరులు కృష్ణారావుకు నివాళులర్పించారు.



పోలియో చుక్క...చిన్నారులకు ఆరోగ్య రక్ష

నవతెలంగాణ-సత్తుపల్లి



పోలియో చుక్కలు చిన్నారులకు వేయించడం ద్వారా వారి సంపూర్ణ ఆరోగ్యానికి రక్షణ కవచంగా ఉంటుందని సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ అన్నారు. దేశవ్యాప్త కార్యక్రమంలో భాగంగా ఆదివారం స్థానిక బస్టాండ్ ఆవరణలో ఎమ్మెల్యే రాగమయి దయానంద్ పోలియో చుక్కల కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా చిన్నారులకు పోలియో చుక్కలు అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 2012లోనే మన దేశం పోలియో రహిత దేశంగా ప్రకటించబడిందన్నారు. ప్రతి బాలింత తమ చిన్నారులకు పోలియో చుక్కలను తప్పని సరిగా వేయించాలన్నారు. గతంలో పోలియో చుక్కల వినియోగం అంతగా లేని కాలంలో చిన్నతనంలోనే పిల్లలకు పోలియో వ్యాధి సోకి అంగవైకల్యానికి గురయ్యేవారన్నారు. ఇప్పుడా పరిస్థితి లేదన్నారు. నేటి పిల్లలే రేపటి భావిభారత పౌరులని, చిన్నారులు ఆరోగ్యంగా ఉంటే దేశ భవిష్యత్తు ఆరోగ్యకరంగా ఉంటుందన్నారు. మండల వైద్యశాఖ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ తలారి సీతారామ్, మండల వైద్యాధికారి డాక్టర్ అవినాశ్, మున్సిపల్ కమిషనర్ బి రవిబాబు, మున్సిపల్ వైస్ ఛైర్మెన్ తోట సుజలరాణి, నర్సింగ్ సూపరింటెండెంట్ విజయలక్ష్మి, కాంగ్రెస్ నాయకులు చల్లగుళ్ల నరసింహారావు, కమల్‌పాషా, గాదె చెన్నారావు పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్యే రాగమయి దయానంద్ ప్రభుత్వాసుపత్రిని సందర్శించి అక్కడి బాలింతలతో మాట్లాడారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.

నేలకొండపల్లి : మండలంలోని అన్ని గ్రామాలలో ప్రభుత్వ వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన పల్స్ పోలియో కార్యక్రమం విజయవంతమైనట్లు నేలకొండపల్లి పిహెచ్సి వైద్యాధికారి డాక్టర్ ఆర్ శ్రావణ్ కుమార్ తెలిపారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఎంపీపీ వజ్జా రమ్య పల్స్ పోలి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రవణ్ కుమార్ మాట్లాడుతూ నేలకొండపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో 2 రూట్స్1 మొబైల్ టీం ద్వారా జీరో నుండి 5 ఏళ్లలోపు 97 శాతం మంది పిల్లలకు పోలియో చుక్కలు అందించినట్లు తెలిపారు. మండల వ్యాప్తంగా 1972 మంది పిల్లలకు పోలియో చుక్కలు అందించాల్సి ఉందన్నారు. ఉదయం 7 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు పోలియో కేంద్రాలలో పోలియో చుక్కలు వేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో జడ్పీ వైస్ చైర్మన్ మరికంటి ధనలక్ష్మి, ఎంపీటీసీ బొడ్డు బొందయ్య, ఎంపీఓ శివ, డాక్టర్ నాగమణి, సిహెచ్‌ఎస్సి పిహెచ్‌ఎన్ దుర్గా, హెచ్ఈఓ వీరన్న, చంద్రశేఖర్, ఫీల్డ్ సూపర్వైజర్ ఏడుకొండలు, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.



ఖమ్మంకార్పొరేషన్: పోలియో రహిత సమాజం ఏర్పడేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని అందులో భాగంగా ఐదు సంవత్సరాలలోపు చిన్నారులకు పోలియో చుక్కలు వేయించి వారి ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలని 23వ డివిజన్ కార్పొరేటర్ షేక్ మక్బూల్ పేర్కొన్నారు. డివిజన్ పరిధిలోని ముస్తఫానగర్ మసీద్ కాంప్లెక్స్, శివాలయం సెంటర్‌లో ఏర్పాటు చేసిన పోలియో కేంద్రంలో ఆదివారం చిన్నారులకు పోలియో చుక్కలు వేసి ప్రారంభించారు.



వైరా : వైరా మండల కేంద్రం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పల్స్ పోలియో కార్యక్రమాన్ని ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాందాస్ నాయక్ మాట్లాడుతూ పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

వైరాటౌన్: భారతదేశంలో పోలియో రహిత సమాజాన్ని నిర్మించే క్రమంలో ఆదివారం చేపట్టిన పోలియో చుక్కల కార్యక్రమాన్ని వైరా మున్సిపాలిటీ పరిధిలోని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వైరా మున్సిపాలిటీ చైర్మన్ సూతకాని జైపాల్ పేర్కొన్నారు. పోలియో రహిత సమాజ నిర్మాణంలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని 0-5 లోపు పిల్లలకు పోలియో చుక్కలు తప్పకుండా వేయించాలని, ఆ దిశగా అధికారులు ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సిహెచ్ వేణు తదితరులు పాల్గొన్నారు.

కొణిజర్ల : పల్స్ పోలియో కార్యక్రమాన్ని జిల్లా జడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజ్ ఆదివారం ప్రారంభించారు. చిన్న పిల్లలకి పల్స్ పోలియో చుక్కలు వేశారు. అనంతరం వైద్యాధికారి సిబ్బంది మిర్చి పొలాల్లో ఉన్న వలసకూలీల పిల్లలకు పోలియో చుక్కలు వేశారు. ఈ సందర్భంగా వైద్య అధికారి మాట్లాడుతూ 3360 ఐదు సంవత్సరాల పిల్లలకు గాను 3206 పిల్లలకు పల్స్ పోలియో చుక్కలు వేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈఓ వినోద్, డిపివో, తహశీల్దార్, ఎంపిడిఓలు పాల్గొన్నారు.

పోలియో చుక్కల కార్యక్రమంలో ప్రోటోకాల్ వివాదం

పోలియో చుక్కల కార్యక్రమంలో ప్రోటోకాల్ వివాదం చెలరేగింది. పోలియో చుక్కల కార్యక్రమం సందర్భంగా జిల్లా పరిషత్ చైర్మన్ లింగాల కమల్ రాజ్ ముఖ్యతిథిగా హాజరవడం పట్ల మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు మండల పరిషత్ కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ గోసు మధు, ఆత్మ కమిటీ చైర్మన్ సొసైటీ వైస్ చైర్మన్ రమేష్ లు మాట్లాడుతూ స్థానిక ఎంపిటిసికి సమాచారం ఇవ్వకుండా పిహెచ్‌సి వైద్యాధికారి కార్యక్రమం ఎలా చేస్తారని ప్రశ్నించారు. అసలే మండల కేంద్రంలో సర్పంచ్‌పై హత్యయత్నం జరిగి మండలంలో రాజకీయ వేడి ఉన్న నేపథ్యంలో అధికారులు తమ ఇష్టానుసారంగా వ్యవహరిస్తే ఎలా అని మండిపడ్డారు. ఇది బీఆర్ఎస్ ప్రభుత్వం కాదని, కాంగ్రెస్ ప్రభుత్వం అని నినాదాలు చేశారు.అనంతరం తహశీల్దార్ తఫజల్ హుస్సేన్, ఎంపిడిఓ రోజా, ఎస్ఐ శంకర్ రావులు మాట్లాడుతూ వైద్యాధికారిని వివరణ అడుగుతామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

మధిర: పోలియో చుక్కల కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మధిర తాసిల్దార్ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. మధిర మండలం రాయపట్నం గ్రామంలో జరిగిన పల్స్ పోలియో కార్యక్రమంలో పాల్గొని పిల్లలకు పోలియో చుక్కలు వేశారు.

తిరుమలాయపాలెం: మండల పరిధిలోని సుబ్లేడు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో నిర్వహించిన పల్స్ పోలియో కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎంపీపీ బోడ మంగీలాల్ నాయక్ హాజరయ్యారు. కార్యక్రమంలో జడ్పిటిసి బెల్లం శ్రీనివాస్, వైద్యాధికారి వసుంధర, మండల వ్యవసాయ శాఖ అధికారి ఎట సీతారాంరెడ్డి పాల్గొన్నారు.

తల్లాడ : తల్లాడలో పల్స్ పోలియో కార్యక్రమాన్ని ఎంపీపీ డి.శ్రీనివాసరావు ఆదివారం ప్రారంభించారు.కార్యక్రమంలో ప్రభుత్వ వైద్యులు డాక్టర్ రత్న మనోహర్, ఎంపిటిసి దగ్గుల రఘుపతిరెడ్డి మండల విద్యాశాఖ అధికారి దామోదర్ ప్రసాద్, సూపర్వైజర్ పెద్ద పుల్లయ్య పాల్గొన్నారు.



రూ.38.50 కోట్లతో బీటీ రోడ్లు

శంకుస్థాపన చేసిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

నవతెలంగాణ-ఎర్రుపాలెం

తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క గ్రామాల అభివృద్ధి కొరకు కోట్ల రూపాయల నిధులను మంజూరు చేయించి బీటీ రోడ్ల నిర్మాణానికి ఆదివారం శంకుస్థాపన చేసి పనులను ప్రారంభించారు. ఎర్రుపాలెం మండల పరిధిలోని అయ్యవారిగూడెం గ్రామం నుండి బుచ్చిరెడ్డిపాలెం గ్రామం వరకు అయ్యవారి గూడెం గ్రామంలో 6.50 కోట్ల రూపాయలతో నిర్మాణం చేయనున్న బీటీ రోడ్డుకు శంకుస్థాపన చేశారు. భీమవరం గ్రామం నుండి గోసవీడు గ్రామం వరకు 16 కోట్ల రూపాయలతో ఫ్లైఓవర్, బీటీ రోడ్డు నిర్మాణానికి భీమవరం గ్రామంలో శంకుస్థాపన, భవానీపురం గ్రామం నుండి కాచవరం గ్రామం వరకు 16 కోట్ల రూపాయలతో నిర్మాణం చేయనున్న బీటీ రోడ్డుకు భవానీపురం గ్రామంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క శంకుస్థాపన కార్యక్రమాన్ని నిర్వహించారు.

అడుగడుగునా డిప్యూటీ సీఎం భట్టికి బ్రహ్మరథం

విజయవాడ విమానాశ్రయం నుంచి అభివృద్ధి కార్యక్రమాలు శంకుస్థాపనకు బయలుదేరిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు ఆంధ్ర సరిహద్దు గ్రామమైన రాజుపాలెం గ్రామం నుంచి అడుగడుగున ప్రజలు కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ప్రజాప్రతినిధులు బ్రహ్మరథం పట్టారు. దారి పొడవున బంతిపూల వర్షం కురిపిస్తూ తమ అభిమానాన్ని చాటుకున్నారు. పూలమాలలు వేసి శాలువాలు కప్పి సత్కారం చేశారు. బీటీ రోడ్లకు శంకుస్థాపన చేసిన గ్రామాలలో మేళ తాళాలతో స్వాగతం పలికారు. సాంప్రదాయ దుస్తులను ధరించి లంబాడి మహిళలు చేసి నృత్యాలు ఈ కార్యక్రమంలో పలువురిని విశేషంగా ఆకట్టుకున్నాయి.బీటీ రోడ్ల శంకుస్థాపన కార్యక్రమాలు ఆయా గ్రామాలలో పండుగ వాతావరణం తలపించే విధంగా నిర్వహించారు. కార్యక్రమంలో డిసిసిబీ డైరెక్టర్ ఐలూరు వెంకటేశ్వరరెడ్డి, ఎంపీపీ దేవరకొండ శిరీష, జడ్పిటిసి శీలం కవిత, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వేమిరెడ్డి సుధాకర్‌రెడ్డి, నాయకులు బండారు నరసింహారావు, సేలం శ్రీనివాసరెడ్డి, అనుమోలు వెంకటకృష్ణారావు, తల్లపురెడ్డి ప్రవల్లిక నాగిరెడ్డి, పూర్ణచంద్రారెడ్డి, బొగ్గుల గోవర్ధన్ రెడ్డి, ఎర్రమల శ్రీనివాసరెడ్డి, వేమిరెడ్డి జయలక్ష్మి వెంకటరామిరెడ్డి, షేక్ ఇస్మాయిల్, గోసు రామారావు, దోమందల సామేలు, మల్లెల లక్ష్మణరావు, వేజెండ్ల సాయికుమార్, నన్నపనేని రామారావు, భూక్య శ్రీను, రాజీవ్ గాంధీ, దేవరకొండ శ్రీను, అనిల్ కుమార్, గంటా తిరుపతమ్మ త్రివేణి, పలు శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యేని కలిసిన పంచాయతీ కార్యదర్శులు

నవతెలంగాణ-వైరాటౌన్

వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్‌ను వైరా మండలం పంచాయతీ కార్యదర్శులు ఆదివారం మర్యాదగా పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్‌ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల పంచాయతీ సెక్రెటరీస్ ప్రెసిడెంట్ గరికపాటి కుమార్, జనరల్ సెక్రటరీ వేణు గోపాల్, మహిళా అధ్యక్షురాలు ఆర్.భారతి, ఉపాధ్యక్షుడు టి.రాధాకృష్ణ, టీ.సురేష్, పి.హనుమంతరావు, అన్ని గ్రామ పంచాయతీల సెక్రెటరీలు, స్పెషల్ ఆఫీసర్స్ పాల్గొన్నారు.

తెలంగాణ గురుకుల డిగ్రీ లెక్చరర్‌గా పేదింటి బిడ్డ ఎంపిక

నవతెలంగాణ-ముదిగొండ

మండలపరిధిలో వల్లభి గ్రామానికి చెందిన సూరపల్లి సీతారాములు కోటమ్మ దంపతుల రెండో కుమారుడు సూరపల్లి జయప్రకాశ్ నారాయణ ఇటీవల గురుకుల బోర్డు ప్రకటించిన డిగ్రీ లెక్చరర్ ఫలితాలలో 7వ ర్యాంకు సాధించి తెలుగు డిగ్రీ లెక్చరర్ ఉద్యోగం సాధించారు. జయప్రకాష్ ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఆచార్య చింతకింది కాసిం పర్యవేక్షణలో "పద్యకవిత్వం"పై పరిశోధన చేస్తున్నారు. బాల్యం నుండే వీరికి తెలుగు సాహిత్యంపై అభిరుచి కావడంతో ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఎంఏ తెలుగు పూర్తి చేశారు. 2023లో రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందర్య రాజన్ మీదుగా యూనివర్సిటీ స్థాయి ఎంఏ తెలుగు గోల్డ్ మెడల్ అందుకున్నారు. అంతేగాక జయప్రకాష్ నారాయణ యూజీసి జెఆర్ఎఫ్ ఫెలోషిప్ సాధించి ఉస్మానియా విశ్వవిద్యాలయ పిహెచ్డి ప్రవేశ పరీక్ష రాసి, పిహెచ్డిలో అడ్మిషన్ పొందారు. పిహెచ్డి జాయిన్ అవగానే గురుకుల బోర్డు డిగ్రీ లెక్చరర్ పరీక్ష రాసి తొలి ప్రయత్నంలోనే ఉద్యోగం సాధించారు. జయప్రకాష్ పరిశోధన మాత్రమే కాక, ఓయూ సాహిత్య వేదిక కార్యదర్శిగా కూడా వీరు పనిచేస్తూ అనేక సాహిత్య కార్యక్రమాలు నిర్వహిస్తూ, సాహిత్య వ్యాసాలు రాస్తూ, సాహిత్య చైతన్యం కలిగిస్తున్నారు. అనేక కష్టనష్టాలకోర్చి జీవితంలో గొప్ప స్థాయికి చేరిన జయప్రకాష్ నారాయణ జీవితం ఆదర్శవంతమైనది. వీరి తాత సూరపల్లి లక్ష్మీపతి కూడా స్వాతంత్ర సమరంలో పాల్గొని ప్రభుత్వ గుర్తింపు పొందారు. తండ్రి సూరపల్లి సీతారాములు మలిదశ తెలంగాణ ఉద్యమంలో సొంత డబ్బుతో పాల్గొని తెలంగాణ సాధనకు పాటుపడ్డారు. నిరుపేద రైతుకూలీ కుటుంబ నుండి వచ్చి, తెలుగు సాహిత్యంలో పరిశోధన చేస్తూ, ఉద్యోగం సాధించటం పట్ల గ్రామస్తులు, కుటుంబసభ్యులు హర్షం వ్యక్తం చేశారు. సోమవారం హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో జరిగే కార్యక్రమంలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమక్షంలో జయప్రకాష్ నారాయణ ఉద్యోగ నియామకపత్రం అందుకోనున్నారు.



మాస్ లైన్ (ప్రజాపంథా)

ప్రదర్శనతో ఎరుపెక్కిన ఖమ్మం

నవతెలంగాణ-ఖమ్మం

మూడు విప్లవ కమ్యూనిస్టు పార్టీల యూనిటీ మహాసభల సందర్భంగా ఆదివారం సాయంత్రం ఖమ్మం నగరంలో భారీ ప్రదర్శన నిర్వహించారు. సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ (ప్రజాపంథా), పిసిసి - సిపిఐ ఎంఎల్, సిపిఐ ఎంఎల్ రివల్యూషనరీ ఇన్సియేటివ్ మూడు విప్లవ కమ్యూనిస్టు పార్టీల నాయకులు, కార్యకర్తలు, కళాకారులు పాల్గొన్న ఈ ప్రదర్శన ఎస్ఆర్అండ్‌బిజిఎన్ఆర్ డిగ్రీ కళాశాల ప్రాంగణం నుండి ప్రారంభమై జడ్పీ సెంటర్, పాత బస్టాండ్ మీదుగా పెవిలియన్ గ్రౌండ్ వరకు ప్రదర్శన నిర్వహించారు. ప్రదర్శనలో వేలాది మంది కళాకారులు పాల్గొన్నారు. ప్రదర్శనలో ఎక్కువ మంది ఎర్ర చొక్కాలు, మహిళలు ఎరుపు రంగు చీరెలను ధరించడంతో ప్రదర్శన మొత్తం ఎరుపు మయమైంది. ప్రదర్శనలో మూడు విప్లవ పార్టీల అగ్ర నాయకులు అగ్రస్థానంలో నిలిచారు.

సూరంపల్లిని పరామర్శించిన మంత్రి తుమ్మల

నవతెలంగాణ-కొణిజర్ల

ఈనెల 29వ తేదీన గుర్తుతెలియని దుండగుల చేతిలో కత్తిపోట్లకి గురై తీవ్రంగా గాయపడిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కొణిజర్ల మాజీ సర్పంచ్ సూరంపల్లి రామారావుని ఖమ్మం కిమ్స్ ఆస్పత్రి నుంచి మెరుగైన వైద్యం కోసం ఆదివారం ఉదయం హైదరాబాద్‌లోని ఏఐజి ఆస్పత్రికి తరలించారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చికిత్స పొందుతున్న సూరంపల్లిని పరామర్శించారు. ధైర్యంగా ఉండాలని సూచించారు. ఏఐజి వైద్యులతో మాట్లాడి మెరుగైన చికిత్స అందించాలని కోరారు.



అవయవదానం.. అత్యున్నతమైన దానం

- మానవత్వంతో అమరత్వం..మరణానంతర జీవం...
- మరణించి జీవించండి....
- తెలంగాణ నేత్ర శరీర అవయవదాతల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, జాతీయ అవార్డు గ్రహీత డాక్టర్ పరికిపండ్ల అశోక్

నవతెలంగాణ-ఖమ్మం

అన్ని దానాల్లోకెల్లా అవయవదానం అత్యున్నతమైనదని, మానవ జన్మకు మహాఅవకాశమని, నేత్రదానంతో అంధుల్లో వెలుగులు, అవయవదానంతో ఆరిపోయే ప్రాణాలకు ఆయుష్షును, దేహదానంతో భావి వైద్యుల పరిశోధనలకు ఉపయోగ పడవచ్చునని, ప్రతి ఒక్కరూ అవయవదానానికి ముందుకు రావాలనీ తెలంగాణ నేత్ర శరీర అవయవదాతల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ అశోక్ పరికిపండ్ల పిలుపునిచ్చారు. ఆదివారం సదాశయ ఫౌండేషన్ మరియు తెలంగాణ నేత్ర శరీర అవయవదాతల సంఘం ఆధ్వర్యంలో ఇటీవల మరణించిన ఖమ్మం జిల్లా వైరాకు చెందిన సీనియర్ కమ్యూనిస్టు లీడర్ కామ్రేడ్ ఏపూరి



కృష్ణారావు నేత్రాలు మరియు దేహాన్ని మమతా మెడికల్ కాలేజీకి దానం చేయగా వారి సంస్మరణ సభ సదాశయ ఫౌండేషన్ చౌడవరపు లింగమూర్తి అధ్యక్షతన జరిగినది. కార్యక్రమంలో డాక్టర్ పరికిపండ్ల అశోక్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ చనిపోయిన తర్వాత అవయవాలను కాల్చడం ద్వారా బూడిద పాలు, మట్టిలో పాతడం ద్వారా మట్టిపాలు చేయకుండా అవయవ దానం చేసి చిరంజీవులుగా మిగిలి పోవాలని తెలిపారు. భారతదేశంలో 12 లక్షల మంది అంధులు ఇంతవరకు ప్రపంచాన్ని చూడలేక, నేత్రదాతల కోసం ఎదురు చూస్తున్నారని ఆవేదన వెలిబుచ్చారు. అనంతరం నేత్రదాన మరియు దేహదాన అభినందన పత్రాలను అతిధుల చేతుల మీదుగా వారి కుటుంబ సభ్యులైన కుమారుడు -ఏపూరి అజయ్ కుమార్, కూతురు- మాదినేని సరళ, మరియు అల్లుడు- మాదినేని రమేష్‌ల సమక్షంలో అందజేశారు. కార్యక్రమంలో అన్నం ఫౌండేషన్ చైర్మన్ అన్నం శ్రీనివాసరావు, సీనియర్ కమ్యూనిస్టు లీడర్ పగడాల నాగేశ్వరరావు, తెలంగాణ నేత్ర శరీర అవయవ దాతల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మాధవరపు నాగేశ్వరరావు, సామాజికవేత్త పొన్నం వెంకటేశ్వరరావు, ఆరోగ్య మిత్ర స్వచ్ఛంద సంస్థ ఖమ్మం కన్వీనర్ గద్ద వెంకట్రామయ్య, కీర్తిశేషులు ఏపూరి కృష్ణారావు మనవళ్ళు - మనవరాళ్ళు రాజ వంశీ, ఆదర్శ్, అనూష, గీతలతో పాటు వారి బంధుమిత్రులు, స్థానిక నాయకులు, పెద్దలు అధిక సంఖ్యలో పాల్గొని వారికి ఘనంగా నివాళులర్పించారు.

వికసించిన గిరిజన మహిళా వికాసం

- ఒకేసారి నాలుగు ఉద్యోగాలకు ఎంపికైన గిరిజన మహిళ
- జూనియర్ లెక్చరర్ ఉద్యోగం వైపు మొగ్గు
- నేడు సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా నియామకపు పత్రాలు అందుకోనున్న

సోయం విజయ

నవతెలంగాణ-సత్తుపల్లి



చదువుకు దూరంగా గిరిజనం అనేది ఒకప్పటి మాట. ఇప్పుడో చదువులో మేం ఎవరికి తీసిపోం అనేది ఇప్పటి మాట. ఆ మాటను నిజం చేసింది ఓ గిరిజన మహిళ. మాస్టర్ ఆఫ్ ఆర్ట్స్‌లో (ఎంఏ)లో పోస్టు గ్రాడ్యుయేషన్ చేసి, ఉద్యోగాల కోసం శిక్షణ పొంది ఏకంగా నాలుగు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించి చదువులో మేము ఎవరికి తీసిపోమని నిరూపించింది సోయం విజయ. వివరాల్లోకి వెళ్తే... సత్తుపల్లి మండలం గంగారం 15వ గిరిజన బెటాలియన్‌లో జూనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగం చేస్తున్న సోయం బాలరాజు భార్య విజయ ఎంఏ బీఈడీ చేశారు. గతేడాది ప్రభుత్వం గురుకులం నోటిఫికేషన్ విడుదల చేయడంతో దానికి దరఖాస్తు చేసుకొని గత ఆగస్టు నెలలో పోటీ పరీక్షలు రాశారు. ఇటీవల ఫలితాలు విడుదల అయి తెలుగు విభాగంలో జేఎల్, పీజీటీ, టీజీటీ ఉద్యోగాలు సాధించడంతో పాటు టీజీటీ (సోషల్) ఇలా నాలుగు ఉద్యోగాలకు విజయ ఎంపికైంది.

విజయ విద్యాభ్యాసం ఇలా...

అశ్వారావుపేట మండలం అల్లిగూడెం గ్రామానికి చెందిన సోయం సూర్యనారాయణ, రామలక్ష్మి గిరిజన దంపతుల కుమార్తె విజయ. ఈమె 1వ తరగతి నుంచి 5 వరకు స్వగ్రామమైన అల్లిగూడెంలో చదివింది. 6 నుంచి 10 వరకు అశ్వారావుపేట జెడ్పీఎస్ఎస్‌లోను, ఇంటర్మీడియట్ అశ్వారావుపేట వీకేడీవీ జూనియర్ కళాశాలలో చదివింది. సత్తుపల్లి నవభారత్‌లో డిగ్రీ పూర్తి చేసింది. పీజీ పాల్వంచ కేఎల్ఆర్ పూర్తిచేసి బీఈడీని పాలకొల్లు నర్సాపురంలో పూర్తి చేసింది. టీటీసీ నందిగామలో చదివి రెండు నెలల పాటు అవనిగడ్డలో శిక్షణ తీసుకోవడంతో పాటు యేడాది పాటు ఆన్‌లైన్ శిక్షణ తరగతులు విని పోటీ పరీక్షలు రాసి నాలుగు ఉద్యోగాలు సాధించింది.

జూనియర్ లెక్చరర్ ఉద్యోగం చేయాలని... నేడు సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా

ఏక కాలంలో నాలుగు ఉద్యోగాలు సాధించిన సోయం విజయ జూనియర్ లెక్చరర్ ఉద్యోగం చేసేందుకు మొగ్గు చూపుతోంది. నేడు (సోమవారం) హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా నియామకపు పత్రాలను అందుకోనున్నట్లు విజయ కుటుంబ సభ్యులు తెలిపారు. ఒకేసారి నాలుగు ఉద్యోగాలు సాధించిన నేపథ్యంలో సత్తుపల్లి ఆదివాసీ ఉద్యోగ జేఏసీ నాయకులు తిరుపతిరావు, రాజారావు, దారా భీమయ్య, రమాదేవి, కణితి నరసింహారావు, వంకా వీరాస్వామి, రామ్మూర్తి, కొర్రి నాగేశ్, సోయం నాగేశ్వరరావు, స్నేహాంజలి, అభిలాశ్, లత సోయం విజయకు అభినందనలు తెలిపారు.



రహదారిని సందర్శించిన అఖిలపక్ష నాయకులు

నవతెలంగాణ-ముదిగొండ

పెద్దమండవ నుండి మల్లారం గ్రామం వరకు తారు రోడ్డు నిర్మాణానికి మధిర శాసనసభ్యులు, రాష్ట్ర ఉపముఖ్యమంత్రి,ఆర్థిక,విద్యుత్ శాఖ మాత్యులు మల్లు భట్టి విక్రమార్క నిధులు మంజూరు చేయటంతో హర్షం వ్యక్తం చేస్తూ ఆదివారం గ్రామ అఖిలపక్షం నాయకులు రహదారిని సందర్శించి పరిశీలించారు. బిటి రోడ్డు నిర్మాణానికి మల్లు భట్టి విక్రమార్క మరో రెండు మూడు రోజుల్లో రెండో దఫా పర్యటించి శంకుస్థాపన చేసేందుకు షెడ్యూలు రానుంది. ఈమేరకు గ్రామ అఖిలపక్ష నాయకులు పైలాన్ నిర్మాణాన్ని చేపట్టారు.ఈ కార్యక్రమంలో సిపిఐ(ఎం) మండల నాయకులు కందిమల్ల తిరుపతి, మాదారపు సత్యనారాయణ, యడ్లపల్లి నరసింహారావు, తాళ్లూరి భాస్కరరావు, గ్రామశాఖ కార్యదర్శి మాదారపు శ్రీనివాసరావు, ఎంపిటిసి సభ్యులు కుక్కల వెంగళరావు, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సింగు వేణు, కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు కోడె నాగేశ్వరరావు, పెంటి నాగేశ్వరరావు, మన్నం వెంకటేశ్వర్లు, పరసగాని తిరుపతిరావు, గ్రామ మాజీ సర్పంచ్ లంకెల లక్ష్మీకాంతరెడ్డి, బిఆర్ఎస్ పార్టీ గ్రామ నాయకులు కోడె నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

నిండు జీవితానికి రెండు పోలియో చుక్కలు

చిన్నారులందరికీ పోలియో చుక్కలు వేయించాలి

కలెక్టర్ విపి.గౌతమ్

నవతెలంగాణ- ఖమ్మం

పోలీయో రహిత సమాజానికై పుట్టిన బిడ్డ మొదలుకొని ఐదు సంవత్సరాల లోపు చిన్నారులందరికీ పోలియో చుక్కలు వేయించాలని కలెక్టర్ విపి.గౌతమ్ అన్నారు. ఆదివారం ఖమ్మం నగరం ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన కేంద్రంలో చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పల్స్ పోలియోలో కార్యక్రమంలో భాగంగా 0–5 ఏండ్లలోపు పిల్లలందరికీ పోలియో చుక్కలు వేసేందుకు జిల్లా వ్యాప్తంగా అన్ని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలతో పాటు ఇతర ప్రాంతాలలో తగిన ఏర్పాట్లు చేసినట్లు. ఇందుకోసం జిల్లా వ్యాప్తంగా హెల్త్ సెంటర్లు, అంగన్వాడీ కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలలు, లైబ్రరీలు, బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. పోలియో చుక్కలు పంపిణీకై జిల్లా వ్యాప్తంగా 1.30 లక్షల మంది చిన్నారులు ఉన్నట్లు వైద్య, ఆరోగ్య శాఖ ద్వారా గుర్తించడం జరిగిందని, వారందరికీ పోలియో చుక్కలు అందించేందుకు వైద్య ఆరోగ్య, సంక్షేమ, మున్సిపాలిటీ ఇతర శాఖల సిబ్బందిని సమకూర్చడం జరిగిందని, రెండు రోజుల పాటు (సోమవారం, మంగళవారం) సిబ్బంది ఇంటింటికీ తిరిగి, ఇంకా ఎవరైనా పోలియో చుక్కలు వేసుకోనివారు ఉంటే గుర్తించి పోలియో చుక్కలు వేస్తారని తెలిపారు. మూడు రోజులపాటు జరిగే పల్స్ పోలియో కార్యక్రమంలో ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు వేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఆయన వెల్లడించారు. వైద్యారోగ్యశాఖతో పాటు ఐసీడీఎస్, విద్య, పురపాలక, సమన్వయంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమ అధికారి డాక్టర్ ప్రమీల, డాక్టర్ లక్ష్మి లోహిత, ఆరోగ్య పర్యవేక్షకులు తాళ్లూరి శ్రీకాంత్, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎర్రుపాలెం: నేషనల్ ఇమ్యూనైజేషన్ డే సందర్భంగా మూడు రోజులపాటు పల్స్ పోలియో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా వైద్యశాఖ అధికారి వరికూటి సుబ్బారావు పేర్కొన్నారు. బనిగండ్లపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నందు ఎంపీపీ దేవర కొండ శిరీష, జడ్పిటిసి శీలం కవిత చిన్నారులకు పోలియో చుక్కలు వేసే కార్యక్రమాన్ని ప్రారంభించారు.మండల వ్యాప్తంగా నిర్వహిస్తున్న పల్స్ పోలియో కార్యక్రమాన్ని సుబ్బారావు పరిశీలించారు. మండలంలో 3,539 మంది పిల్లలకుగానూ 3374 మందికి పోలియో చుక్కలు వేయడం జరిగింది. కార్యక్రమంలో వైద్యాధికారులు వీరబాబు, శశి పూర్ణ, సిహెచ్‌ఓ కాంతమ్మ, హెచ్ఇ ఓ సదాశివరావు, పిహెచ్ఎన్ రాణి, ఆరోగ్య సిబ్బంది, అంగన్వాడి సిబ్బంది పాల్గొన్నారు.

ఖమ్మంరూరల్:మండలంలోని నాయుడుపేటలో పోలియో చుక్కల కార్యక్రమాన్ని ఎంపీపీ బెల్లం ఉమ ఆదివారం ప్రారంభించారు. ఎంవీపాలెం పీహెచ్సీ పరిధిలో పల్స్ పోలియో 89.65 శాతం చిన్నారులకు పోలియో చుక్కలు వేసినట్లు పీహెచ్సీ వైద్యురాలు శ్రీదేవి తెలిపారు. వలస



కూలీల ప్రాంతాల్లో కూడా పోలియో చుక్కలు వేసినట్లు వివరించారు.మిగిలిన వారికి కూడా చిన్నారులకు పోలియో చుక్కలు వేయించాలని పీహెచ్సీ వైద్యురాలు శ్రీదేవి సిబ్బందికి పేర్కొన్నారు.

ముదిగొండ:ముదిగొండ, వల్లభి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో ఆదివారం పల్స్ పోలియో కార్యక్రమాన్ని ఎంపిపి సామినేని హరిప్రసాద్, వల్లభిలో ఎంపిటిసి సభ్యులు బిచ్చాల బిక్షం లాంఛనీయంగా ప్రారంభించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు అంకం అరుణాదేవి, కె ధర్మేంద్ర, వైస్ ఎంపిపి మంకెన దామోదర్, తాసిల్దార్ ఎర్రపాటి రామారావు, ఎంపిఓ పి.సూర్యనారాయణ, జడ్పిటిసి సభ్యురాలు పసుపులేటి దుర్గ, సిహెచ్‌ఓ గుండాల దుర్గమల్లేశ్వరి పాల్గొన్నారు.

కల్లూరు : మండలంలో పల్స్ పోయే కార్యక్రమం 90 శాతం జరిగి ఆదివారం విజయవంతంగా పూర్తి అయింది. పల్స్ పోలియో కార్యక్రమాన్ని ప్రభుత్వ ఆసుపత్రిలో ఎంపీపీ బీరవల్లి రఘు, కొత్త బస్టాండ్‌లో ఎంపీటీసీ కొండూరు కిరణ్ కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మండలంలోని కల్లూరు, చెన్నూరు, ప్రభుత్వ ఆసుపత్రుల వైద్యాధికారులు నవ్యకాంత్ తపస్వి తెలిపిన వివరాలు ప్రకారం మండలంలో మొత్తం 3410 మంది 0 నుండి ఐదు సంవత్సరాలు లోపు వయసు పిల్లలను గుర్తించారు. మండలంలో మొత్తం 56 పల్స్ పోలియో కేంద్రాలు ఏర్పాటు చేసి పోలియో చుక్కలు వేశారు. ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించడానికి రెండు మొబైల్ టీమ్స్ ఏర్పాటు చేసి పర్యవేక్షించినట్లు తెలిపారు. మిగిలిన వారికి కూడా 2 రోజుల్లో ఇంటింటికి తిరిగి పిల్లలందరికీ పల్స్ పోలియో చుక్కలు వేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు కొండూరు కిరణ్‌కుమార్, మాదిరాజు లక్ష్మణరావు, వైద్యాధికారులు పాల్గొన్నారు.

ఖమ్మం : పోలియో రహిత సమాజమే లక్ష్యమని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ వి.సుబ్బారావు అన్నారు. ఆదివారం ఖమ్మంలోని వీడియోస్ కాలనీలోని పాత జిల్లా పంచాయతీ కార్యాలయంలో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ వి.సుబ్బారావు, కార్పొరేటర్ మిక్కిలినేని మంజుల పిల్లలకు పోలియో చుక్కలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ ప్రమీల, మాతా శిశుసంక్షేమ ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ సైదులు, నాయకులు మిక్కిలినేని నరేంద్ర, డాక్టర్ కృష్ణ చైతన్య, మెప్మా అధికారులు వెంకటేశ్వరు, సుజాత, ఐసీడీఎస్ సూపర్వైజర్‌లు,వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

ఖమ్మంకార్పొరేషన్: ఖమ్మం నగరంలోని త్రీ టౌన్ ప్రాంతంలోని స్థానిక 48వ డివిజన్ యూపీహెచ్ వెంకటేశ్వర నగర్‌లోని ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన పల్స్ పోలియో కార్యక్రమాలను స్థానిక కార్పొరేటర్ తోట గోవిందమ్మ, రామారావు కలిసి ప్రారంభించారు.

బోనకల్ : బోనకల్ మండలంలో ఆదివారం నిర్వహించిన పల్స్ పోలియో కార్యక్రమం విజయవంతంగా ముగిసింది. మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మండల తహసిల్దార్ అనిశెట్టి పొన్నం చందర్ చిన్నారికి పోలియో చుక్కలు వేసి ప్రారంభించారు. మండల పరిధిలోని తూటికుంట్ల గ్రామంలో ఎంపీపీ కంకణాల సౌభాగ్యం చిన్నారికి పోలియో చుక్కలు వేసి ప్రారంభించారు. బోనకల్ ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలీసులకు కేంద్రాన్ని జిల్లా ప్రోగ్రామ్ ఆఫీసర్ లక్ష్మీనారాయణ పరిశీలించారు. ఈ సందర్భంగా చిన్నారికి ఆయన పోలియో చుక్కలు వేశారు. మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన పోలియో బూత్‌లో మండల పరిషత్ ఉపాధ్యక్షుడు గుగులోతు రమేష్ ప్రారంభించారు. మండలాన్ని రెండు రూట్లుగా విభజించి మండల వ్యాప్తంగా 29 పోలియో కేంద్రాలను ఏర్పాటు చేశారు. మండల వ్యాప్తంగా 2,734 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేయవలసి ఉండగా 2,574 మందికి పోలియో చుక్కలు వేసినట్లు మండల ప్రాథమిక వైద్యాధికారిని వేముల స్రవంతి తెలిపారు. మండల వ్యాప్తంగా 94 శాతం పోలీసు శుక్ల వేసినట్లు ఆమె తెలిపారు. మిగిలిన 160 మంది చిన్నారులకు వారి ఇళ్లకు వెళ్లి పీహెచ్సీ సిబ్బంది పోలియో చుక్కలు వేస్తారని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో లకావత్ రాజు ఎంపీ ఓ వ్యాకరణ వెంకట సుబ్రహ్మణ్య శాస్త్రి గిర్దావర్ -1 గుగులోతు లక్ష్మణ్ సిహెచ్‌ఓ పెద్దినేని శ్రీనివాసరావు హెల్త్ సూపర్వైజర్లు మందా దానయ్య, టి స్వర్ణ మారతమ్మ ఆయా గ్రామాలలో ఎంపీటీసీలు, తాజా మాజీ సర్పంచులు, ఏఎన్ఎంలు, అంగన్వాడీ కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఖమ్మం కార్పొరేషన్ : పోలియో రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కార్పొరేటర్ మాడూరి ప్రసాద్ అన్నారు. ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని స్థానిక 39 డివిజన్‌లో అంగన్వాడి కేంద్రంలో కార్పొరేటర్ మాడూరి ప్రసాద్ పల్స్ పోలియో కార్యక్రమాన్ని ఆదివారం ప్రారంభించారు.













భారత రాజ్యాంగం 5వ షెడ్యూల్‌ను అమలు చేయాలి

- ఎల్‌పీహెచ్‌ఎస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షులు కేశవ్‌నాయక్

నవతెలంగాణ-జూలూరుపాడు

భారత రాజ్యాంగం 5వ షెడ్యూల్‌ను అమలు చేయాలని, ఏజెన్సీ ప్రాంతంలో ఉద్యోగాలను 100% గిరిజన నిరుద్యోగులతోనే భర్తీ చేయాలని ఎల్ పిహెచ్‌ఎస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షులు కేశవ్ నాయక్ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. ఆదివారం జూలూరుపాడు మండలం గురువాగు తండాలో జరిగిన సమావేశం కేశవ్ నాయక్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం గత రాష్ట్ర ప్రభుత్వం బీఆర్ఎస్ గిరిజన హక్కులైన జీఓ నెం 03 కరోనా సమయంలో రద్దు దిశగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం గిరిజన ఏజెన్సీ హక్కులను కాలరాసిందని, ప్రస్తుత ప్రభుత్వం ట్రైబల్ అడ్వైజర్ కమిటీ తీర్మానం చేసి 100% రిజర్వేషన్ అమలు చేసిన తరువాతనే ప్రభుత్వం ఉద్యోగ నోటిఫికేషన్ ఇచ్చి భర్తీ చెయాలనీ, ఏ ఒక గిరిజన విద్యార్థులు నష్ట పోకుండా కాపాడుకోవలసిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే ఈ జీఓ నెం 03 మీద కేంద్రంలో రాష్ట్రంలో వివిధ చట్ట సభలకు ఎన్నికైన గిరిజన ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, ఎంపిలు తమ తమ ప్రభుత్వాలకు ఏజెన్సీ ప్రాంతంలో గిరిజనులకు జరిగే అన్యాయాలపై ప్రశ్నించాలని కోరారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

నవతెలంగాణ-జూలూరుపాడు

మండలం బొజ్జ తండా గ్రామపంచాయతీ వెనక తండ గ్రామంలో ఉప ముఖ్య మంత్రి మల్లు భట్టి విక్రమార్క సతీమణి, అమ్మ ఫౌండేషన్ చైర్మన్ మల్లు నందిని విక్రమార్క క్యాలెండర్‌ను కాంగ్రెస్ పార్టీ సేవాదళ్ మండల అధ్యక్షులు వాంకుడోత్ కిషన్ నాయక్ ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేపు జరగబోయే పార్లమెంట్ ఎలక్షన్‌లో ఖమ్మం నుంచి మన కాంగ్రెస్ అభ్యర్థిని భారీ మెజారిటీతో పార్లమెంటుకు పంపియాలని కోరారు. ఈ కార్యక్రమంలో ధరావత్ రాందాస్ నాయక్, హత్తి రామ్ నాయక్, వినోద్ కుమార్, క్రాంతి కుమార్, తులసియా తదితరులు పాల్గొన్నారు.

పోలియో రహిత సమాజం కోసం చుక్కలు వేయించాలి

- జెడ్పీటీసీ, ఎంపీపీ

నవతెలంగాణ-ఆళ్ళపల్లి



పోలియో రహిత సమాజం కోసం పోలియో చుక్కలు ఐదేళ్ల లోపు చిన్నారులకు తప్పకుండా వేయించాలని స్థానిక జెడ్పీటీసీ కొమరం హనుమంతరావు, ఎంపీపీ కోండ్రు మంజు భార్గవి సూచించారు. ఈ మేరకు ఆదివారం మండలంలోని పలు గ్రామాల్లో పల్స్ పోలియో దినోత్సవం సందర్భంగా 5 ఏండ్ల లోపు చిన్నారులకు స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు రేవంత్, సంఘమిత్రల ఆధ్వర్యంలో పోలియో చుక్కల కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జెడ్పీటీసీ, ఎంపీపీ హాజరై, లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ.. ఆళ్ళపల్లి మండలంలో 1713 మందికి పోలియో చుక్కలు వేయాల్సి ఉండగా ఆదివారం 1672 మంది పిల్లలకు పోలియో చుక్కలు వేయడం జరిగిందని చెప్పారు. మొత్తంగా 97% శాతం పోలియో చుక్కలు వేయడం పూర్తయినట్లు తెలిపారు. మండలంలో మిగిలిన ఐదు సంవత్సరాల లోపు పిల్లలకు వారి తల్లిదండ్రులు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఆసుపత్రి వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లు, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఖమ్మం పార్లమెంట్ నియోజకవర్గ స్థాయి జనరల్ బాడీ సమావేశానికి తరలిరావాలి

- సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె.సాబీర్ పాషా

నవతెలంగాణ-కొత్తగూడెం

రానున్న పార్లమెంటు ఎన్నికల్లో సిపిఐ అనుసరించే రాజకీయ విధానాలపై నిర్ణయం తీసుకునే ఎజెండా అంశంపై సోమవారం ఖమ్మం నగరంలోని ఎంబి గార్డెన్స్‌లో ఖమ్మం పార్లమెంటు నియోజకవర్గ స్థాయి జనరల్ బాడీ సమావేశం నిర్వహిస్తున్నట్లు సిపిఐ భద్రాద్రి జిల్లా కార్యదర్శి సాబీర్ పాషా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మతతత్వ, కార్పొరేట్ బిజెపిని గద్దెదింపే లక్ష్యంతో సిపిఐ కార్యాచరణకు పూనుకుందని అన్నారు. ఈ సమావేశానికి సిపిఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ, రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి, జాతీయ సమితి సభ్యులు భాగం హేమంతరావు, రాష్ట్ర కంట్రోల్ కమిష చైర్మన్ మహమ్మద్ మౌలానా, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అయోధ్య, దండి సురేష్ పాల్గొంటున్నట్లు తెలిపారు. ఖమ్మం పార్లమెంటు నియోజకవర్గ పరిధిలోని భద్రాద్రి జిల్లాకు చెందిన కొత్తగూడెం, పాల్వంచ, లక్ష్మీదేవిపల్లి, చుంచుపల్లి, సుజాతనగర్, జూలూరుపాడు, అశ్వారావుపేట, దమ్మపేట, ములకలపల్లి, చంద్రుగొండ, అన్నపురెడ్డిపల్లి మండలాల సమితి సభ్యులు, జిల్లా కార్యవర్గ సభ్యులు సమావేశానికి హాజరుకావాలని సాబీర్ కోరారు.

స్కిల్ డెవలప్ మెంట్ ట్రైనింగ్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలి

సింగరేణి చైర్మెన్‌కు వినతి

నవతెలంగాణ-కొత్తగూడెం

సింగరేణి ప్రాంతంలో కొత్తగూడెం పారిశ్రామిక ప్రాంతం కాబట్టి స్కిల్ డెవలప్ ట్రైనింగ్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తే ఈప్రాంతపు నిరుద్యోగులక ఉపయోగమని సింగరేణి కాలరీస్ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగస్తుల సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి అంతోటి నాగేశ్వరరావు తెలిపారు. సింగరేణి కాలరీస్ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం సింగరేణి చైర్మెన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ బలరామ్‌ను సింగరేణి కాలరీస్ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగస్తుల సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి అంతోటి నాగేశ్వరరావు కోరారు. ఆదివారం సింగరేణి కాలరీస్ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగస్తుల సంక్షేమ సంఘం ఆఫీస్‌లో ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఫిట్టర్, ఎలక్ట్రిషన్, డిప్లొమా, ఇంటజనీరింగ్ చేసిన నిరుద్యోగులకు ఈ ట్రైనింగ్ సెంటర్‌లో శిక్షణ ఇవ్వడం వలన వారు నైపుణ్యం నేర్చుకొని (శిక్షణ) నిష్ణాతులై స్వయం శక్తి మీద నిలబడటానికి అవకాశం ఉంటుందని తెలిపారు.ఈవిషయంలో చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్. బలరామ్ చొరవ తీసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో కేంద్ర కమిటీ ట్రెజరర్‌జిమ్మిడి మల్లేష్, ఊట్ల గణేష్, మీసాల శ్రీహరి, కెడెం మనీష్ విక్టర్, ఎం.నర్సింగరావు, బూర్గుల రామారావు, రవి తదితర పాల్గొన్నారు.

ప్రజాజీవితంలోకి రండి.. ప్రశాంతంగా జీవించండి

- ఎస్సై రాజమౌళి

నవతెలంగాణ-ములకలపల్లి



మావోయిస్టు జీవితాన్ని వీడి ప్రజాజీవితంలోకి వచ్చి కుటుంబసభ్యులతో కలిసి ప్రశాంతంగా జీవించాలని మావోయిస్టు సానుభూతిపరులకు ములకలపల్లి ఎస్సై రాజమౌళి సూచించారు. ఆదివారం మాట్లాడుతూ కాలం చెల్లిన సిద్ధాంతాలతో మావోయిస్టు పార్టీ తెలంగాణాలో తమ మనుగడను కోల్పోయిందని, మావోయిస్టు పార్టీలో ప్రస్తుతం పనిచేసే నాయకులు దళ సభ్యులకు వారి కుటుంబసభ్యులు ఎంతగానో ఎదురుచూస్తున్నారన్నారు. ఇప్పటికైనా మావోయిస్టులు తమ కుటుంబసభ్యుల కోసం పార్టీని వీడి జనజీవన స్రవంతిలో కలిసి ప్రశాంత జీవనాన్ని సాగించాలని విజ్ఞప్తి చేశారు. లొంగిపోయిన మావోయిస్టులకు ప్రభుత్వం నుంచి అంటే అన్నిరకాల ప్రతిఫలాలు అందించి పునరావాసం కల్పించేలా పోలీసుశాఖ కృషిచేస్తుందని ఎస్సై తెలిపారు.

కాంగ్రెస్ గూటికి తెల్లం ఖాయం...

• కుటుంబ సమేతంగా సీఎంని కలిసిన భద్రాచలం ఎమ్మెల్యే

నవతెలంగాణ-భద్రాచలం రూరల్



ఎన్నికల ఫలితాలు ఎలువడిన నాటినుండి విస్తృతంగా జరుగుతున్న ప్రచారం నేడో రేపో నిజం కానుంది. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోనే గెలిచిన ఏకైక బిఆర్ఎస్ ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు సైతం కాంగ్రెస్ గూటికి చేరటం ఖాయమైనట్టుగా స్పష్టమవుతుంది. మొదటి నుండి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ప్రధాన అనుచరుడిగా పేరుపడిన తెల్లం వెంకట్రారావు ఎన్నికల సమయంలో కాంగ్రెస్ గూటికి చేరినప్పటికీ మారిన సమీకరణ నేపథ్యంలో కాంగ్రెస్‌లో సీటు దక్కిందని విషయం స్పష్టమైన నేపథ్యంలో తిరిగి బీఆర్ఎస్ పార్టీలో చేరి ఎమ్మెల్యేగా గెలుపొందిన విషయం తెలిసిందే. పేరుకే బీఆర్ఎస్ పార్టీ నుండి గెలిచిన పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అభయహస్తంతోనే ఎన్నికల్లో విజయం సాధించారన్న ప్రచారం జోరుగా కొనసాగిన విషయం కూడా తెలిసిందే. అధికార పార్టీకి చెందిన అభ్యర్థులే ఎమ్మెల్యేలుగా గెలిస్తే నియోజకవర్గం అభివృద్ధి సాధ్యమవుతుందని ఒకే ఒక ప్రచారంతో ఎన్నికల బరిలో నిలిచిన తెల్లం వెంకట్రావు వ్యక్తిగతంగా తను గెలిచినప్పటికీ రాష్ట్రంలో బిఆర్ఎస్ పార్టీ అధికారం కోల్పోవడంతో ఏదో ఒక రోజు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో తెల్లం వెంకట్రావు కాంగ్రెస్ పార్టీలో చేరటం ఖాయమని ప్రచారం జరుగుతున్న తరుణంలోనే ఆదివారం నాడు కుటుంబ సభ్యులతో కలిసి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి నాయకత్వంలో నియోజకవర్గ సమస్యలపై చర్చించాలన్న పేరుతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలవటంతో తెల్లం కాంగ్రెస్ గూటికి చేరటం ఖాయమని నియోజకవర్గ వ్యాప్తంగా ఒక్కసారిగా ప్రచారం ఊపందుకుంది. పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తుండటంతో మహబూబాద్ పార్లమెంటు సీటుని ఖచ్చితంగా కాంగ్రెస్ పార్టీ గెలిచేందుకు భద్రాచలం నియోజకవర్గ ఎమ్మెల్యే సైతం కాంగ్రెస్ పార్టీలో చేరితే గెలుపు మరింత సునాయాసం చేసుకోవచ్చన్న కాంగ్రెస్ అంచనా వేస్తుందని తెలుస్తుంది. ఇప్పటికే మహబూబాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్చార్జిగా పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి బాధ్యతలు అప్పజెప్పిన నేపథ్యంలో ఆయన ప్రధాన అనుచరుడుగా ముద్రపడ్డ తెల్లం వెంకట్రావు కాంగ్రెస్ గూటికి చేరితే ఆ పార్టీ బలం మరింత పెరిగే అవకాశాలు లేకపోలేదు. మరోపక్క తెల్లం వెంకట్రావు ప్రధాన అనుచర వర్గం సైతం అధికార పార్టీలోకి వెళ్లాలని ఎమ్మెల్యేపై తీవ్రమైన ఒత్తిడి తెస్తున్నారన్న ప్రచారం నడుస్తుంది. ఇటీవల బీఆర్ఎస్ పార్టీ ప్రజాప్రతినిధులు మేడిగడ్డ సందర్శన యాత్రలో కూడా తెల్లం కనిపించకపోవడం నేడు ముఖ్యమంత్రిని కలవడం చూస్తుంటే కాంగ్రెస్ గూటికి చేరేందుకు ముహూర్తం ఫిక్స్ చేసుకున్నట్టుగా ఆయన ప్రధాన అనుచర వర్గమే మీడియాలకు లీకలు ఇవ్వడం చూస్తుంటే ఉమ్మడి ఖమ్మం జిల్లాలో బీఆర్ఎస్ పార్టీ నుండి ఒక ఎమ్మెల్యేని కూడా అసెంబ్లీ గేటు తాకనివ్వను అన్న పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి శబద్ధం సంపూర్ణమయ్యే అవకాశాలు మరింత దూరం లేదని, నిన్న నేడు జరిగే రాజకీయ పరిణామాలు స్పష్టం చేస్తున్నాయి. అందరి అంచనాలు నిజమై తెల్లం కాంగ్రెస్ గూటికి చేరితే మారే రాజకీయ పరిణామాలు మరింత ఆసక్తికరంగా మారటం ఖాయమని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

కొత్తగూడెంలో ఇంటర్ స్పాట్ వాల్యుయేషన్ క్యాంప్

• ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

నవతెలంగాణ-కొత్తగూడెం



కొత్తగూడెం పట్టణంలో ఇంటర్ స్పాట్ వాల్యుయేషన్ (పరీక్ష పేపర్లు మూల్యాంకనం కేంద్రం) క్యాంప్ ఏర్పాటు చాల సంతోష కరమని కొత్తగూడెం ఎమ్మెల్యే కూననేని సాంబశివరావు అన్నారు. ఆదివారం కొత్తగూడెం పట్టణంలోని సింగరేణి జూనియర్ మహిళా కళాశాలలో తెలంగాణ గెజిటెడ్ జూనియర్ లెక్చరర్స్ అసోసియేషన్ (475 అసోసియేషన్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ కొప్పిశెట్టి సురేష్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే కూనంనేని మాట్లాడుతూ కొత్తగూడెం పట్టణంలో సింగరేణి కాలరీస్ మహిళ జూనియర్ కాలేజీలో ఇంటర్ స్పాట్ వేల్యూషన్ క్యాంపు రావడం చాలా సంతోషమని, అధ్యాపకుల కోరిక మేరకు ప్రభుత్వం, ఇంటర్ బోర్డు ఈ నిర్ణయం చేయటం చాలా మంచి నిర్ణయం అని, ఈ క్యాంపును విజయవంతం చేయడానికి అధ్యాపకులు అందరూ కృషి చేయాలన్నారు. క్యాంపు వచ్చినందుకు సంతోషం తెలియజేస్తూ, అధ్యాపకులు అందరూ ఐక్యంగా ఉండాలని కోరారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేస్తూ శు భాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న జిల్లా ఇంటర్మీడియట్ విద్య నోడల్ ఆఫీసర్ సులోచన రాణి మాట్లాడుతూ సింసగరేణి చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ బలరాం నాయక్, డైరెక్టర్స్ ఎన్‌విక. శ్రీనివాస్, ఎడ్యూకేషన్ జిఎం వెంకటేశ్వరరావు సహకారంతో, ఇంటర్ స్పాట్ క్యాంపు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. దీనివలన భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని ప్రభుత్వ, సోషల్ వెల్ఫేర్, కెజిబివీ, మోడల్ స్కూల్, ప్రైవేట్ మొదలైన 170 జూనియర్ కళాశాలలో పనిచేస్తున్న 900 మంది అధ్యాపకులకు ఈ క్యాంపు చాలా సౌకర్యవంతంగా ఉంటుందని భావించి ఇంటర్ బోర్డు అధికారులు ఈ కళాశాలలో ఏర్పాటు చేసుకోవడానికి అనుమతి ఇవ్వడం జరిగిందని తెలిపారు. కళాశాల కరస్పాండెంట్ నికోలస్ మేడం, కళాశాల ప్రిన్సిపాల్ సంధ్యారాణి, ప్రిన్సిపల్ అసోసియేషన్ నాయకులు శేషు బాబు, జూనియర్ లెక్చరర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు జాస్తి రమేష్, పాలిటెక్నిక్ లెక్చరర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఉదయ భాస్కర్, గెజిటెడ్ ఆఫీసర్స్ జిల్లా నాయకులు విజయకుమార్, 475 రాష్ట్ర మహిళా కార్యదర్శి షాహినా సుల్తానా, తెలంగాణ గెజిటెడ్ జూనియర్ లెక్చరర్స్-475, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నందికొండ వెంకన్న తోర్తి జాన్ జాన్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సిహెచ్.నాగేశ్వరరావు, రాష్ట్ర కౌన్సిలర్స్ రవీంద్రబాబు, లక్ష్మీనారాయణ కోశాధికారి దుమ్ముగూడెం శ్రీనివాస్, 475 ఏఎస్ఎస్ఎన్ ఖమ్మం జిల్లా నాయకులు బండి ఈశ్వర్, వివిధ సంఘాల నాయకులు బండి వెంకటేశ్వర్లు, బాలస్వామి, శ్రీను, బండి లక్ష్మణ్, వివిధ కళాశాల అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొని క్యాంపు రావడం పట్ల సంతోషం వ్యక్తం చేస్తూ, తెలంగాణ రాష్ట్ర ఇంటర్ బోర్డ్ కార్యదర్శి శృతి, ఓజ మేడంకి తెలంగాణ రాష్ట్ర ఇంటర్ బోర్డ్ కంట్రోల్ ఆఫ్ ఎగ్జామినేషన్ జయప్రద, ఇతర అధికారులకు ధన్యవాదాలు తెలిపారు. 475 అసోసియేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్ సిహెచ్.నాగేశ్వరావు, షాహినా సుల్తానా తదితరులు పాల్గొన్నారు.

పట్టాలిచ్చిన వారికి ఇళ్ల స్థలాలు పంపిణీ చేయాలి

• ఇంటి నిర్మాణానికి రూ.5లక్షలు ఇవ్వాలి

సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు ఏజే.రమేష్

నవతెలంగాణ-కొత్తగూడెం



కొత్తగూడెం మున్సిపాలిటీలో పట్టాలిచ్చిన వారికి తక్షణమే స్థలం చూపించి లబ్ధిదారులకు ఇల్లు నిర్మించి ఇవ్వాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు ఏజే.రమేష్ డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక మంచికంటి భవన్‌లో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం కొత్తగూడెం మున్సిపాలిటీ పరిధిలో 800 మందికి 77 గజాల చొప్పున స్థలం కేటాయిస్తూ పట్టాలు ఇచ్చిందని వారికి స్థలం మాత్రం చూపించలేదన్నారు. ప్రస్తుతం నూతనంగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు ఇందిరమ్మ ఇల్లు నిర్మిస్తామని హామీ ఇచ్చిందని, ఆ హామీలో భాగంగా గత ప్రభుత్వం ఎవరినైతే లబ్ధిదారులను గుర్తించి పట్టాలిచ్చిందో వారికి స్థలం చూపించి అందులో ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. ఇల్లు పూర్తి చేసి పేదలకు ఇవ్వడంలో గత ప్రభుత్వం నిర్లక్ష్యం వహించిందన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అసంపూర్తిగా ఉన్న డబల్ బెడ్ రూమ్ ఇండ్లను పూర్తి చేసి తక్షణమే లబ్ధిదారులకు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. అలాగే డబల్ బెడ్ రూమ్ పక్కన ఉన్న ఖాళీ స్థలాన్ని పట్టాలు ఇచ్చిన పేదలకు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో లబ్ధిదారులను కలుపుకొని ప్రభుత్వ ఖాళీ స్థలంలో గుడిసెలు వేపిస్తామని ఏజే. హెచ్చరించారు. ఈ సమావేశంలో సీపీఐ(ఎం) పట్టణ కార్యదర్శి లిక్కి బాలరాజు, జిల్లా కమిటీ సభ్యులు భూక్య రమేష్, డి.వీరన్న, సందకూరు లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

'బయోమెట్రిక్, కెమెరాల ప్రతిపాదన ఉపసంహరించుకోవాలి'

నవతెలంగాణ-పాల్వంచ



ఎందుకు అంగన్వాడీ కేంద్రాలకు సీసీ కెమెరాలు, బయోమెట్రిక్ పెట్టాలనేప్రభుత్వ ప్రతిపాదనలు ఉపసంహరించుకోవాలని తెలంగాణఅంగన్ వాడీటీచర్స్ హెల్పర్స్ (సిఐటియు) యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు ఈసం వెంకటమ్మ, జి.పద్మ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం అంగన్వాడీ కేంద్రాలపై ప్రభుత్వ ప్రతిపాదనలపై విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల మ్యానిపెస్టోలు అంగనివాడీలకు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా కొత్త నిబంధనలతో మరింత ఇబ్బంది పెట్టే ప్రయత్నం సరికాదన్నారు. పరిష్కరించవలసిన సమస్యలు ఎన్నో ఉన్నా వాటిపై దృష్టి పెట్టకుండా నిబంధనల పేరుతో ఈ ప్రతిపాదన తీసుకురావడం ఎంతవరకు సమంజసం అని అన్నారు. అంగన్ వాడీటీచర్లను తమ పనితాముచేసుకునే అవకాశం లేకుండా ప్రభుత్వం చెప్పే అదనపు పనులు రద్దుచేయాలి. ఈ క్రమంలో అంగన్వాడి కేంద్రాలలో టీచర్లు ఉండకుంట చేస్తున్నటువంటి ప్రభుత్వ ఇప్పుడు అంగన్వాడి కేంద్రాలకు సీసీ కెమెరాలు బయోమెట్రిక్ విధానం అంటే దెయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉందని పెర్కొన్నారు. నెల నెల బిల్లులు ఇచ్చిన ఇవ్వకపోయినా పోషకాహారం ఇన్ టైంలో రాకపోయినా అంగన్వాడీలు తన సొంత డబ్బులతో కొని పిల్లలకు పోషకాహారాన్ని అందిస్తా ఉంటే వారి సేవలపై ఇలా పెట్టడం చాలా దుర్మార్గమైన చర్యలు అన్నారు. కనీస సౌకర్యాలు కల్పించలేని ప్రభుత్వం ఇలా అంగన్వాడీ కేంద్రాలపై నిఘాపెట్టడం సరైన కాదన్నారు.

కార్యకర్తల కుటుంబాలకు సీపీఐ(ఎం) అండ

• జానయ్యకు నివాళులర్పించిన సీపీఐ(ఎం) బృందం

నవతెలంగాణ-భద్రాచలం రూరల్



పార్టీలో పని చేస్తూ అమరులైన కుటుంబాలకు పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని సీపీఐ(ఎం) భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య స్పష్టం చేశారు. ఆదివారం భద్రాచలం పట్టణ సీనియర్ పార్టీ సభ్యులు జానయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా అన్నవరపు కనకయ్య మాట్లాడుతూ... జానయ్య కుటుంబం మొత్తం మొదటి నుండి పార్టీలోనే కొనసాగుతుందన్నారు. సీపీఐ(ఎం)కి ఓట్లు సీట్లు కంటే కార్యకర్తలే ప్రధాన బలం అని ఈ సందర్భంగా ఆయన అభిప్రాయపడ్డారు. పార్టీని నమ్ముకున్న కార్యకర్తలకు పార్టీ ఎప్పుడు అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ సభలో పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు మచ్చ వెంకటేశ్వర్లు, ఏజే. రమేష్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎంబి. నర్సారెడ్డి, పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి, జిల్లా కమిటీ సభ్యులు మర్లపాటి రేణుక, సున్నం గంగా, సీనియర్ నాయకులు జిఎస్. శంకర్రావు, కార్యదర్శి వర్గ సభ్యులు బండారు శరత్‌బాబు, ఎర్రంశెట్టి వెంకట రామారావు, నాదెండ్ల లీలావతి, పట్టణ కమిటీ సభ్యులు డి. సీతాలక్ష్మి, ఉస్తేల జ్యోతి, జీవనజ్యోతి, లక్ష్మణ్, నాగరాజు, కుంజా శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత బిల్లు తీసి...పోలియో చుక్కలు వేసి...

- బస్టాండ్ ప్రాంగణంలో కలియ తిరిగి...

- శుభకార్యానికి హాజరైన ఎమ్మెల్యే జారే...

నవతెలంగాణ-అశ్వారావుపేట



నియోజక వర్గం కేంద్రం అయిన అశ్వారావుపేటలో ఆదివారం ఎమ్మెల్యే జారే ఆదినారాయణ హడావుడీ చేశారు. అశ్వారావుపేట ఆరోగ్య ఉప కేంద్రంలో పల్స్ పోలియో కార్యక్రమాన్ని లాంచనంగా ప్రారంభించిన అనంతరం బస్టాండ్ ప్రాంగణంలో కలియ తిరిగారు. ఎమ్మెల్యే అయ్యాక బస్టాండ్‌ను సందర్శించడం ఇది నాలుగోసారి. ఈ సందర్భంగా బస్టాండ్ క్యాంటీన్ అపరిశుభ్రతపై ఆగ్రహం వ్యక్తం చేసారు. మళ్ళీ సారి వచ్చే సరికి ఇలానే ఉంటే బాగోదని హెచ్చరించారు. పాపిడిగూడెంలో ఒక శు భకార్యానికి హాజరయ్యారు. వినాయకపురంలో గృహ జ్యోతి పథకంలో ఉచిత విద్యుత్ బిల్లులను లాంచనంగా ప్రారంభించి తానే స్వయంగా విద్యుత్ బిల్లులు తీసారు. వినాయకపురం పి హెచ్ సిలో పల్స్ పోలియో చుక్కలు వేసారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రాందాస్, విద్యుత్‌శాఖ ఎల్ఐ రామక్రిష్ణ, పిఎసిఎస్ అశ్వారావుపేట అధ్యక్షులు చిన్నంశెట్టి సత్యనారాయణ, పేరాయిగూడెం ఎంపిటిసి మిండ హరిక్రిష్ణ, నాయకులు జ్యేష్ఠ సత్యనారాయణ చౌదరి, జూపల్లి ప్రమోద్, దండాబత్తుల నరేష్ పాల్గొన్నారు.

ఆరు గ్యారంటీల్లో నాలుగు గ్యారంటీలు అమలు చేశాం

• గృహజ్యోతి పథకం ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే పాయం

నవతెలంగాణ-బూర్గంపాడు



ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కొత్తగా ఏర్పడిన ప్రభుత్వంలో ఆరు గ్యారంటీల్లో నాలుగు గ్యారంటీలను అమలుచేశామని మిగిలిన రెండు గ్యారం టీలను కూడా త్వరలోనే సీఎం రేవంత్‌రెడ్డి అమలు చేస్తారని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. ఆదివారం మండల పరిధిలోని మోరంపల్లిబంజర్లో గృహజ్యోతి పథకంలో భాగంగా జీరో బిల్లు తీసి లబ్ధిదారురాలికి బిల్లు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయం మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ 200 లోపు యూనిట్లు ఉచితంగా అందించడం గర్వకారణమంగా ఉందన్నారు. ప్రభు త్వ పథకాలను పేదలకు, అర్హులకు అందించడమే లక్ష్యమన్నారు. అనంతరం అదే గ్రామంలో అనారోగ్యంతో బాధపడుతున్న బత్తుల వెంకటే శ్వర్లను పాయం పరామర్శించారు. ఈ కార్యక్రమంలో ట్రాన్స్ కో ఏఈ గుర్రం ఉపేందర్, ఏడీ వేణు, మాజీ సొసైటీ చైర్మన్ పోతిరెడ్డి వెంకటేశ్వ రరెడ్డి, లక్ష్మీపు రం ఉపసర్పంచ్ పోతిరెడ్డి వెంక టేశ్వరరెడ్డి, మోరం పల్లిబంజర్ ఉపసర్పంచ్ కైపు లక్ష్మీనారాయణ రెడ్డి, నాయకులు బాదం రమేష్ రెడ్డి బర్ల నాగమ ణి, నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



త్రివేణిలో ఫన్ ఫెస్ట్ వేడుకలు

నవతెలంగాణ-కొత్తగూడెంటౌన్

స్థానిక లక్ష్మీదేవిపల్లి త్రివేణి పాఠశాలలో 30వ ఫన్ ఫెస్ట్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యమానికి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా విద్యా శాఖ అధికారి వేంకటేశ్వరాచారి, కొత్తగూడెం డీఎస్పీ అబ్దుల్ రహమాన్ ముఖ్య అతథులుగా విచ్చేశారు. ఈ సంధ్భంగా వేంకటేశ్వరా చారి మాట్లాడుతూ పిల్లలకు చదువులతో పాటు ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించడం చాలా బాగుందన్నారు. అబ్దుల్ రహమాన్ మాట్లాడుతూ విద్యార్థులు ఎదిగే వయసులో చాలా జాగ్రత్తతో ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో త్రివేణి కృష్ణవేణి విద్యా సంస్థల డైరెక్టర్స్ గొల్లపూడి జగదీశ్, మాచవరపు కోటేశ్వర రావు, డాక్టర్ గొల్లపూడి వీరేంద్ర చౌదరి, సిఆర్ఓ కాట్రగడ్డ మురళీకృష్ణ, ప్రిన్సిపాల్ వైవి. సురేష్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ మహాసభలకు తరలిన ప్రజాపంథా శ్రేణులు

నవతెలంగాణ-దమ్మపేట

ఖమ్మంలో జరుగుతున్న సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ ప్రజా పంథ జాతీయ యూనిటీ మహాసభలకు దమ్మపేట మండలం నుంచి ప్రజాపంథా శ్రేణులు తరలి వెళ్ళారు. మండల పరిధిలోని జగ్గారం, పార్కలగండి, జమీందారు బంజర, లింగాలపల్లి, గండుగులపల్లి, మొండివర్రె, దమ్మపేట పంచాయతీల నుండి ఆదివారం వేలాది మంది బయలుదేరగా వాహన శ్రేణిని జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ ప్రజా పంథ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు అమర్లపూడి రాము మాట్లాడారు. నిజమైన ఒక కార్మిక వర్గ పార్టీని నిర్మించడానికి అన్ని కమ్యూనిస్టు శక్తులు ఐక్యమయ్యే దిశగా ముందుకు రావాలని అన్నారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగించుకోవాలి

- చీమలమర్రి మురళీకృష్ణ

నవతెలంగాణ-చర్ల



తెలంగాణ నూతన రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న ప్రతి పథకాన్ని ప్రతి ఒక్క సామాన్యుడు సద్వినియోగపరుచుకోవాలని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సీమలమర్రి మురళీకృష్ణ కోరారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెట్టిన 6 గ్యారంటీ పథకాలలో భాగంగా ప్రభుత్వం ఏర్పడిన కొద్ది రోజుల్లోనే నాలుగు పథకాలు అమలు చేసింది అని మిగిలిన రెండు గ్యారెంటీలో కూడా మరికొద్ది రోజుల్లో అమలు చేస్తారని స్పష్టం చేశారు. నెల 11న ఇందిరమ్మ ఇండ్ల పథకం ప్రారంభించాలని ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి నిర్ణయం తీసుకోవడం సంతోషకరం. ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం ఆరు గ్యారంటీల అమలులో భాగంగా ఈ పథకాన్ని ప్రతిష్టాత్మకంగా చేపట్టాలని, రాష్ట్రంలో ఇల్లు లేని నిరుపేద అర్హులందరికీ ఈ పథకం వర్తింపజేయాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించడం అందుకు అనుగుణంగా విధి విధానాలను తయారు చేయాలన్నారు. భద్రాచలం నియోజకవర్గం అభివృద్ధికి పది కోట్ల రూపాయలు మంజూరు చేసింది అని, కరకట్ట నిర్మాణం పనులు మొదలుపెట్టి భద్రాచలం వాసుల కష్టాలు తీరుస్తున్నది కేవలం కాంగ్రెస్ ప్రభుత్వమే అని ఆయన అన్నారు. బిఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్న సమయంలో భద్రాచలం అభివృద్ధికి ఒక పైసా కూడా నిధులు మంజూరు చేయలేదని ఎద్దేవా చేశారు ఏది ఏమైనా సామాన్యులకి బడుగు బలహీన వర్గాలకి ఆశాజ్యోతి కాంగ్రెస్ ప్రభుత్వమే అని మరోసారి గుర్తు చేశారు.

ఎలాంటి అవినీతి, అక్రమాలకు పాల్పడలేదు

- జిల్లా సైన్స్ అధికారి చలపతి రాజు

నవతెలంగాణ-పాల్వంచ



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఏర్పడిన నుంచి ఇప్పటివరకు నిర్వహించిన జిల్లా స్థాయి విద్యా విజ్ఞాన ప్రదర్శనలో ఇలాంటి అవకతవకలకు పాల్పడలేదని ప్రభుత్వ నిబంధన ప్రకారమే ప్రదర్శనలు నిర్వహించాలని తనంటే గిట్టని వారే తనపై తప్పుడు ప్రచారం చేస్తు న్నారని జిల్లా సైన్స్ అధికారి ఎస్. చలపతి రాజు తెలిపారు. గత రెండు రోజులుగా ,"నవ తెలంగాణ" దినపత్రికలో వస్తున్న శీర్షికలకు స్పందించిన ఆయన నవతెలంగాణతో చరవానిలో మాట్లాడుతూ తాను నిర్వహించే విద్యా విజ్ఞాన ప్రదర్శనలో ఎవరి నుంచి చందాలు వసూలు చేయలేదని, ప్రైవేట్ విద్యాసంస్థలు విద్యావేత్తలు, విజ్ఞాన అభిమానులు ఎవరి కూడా ఒక్క పైసా ఇవ్వలేదని ఆయన స్పష్టం చేశారు. ఒకటి రుజువు చేసిన నా ఉద్యోగానికి రాజీనామా చేస్తానని తెలిపారు.

నేడు ప్రజావాణి రద్దు

నవతెలంగాణ-పాల్వంచ



ధరణి పెండింగ్ దరఖాస్తుల పరిష్కారానికి ప్రత్యేక డ్రైవ్ చేపట్టుచున్నందున, రెవిన్యూ అధికారులు ఈ కార్యక్రమంలో నిమగ్నమవుటచే నేడు సోమవారం అనగా మార్చి 4న భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఐ డి ఓ సి కార్యాలయంలో చేపట్టనున్న ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దుచేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అలా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని కోరారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక

కట్ట మైసమ్మను దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే మెచ్చా

- స్వాగతం పలికిన జెడ్పీటీసీ వరలక్ష్మి కుటుంబం

నవతెలంగాణ-అశ్వారావుపేట

నియోజక వర్గం కేంద్రమైన అశ్వారావుపేట మండలంలోని నారాయణపురం కట్ట మైసమ్మ దేవాలయాన్ని మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు ఆదివారం సందర్శించారు. గత నాలుగు రోజులుగా జరుగుతున్న కట్ట మైసమ్మ తల్లి అమ్మవారి జాతర మహోత్సవం చివరి రోజున హాజరైన సందర్భంగా జెడ్పీటీసీ సభ్యురాలు చిన్నంశెట్టి వరలక్ష్మీ నరసింహం దంపతులు మెచ్చాను సాదరంగా ఆహ్వానించి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు మెచ్చాను శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి జుజ్జూరి వెంకన్న బాబు,నాయకులు మోహన్ రెడ్డి,జక్కుల రాంబాబు,చంద లక్ష్మి నర్సయ్య,చందా కుమార్ స్వామి,తాళ్ళాడ వెంకటేశ్వరరావు,లకావత్ తదితరులు పాల్గొన్నారు.

పినపాకలో దొంగల హల్చల్

నవతెలంగాణ-పినపాక

పినపాక మండల కేంద్రంలో దొంగలు హల్చల్ చేశారు. గమనించిన స్థానికులు ఒక దొంగని పట్టుకొని ఎస్సీ హాస్టల్‌లో కట్టేసి దేహశుద్ధి చేసి పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు దొంగని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్టు సమాచారం. ఒక వ్యక్తి దొరకగా ఇద్దరు వ్యక్తులు తప్పించుకున్నారని స్థానికులు తెలుపుతున్నారు. పోలీసులు దర్యాప్తులో పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

వైభవంగా నిర్విరామ నృత్య ప్రదర్శన

నవతెలంగాణ-భద్రాచలం రూరల్

భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామివారి సన్నిధి,అహోబిల మఠం ప్రాంగణంలో శ్రీ నృసింహ సేవ వాహిని చారిట బుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన 12 గంటల నిర్విరామ నృత్య నీరాజనం కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా పలు జిల్లాల నుండి వచ్చిన 108 మంది నృత్య కళాకారులు తమ ప్రదర్శనతో ఆకట్టుకున్నారు. తెలుగు బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ మరియు తెలంగాణ బుక్ ఆఫ్ రికార్డ్స్ కొరకు ఏర్పాటు చేసిన ఈ నృత్య నీరాజనం కార్యక్రమం ఆద్యంతం భక్తి పారవశ్యంతో సాగింది. ఉదయం 8 గంటల నుండి రాత్రి 8 గంటల వరకు 12 గంటల పాటు నిర్విరామంగా నృత్యాలతో అలరించారు నృత్య కళాకారులు,విద్యార్థులు.. భక్తులు మరియు పట్టణ ప్రజలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ యూనియన్ మెంబర్ టీవీ అశోక్ ఏఎన్ఎస్ 24 టీవీ ఎండి అనుమాండ్ల నాగరాజు ప్రముఖ రచయిత్రి వనపర్తి పద్మావతి సింగర్ పోకల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మంచి నీటి సమస్యను పరస్కరించిన యువజన నాయుకుడు

నవతెలంగాణ-అన్నపురెడ్డిపల్లి

సమస్య ఎదైన వుంది అని చెప్పిన వెంటనే అక్కడికి వెళ్లి పరస్కరించడంలో కాంగ్రెస్ మండల యువజన నాయుకులు వేమల నరేష్ ఎంతో ముందు ఉంటూ పేద ప్రజల మన్నలను పొందుతున్నాడు.మండల పరిధిలోని షాంతినగర్ గ్రామంలో గత కొన్ని రోజులు నుండి మంచి నీళ్ళు రాకపోవడంతో నీటి సమస్యను స్థానికులు నరేష్ దృష్టికి తీసుకురావడంతో వెంటనే అధికారులతో మాట్లాడి పైపు లైన్ మరమత్తులు చేయించి నీటి సమస్య తీర్చడంలో పలువురు నరేష్‌ని అభినందించారు.

ఎమ్మెల్యే పాయం చొరవతో కరెంటు స్తంభం తొలగింపు

నవతెలంగాణ-బూర్గంపాడు

బూర్గంపాడు మండల పరిధిలోని సోంపల్లి పంచాయతీ గంద్రగొడ్లపల్లిలో రూ.5లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. అయితే ఆ రోడ్డు నిర్మాణానికి కరెంటు స్తంభం అడ్డురా వడంతో దానిని తొలగించాలని గ్రామస్థులు సంబంధిత విద్యుత్ అధికారులను కోరారు. 15 రోజులు గడిచినా సమస్య పరిష్కారం కాకపోవడంతో గ్రామస్థులు ఆదివారం మోరంపల్లి బం జర్లో గృహజ్యోతి కార్యక్రమ ప్రారంభోత్సవానికి వచ్చిన ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు కలిసి సమస్య వివరించారు. వెంటనే స్పందించిన పాయం స్తంభం తొలగించాలని అక్కడే ఉన్న విద్యు త్ శాఖ అధికారులను ఆదేశించడంతో సాయంత్రం కు విద్యుత్ అధికారులు గ్రామంలో సీసీ రోడ్డుకు అడ్డుగా ఉన్న స్తంభాన్ని తొలగించారు. దీంతో సమస్య పరిష్కారం కావడంతో గ్రామస్థులు ఎమ్మె ల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వెంకటేష్, బోరెం సంపత్ కుమార్, విద్యుత్ లైన్మెన్ పాల్గొన్నారు.

సీఐ జితేందర్‌కు స్వాగతం పలికిన ఎస్ఐ శివరాం క్రిష్ణ

నవతెలంగాణ-అశ్వారావుపేట



పార్లమెంట్ ఎన్నికల నేపధ్యంలో జరుగుతున్న బదిలీల్లో భాగంగా కూసుమంచి సిఐగా పనిచేస్తున్న కే.జితేందర్‌ను అశ్వారావుపేటకు, ఇక్కడ విధుల్లో ఉన్న కరుణాకర్‌ను ఏడూళ్ళ బయ్యారంకు పోలీస్ ఉన్నతిని కారులు బదిలీ చేసారు. సిఐ కరుణాకర్ శనివారం రిలీవ్ అయి ఏడూళ్ళ బయ్యారంలో జాయిన్ కాగా జితేందర్ ఆదివారం అశ్వారావుపేట సిఐగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్చం ఇచ్చి ఎస్ఐ శివరాం క్రిష్ణ స్వాగతం పలికారు. అంతకు ముందే సిఐ జితేందర్ స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చం ఇచ్చి అభినందనలు తెలిపారు.



పిల్లల నిండైన జీవితానికి రెండు చుక్కలు..

- కొత్తగూడెం మున్సిపల్ చైర్ పర్సన్ కాపు సీతాలక్ష్మి

నవతెలంగాణ-కొత్తగూడెం

పిల్లల నిండైన జీవితానికి రెండు చుక్కలని, ఐదేండ్ల లోపు పిల్లలకు తప్పకుండా పోలియో చుక్కలు వేయించాలని, పోలియో రహిత సమాజాన్ని నిర్మిద్దామని కొత్తగూడెం మున్సిపల్ చైర్ పర్సన్ కాపు సీతాలక్ష్మి అన్నారు. ఆదివారం జాతీయ పోలియో దినోత్సవం సందర్భంగా ఆమె మున్సిపల్ పరిధిలో చిన్నపిల్లకు పోలియో చుక్కలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సీతాలక్ష్మీ మాట్లాడారు. ప్రతి ఒక్క తల్లిదండ్రులు పిల్లల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని తప్పని సరిగా పోలియో చుక్కలు వేపించాలని కోరారు.



విజయ నర్సింగ్ హోమ్ ఆధ్వర్యంలో మెగా వైద్య శిబిరం

నవతెలంగాణ-లక్ష్మీదేవిపల్లి

లక్ష్మీదేవి పల్లి మండలంలోని విజయ నర్సింగ్ హోమ్ హాస్పిటల్ డాక్టర్ శంకర్రావు, విజయలక్ష్మి ఆధ్వర్యంలో పెద్దతండ గ్రామపంచాయతీ కార్యాలయం ప్రాంగణంలో మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పదిహేను సంవత్సరాల అనుభవం కలిగిన శ్యాం కుమార్, డాక్టర్ ఎండి. ఫిజీషియన్ పాల్గొని రోగులకు వైద్యం అందించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. డాక్టర్ విజయలక్ష్మి మహిళలు ఎదుర్కొంటున్న ఆరోగ్య సమస్యల తెలుసుకొని వారికి వైద్య సహాయంతో పాటు మందులు పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) మండల కమిటీ సభ్యులు ధరావత్ వెంకన్న, మాజీ జెడ్పిటిసి బాధావత్ రామకోటి మాట్లాడుతూ మారుమూల గ్రామాలలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించి రోగులకు భరోసా ఇస్తున్నటువంటి విజయ నర్సింగ్ హోమ్ యాజమాన్యానికి డాక్టర్లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు . భవిష్యత్తులో ప్రజల ఆరోగ్యం పట్ల మరింత శ్రద్ధ వహించి మారుమూల గ్రామాల్లో వైద్య శిబిరాన్ని నిర్వహించి ప్రజలను ఆరోగ్యం పట్ల చైతన్య పరచాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో లౌడియా పూర్ణ ,గణేష్ ,హరికృష్ణ ,విజయ తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఐను సన్మానించిన విద్యాశాఖ

నవతెలంగాణ- దమ్మపేట



స్థానిక ఎస్ఐ సాయికిషోర్‌రెడ్డిని మండలంలోని విద్యాశాఖ సిబ్బందికి ఆదివారం ఘనంగా సత్కరించారు. ఎంఇఓ కీసరి లక్ష్మి, నోడల్ అధికారి పి.జగపతయ్య ఆధ్వర్యంలో మండలంలోని వివిధ ఉన్నత పాఠశాలల గెజిటెడ్ హెచ్‌ఎంలు, 10వ తరగతి పబ్లిక్ పరీక్షల డిపార్టమెంటల్ ఆఫీసర్లు, కస్టోడియల్ ఆఫీసర్లు ఎస్ఐను శాలువాతో సన్మానించారు. ఈనెల 18వ తారీకు నుండి జరగబోయే పదవ తరగతి పరీక్షల సెంటర్‌ల గురించి వివరించి పరీక్షలు ప్రశాంతంగా జరిగేలా సహకారం కోరారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ మండలంలో పబ్లిక్ పరీక్షలు ప్రశాంతంగా జరిగేలా తన వంతు సహాయ సహకారాలు అందజేస్తామని తెలిపారు. అనంతరం జిల్లా నుంచి వచ్చిన పదవ తరగతి పబ్లిక్ పరీక్షల ప్రశ్నాపత్రాలను రిసీవ్ చేసుకొని పోలీస్ స్టేషన్లో భద్రపరిచారు. ఈ కార్యక్రమంలో ట్రైబల్ వెల్ఫేర్ ప్రిన్సిపాల్ జాను నాయక్, ధర్మ సరళ, ఉషారాణి, విజయలక్ష్మి పార్థసారధి, మస్తాన్ అలీ, కోటేశ్వరరావు,పెంటయ్య ప్రసాదు శివాజీ తదితర పరీక్షల అధికారులు పాల్గొన్నారు.

ఢిల్లీ రైతాంగ పోరాటం మోడీ పాలనకు చరమగీతం

• సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు బీ.వెంకట్

నవతెలంగాణ-కొత్తగూడెం



ఢిల్లీ సరిహద్దుల్లో గత నెల 13 వ తేదీ నుండి హర్యానా, పంజాబ్ రైతాంగం చేస్తున్న పోరాటం కేంద్రంలోని మోడీ బిజేపీ ప్రభుత్వ పాలనకి చరమ గీతం రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో పాడ బోతున్నదని సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు బి.వెంకట్ అన్నారు. ఆదివారం కొత్తగూడెం జిల్లా కేంద్ర స్టడీ సర్కిల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. హర్యానా, పంజాబ్ రైతాంగ పోరాటాన్ని వివరిస్తూ 2022 లో 379 రోజుల పాటు ఢిల్లీ సరిహద్దుల్లో సంయుక్త కిసాన్ మోర్చా నాయకత్వంలో జరిగిన మూడు నల్ల వ్యవసాయ చట్టాలను రద్దు చేయాలని, స్వామి నాథన్ కమిషన్ సిఫారసులను అమలు చేయాలని తదితర డిమాండ్ల సాధన కోసం వీరోచిత పోరాటాన్ని సాగించారని తెలిపారు. స్వాతంత్ర్య పోరాటం తరవాత దేశంలో సుదీర్ఘ కాలంగా జరిగిన పోరాటం రైతాంగ పోరాటమే అన్నారు. ఉత్తర ప్రదేశ్ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ప్రధాన మంత్రి మోడీ నల్ల వ్యవసాయ చట్టాలను రద్దు చేస్తున్నామని, రైతాంగాన్ని క్షమించమని, రైతులపై పెట్టిన కేసులు ఎత్తివేస్తామని పార్లమెంట్ సాక్షిగా ప్రకటన చేసిన అనంతరం మాత్రమే రైతాంగం పోరాటాన్ని విరమించారన్నారు. కానీ ఆచరణలో మాత్రం మోడీ ఇచ్చిన ఏ ఒక్క హామీ అమలు కాలేదని, పైగా మూడు నల్ల వ్యవసాయ చట్టాలను దొడ్డి దారిన అమలు చేస్తున్నారని పేర్కొన్నారు. దీనితో తిరిగి రైతాంగం ఫిబ్రవరి 13 నుండి పోరాటాన్ని ప్రారంభం చేశారని అన్నారు. పోరాటంలో ఉన్న రైతాంగాన్ని పిలిచి ఇప్పటికీ ఐదు సార్లు చర్చలను మంత్రుల బృందం చేసినప్పటికీ తూతూ మంత్రంగా చర్చలు జరిపారని అన్నారు. రైతుల పంటలకు గిట్టుబాటు ధరలు సమస్య, స్వామి నాథన్ కమిషన్ సిఫారసులను అమలు, రైతులపై కేసులు ఎత్తివేయడం, లాఖింపూర్ ఘటనలో రైతుల చావుకి కారణమైన మంత్రిని క్యాబినెట్ నుండి తొలగించడం వంటి సమస్యలపై స్పష్టమైన సమాధానం చెప్పలేదని అన్నారు. పైగా పోరాటంలో ఉన్న రైతాంగంపై కాల్పులు జరిపి ఒక యువ రైతుని కాల్చి చంపారని అన్నారు. ఢిల్లీ సరిహద్దుల్లో దేశ సరిహద్దుల్లో సైనికులను పెట్టినట్లు పోలీస్ యంత్రాంగాన్ని పెట్టి రైతులపై తీవ్ర నిర్బంధాన్ని కొనసాగిస్తున్నారని అన్నారు. నిర్బంధాన్ని సైతం ఎదుర్కొని తీవ్ర ప్రతిఘటన రైతాంగం చేస్తున్నదన్నారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక, రైతాంగ వినాశకర విధానాలకు నిరసనగా ఫిబ్రవరి 16 న కార్మికవర్గం, రైతాంగం కలిసి జరిపిన సమ్మె సైతం ఢిల్లీ రైతాంగ పోరాటాన్ని విస్తృతంగా ప్రజల్లోకి తీసుకువెళ్ళిందని అన్నారు. రైతాంగానికి కార్మిక వర్గం తోడు కావడంతో నరేంద్ర మోడీ ప్రభుత్వం పతనం కాక తప్పదన్నారు. వ్యవసాయాన్ని కార్పొరేట్ల పరం చేయడానికి మోడీ తెచ్చిన మూడు నల్ల వ్యవసాయ చట్టాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకువెళ్ళి, వాటి దుష్ఫలితాలను వివరించాలని పిలుపు నిచ్చారు. స్టడీ సర్కిల్ ఇన్చార్జి ఏజే.రమేష్ అధ్యక్షతన జరిగిన స్టడీ సర్కిల్‌లో పార్టీ జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు లిక్కి బాలరాజు, జిల్లా కమిటీ సభ్యులు రేపాకుల శ్రీనివాస్, అన్నవరపు సత్యనారాయణ, కొండపల్లి శ్రీధర్, భూక్యా రమేష్, నాయకులు డి.వీరన్న, ఎస్.లక్ష్మి, ఊపేశ్ తదితరులు పాల్గొన్నారు.

తప్పుడు ధ్రువీకరణ పత్రాలతో జెన్కోలో ఉద్యోగాలు

- తీవ్రంగా నష్టం పోయిన స్థానిక అభ్యర్థులు
- విజిలెన్స్‌కు ఫిర్యాదు చేసిన వైనం
- 80 % కేటీపీలో 20% కేటీపీఎస్‌లో ఉద్యోగాలు

నవతెలంగాణ-పాల్వంచ



తెలంగాణ రాష్ట్ర జెన్కో సంస్థల్లో తప్పుడు చదువు ధ్రువీకరణ పత్రాలు సమర్పించి సుమారు 200 మంది థర్మల్ పవర్ ప్రాజెక్టుల్లో ఉద్యోగాలు చేస్తున్నట్లు ఆరోపణలు వెలువడుతున్నాయి. ఇటీవల కొంతమంది వరంగల్‌కు చెందిన స్థానిక అభ్యర్థులు తప్పుడు ధృవీకరణలతో ఉద్యోగాలు చేస్తూ స్థానికతకు తీరని అన్యాయం చేశారని విచారణ చేసి న్యాయం చేయాలని విజిలెన్స్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలుస్తోంది. దీంతో విజిలెన్స్ అధికారులు థర్మల్ పవర్ ప్రాజెక్టుల చీఫ్ ఇంజనీర్లకు నివేదికలు సమర్పించాలని ఆదేశించినట్లు సమాచారం. ఉమ్మడి ఖమ్మం జిల్లాకు చెందిన అనేకమంది ఉమ్మడి వరంగల్ జిల్లాలో విద్యాభ్యాసం చేసినట్లు తప్పుడు సర్టిఫికెట్లు పొంది ఉద్యోగాలు పొందినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం తప్పుడు ధృవీకరణ పత్రాలు పొందిన వారిలో 80% కేటిపిలో మిగిలిన 20 శాతం కేటీపీఎస్సీ విధులు నిర్వహించినట్లు సమాచారం. కాగా వీరంతా 2012-2013 సంవత్సరంలో జెన్కోలో జరిగిన నియామకాల్లో ఉద్యోగాలు పొందిన వారు కావడం గమనార్హం. 10 సంవత్సరాల తర్వాత తప్పుడు ధ్రువీకరణ పత్రాలు అంశం వెలుగులోకి రావడం, ప్రభుత్వం తప్పుడు ధ్రువీకరణ పత్రాలపై పూర్తిస్థాయి విచారణ చేసి స్థానికతకు నష్టపోయిన అభ్యర్థులకు న్యాయం చేయాలని వారు కోరుతున్నారు.



ప్రజల అవసరాలకు అనుగుణంగానే అభివృద్ధి

- కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

- 1.20 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు

- ప్రభుత్వ ఆసుపత్రిలో పోలియో చుక్కల ప్రారంభం

నవతెలంగాణ-పాల్వంచ

కొత్తగూడెం నియోజకవర్గంలోప్రజల ఆశలు అవసరాలకు అనుగుణంగానే అభివృద్ధి చేపట్టనున్నట్లు కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు చెప్పారు పాల్వంచలో ఆదివారం 1.20 కోట్ల రూపాయల సిసి డ్రైనేజీ లకు ఆయన శంకుస్థాపన చేశారు ప్రభుత్వ హాస్పిటల్ నందు పల్స్ పోలియో కార్యక్రమం ప్రారంభించారు. అయ్యప్ప నగర్ సీసీ రోడ్డు శ్రీనివాస్ కాలనీ యానిమల్ బర్త్ కంట్రోల్ సెంటర్ చేశారు బొల్లారంగూడెం మున్సిపల్ పార్క్ ప్రహరీకు శంకుస్థాపన అనంతరం కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ మున్సిపల్ కార్యాలయంలో చేశారు. అంబేద్కర్ భవన్‌కు శంకుస్థాపన చేశారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరు గ్యారంటీ పథకాలకు, అభివృద్ధి పనులకు సమ ప్రాధాన్యత ఇస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం.సమస్యలులేని సుందర పట్టణంగా పాల్వంచను తీర్చి దిద్దుతా తెలిపారు ఈ కార్యక్రమంలో డిసిఎంఎస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు జిల్లా డీఎంహెచ్వో శిరీష, డాక్టర్ ముఖండేశ్వరరావు, మున్సిపల్ కమిషనర్ స్వామి, డిఈ మురళి, ఏఈ రాజేష్, తాసిల్దార్ స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

జానయ్యకు నివాళులర్పించిన నవతెలంగాణ బృందం

నవతెలంగాణ-భద్రాచలం రూరల్



ఇటీవలే అనారోగ్యంతో మృతి చెందిన నవతెలంగాణ భద్రాచలం డివిజన్ సంతోష్ తండ్రి అయిన జానయ్య చిత్రపటానికి నవతెలంగాణ ఉమ్మడి ఖమ్మం జిల్లా బృందం ఆదివారం పూలమాలలు వేసి నివాళు లర్పించింది. ఈ సందర్భంగా ఖమ్మం రీజినల్ మేనేజర్ ఎస్‌డి. జావిద్ మాట్లాడుతూ... నవతెలంగాణ కుటుంబంలో ఎవరికి ఏ ఇబ్బంది కలిగిన సంస్థ అండగా ఉంటుందని స్పష్టం చేశారు. పారెల్లి జానయ్య జీవించిన కాలం మొత్తం పార్టీ సభ్యుడిగా కొనసాగారని, అటువంటి జానయ్య మృతి చెందటం ఆ కుటుంబంతో పాటు పార్టీకి కూడా తీరని లోటని అన్నారు. నివాళులర్పించిన వారిలో కొత్తగూడెం స్టాఫ్ రిపోర్టర్ దాసరి వెంకటేశ్వర్లు, టిడబ్ల్యూజేఎఫ్ జిల్లా అధ్యక్షులు పూదోట సూరిబాబు, గుమ్మడి నరసయ్య, నందిపాటి రమేష్, తోకల మోహన్ రావు, దామల్ల వెంకన్న, దొడ్డి నాగ వర్మ, కొడాలి వెంకటేశ్వర్లు, శ్రీరామ్ బృహస్పతి, మడిపల్లి వెంకటేశ్వర్లు, ఎస్‌వి. సాయి కిరణ్ గౌడ్, సతీష్ బాబు, జలాల్ అహ్మద్, తదితరులు పాల్గొన్నారు.

హైకోర్టు ప్రభుత్వ న్యాయవాదికి సన్మానం

నవతెలంగాణ-టేకులపల్లి



టేకులపల్లి మండల కేంద్రంలో ఇటీవల ప్రభుత్వ హైకోర్టు న్యాయవాదిగా నియ మింపబడిన భూక్య మంగీలాల్‌నాయక్ నుసేవాలాల్ సేన జిల్లా ప్రధాన కార్యదర్శి ధరావత్ సురేష్ నాయక్ ఆధ్వర్యంలో శాలువాతో ఘనంగా ఆదివారం సన్మానం చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడారు. మండలంలోని తావురా తండాలో జన్మించి, లంబాడి హక్కుల కోసం అనేక పోరాటాలు చేసిన వ్యక్తి అన్నారు. లంబాడి హక్కుల పోరాట సమితి ఎల్ హెచ్ పి ఎస్ సీనియర్ నాయకులు గిరిజన ముద్దుబిడ్డ, భూక్య మంగీలాల్ నాయక్ గిరిజన సమస్యలపై రాజీలేని పోరాటాలు చేశారని, కాంగ్రెస్ పార్టీలో చేరి మండల నాయకత్వం నుండి కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకత్వం ఎస్టీ సెల్ ఉపాధ్యక్షులుగా చేయడం జరిగిందని ,దాని తర్వాత టిపిసిసి రాష్ట్ర కార్యదర్శిగా గాను ఎదిగిన నాయకుడు భూక్య మంగీలాల్ నాయక్ అన్నారు .రాష్ట్ర ప్రభుత్వం గిరిజన బిడ్డ భూక్య మంగీలాల్ నాయక్ సేవలను గుర్తించి హైకోర్టు ప్రభుత్వ న్యాయవాదిగా నియమించడం హర్షించ దగ్గ విషయమని అన్నారు. ఈ కార్యక్రమంలో ద్రసు నాయక్, మోతిలాల్, భూక్య లక్ష్మణ్ నాయక్ ,హరికిషన్ నాయక్, రమణ, పాండు, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

పిల్లలకు పోలియో చుక్కలు తప్పక వేయించండి

• ఎమ్మెల్యే కోరం కనకయ్య

నవతెలంగాణ-టేకులపల్లి




టేకులపల్లి మండలంలోని ప్రజలు జీరో నుంచి ఐదు సంవత్సరాల పిల్లలకు తప్పకుండా పోలియో చుక్కలు వేయించాలని,నిండు జీవితానికి రెండు చుక్కలు అవసరమని ఇల్లందు నియోజకవర్గ శాసనసభ్యులు కోరం కనకయ్య తెలిపారు. ఆదివారం మండల కేంద్రంలోని బోడు ఎక్స్ రోడ్ సెంటర్లో పోలియో చుక్కల కేంద్రాన్ని ప్రారంభించారు. పుట్టిన చిన్నారి నుంచి ఐదేళ్ల లోపు చిన్నారులకు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సులానగర్ ప్రాథమిక వైద్యశాల వైద్యాధికారి. దినేష్, వైద్య సిబ్బంది, స్థానిక నాయకులు ఇస్లావత్ రెడ్డి,మూడు సంజయ్ నాయక్, గజ్జల రామ్ శేఖర్, టేకులపల్లి ఎస్సై ఎస్.కె సైదా రాహుఫ్, బండ్ల రజిని తదితరులు మాజీ ఉప సర్పంచ్ కె.సురేష్ కుమార్, నరేష్ తదితరులు పాల్గొన్నారు. టేకులపల్లి మండలంలోని బోడు ఆరోగ్య ఉప ఉప కేంద్రంలో పోలియో చుక్కల కార్యక్రమంలో ఎంపీపీ భూక్యరాధ పాల్గొన్నారు.

ఆ పాత మధురాలు....







• శ్రమలో అలసిన మనసుకు హాయ్ గొలిపే పాటలు

• మెలోడీ సాంగ్స్ పాటలు ఆలపించడంలో రికార్డు నెలకొల్పిన ఎంవీ. రమణమూర్తి

నవతెలంగాణ-మణుగూరు



కల కానిది విలువైనది బ్రతుకు కన్నీటి ధారలలోనే బలి చేయకు... ఇంత బరువైన మెలోడీ పాటను ఆలోకగా వినిపించే మెలోడీ గాయకుడు ఎంవీ. రమణమూర్తిపై నవతెలంగాణ కథనం.. ఆది నుంచి పాటలు శ్రమలో, ప్రేమలో, ఆనందంలో, హాయిని పంచడంలోనూ మానవ జీవితంతో మెలోడీ పాటలు పెనవేసుకున్నాయి. మనసు లోతులలో నుండి వెలువడే బాధను ఆనందాన్ని, ప్రేమను పంచడంలో మెలోడీ సాంగ్స్‌దే పై చేయి. బ్లాక్ అండ్ వైట్, ఈస్ట్ మన్ కలర్, నేటి ఆధునిక సినిమాల వరకు మెలోడీ సాంగ్స్ హాయిగా మనసుకు హత్తుకునేలా ఉంటున్నాయి. ఈ పాటలు పాడడంలో తెలుగు పాటల గాన గాంధర్వులు ఘంటసాల వెంకటేశ్వరరావు, బాలసుబ్రహ్మణ్యం గాయని గాయకులు ఎన్నో ఎన్నెన్నో మెలోడీ సాంగ్స్‌ని ఆలపించారు. ఇవి తరతరాలుగా తెలుగు ప్రజలలో గుర్తుండిపోయేలా ఆలపి ంచారు. ఇలాంటి మెలోడీ పాటలను ఆలవోకగా పాడగల అధికారి ఎంవీ. రమణమూర్తి. భద్రాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌లో సివిల్ 1ఎస్ఈ విధులు నిర్వహిస్తున్నారు. అనేక ప్రాంతాలలో జాతీ యస్థాయి వేదికలపై పాటలను ఆలపించారు. పలు వురు పెద్దల నుండి ప్రశంసలు, సన్మా నాలను పొందారు. ఇష్టమైన గాయకులు పాటలనే కాక ఆనాటి నుండి నేటి వరకు అనేక మెలోడీ సాంగ్స్ అనేక స్టేజీలపై గీతాలాపన చేసిన గాయకుడు ఎంవి .రమణమూర్తి. మెలోడీ సాంగ్స్‌తో పాటు భక్తి పాటలు కూడా అనేకం ఆలపించారు. లలిత సంగీతాన్ని మండ సర్వేశ్వరరావు నుంచి నేర్చుకున్నారు. విద్యుత్ శాఖలో ఏఈ పనిచేసే తరుణంలో మోహన ప్రియ ఆర్కెస్ట్రాలోఫోర్ మెన్ సూర్యారావుతో అనేక స్టేజీల మీద పాటలు పాడనన్నారు. వనపర్తి చక్రవర్తుల శ్రీనివాసచార్యులతో తిరుపతిలో వెంకటేశ్వరస్వామి భక్తి గీతాలు ఆలపించానన్నారు. హైదరాబాద్ వాస్తవ్యులు, ప్రముఖ గాయకులు వైయస్. రామకృష్ణ వారి ఆధ్వర్యంలో రవీంద్ర భారతి, త్యాగరాయ గాన సభలో మరియు ఇతర స్టేజీలలో అనేక పాటల ఆలపించారు. తన గురువు మండ సర్వేశ్వరరావు ద్వారా అంతర్జాతీయ స్థాయి పాటల పోటీలలో అవకాశం లభి ంచిందని తెలి పారు. ఒరిస్సా రాష్ట్రంలో కటక్‌లో ఇంటర్నేషనల్ స్థాయి పాటల పోటీలలో తెలుగు పాటలు పాడినందుకు అవకాశం లభించినందుకు సంతోషంగా ఉందన్నారు. అనేక స్టేజీలపై ఇప్పటిదాకా వందలాది పాటలు తన మెలోడీ పాటలతో మైమరిపించారు. అనేక మంది సినీ ప్రముఖులు, గాయకులు ప్రశంసలు, సన్మానాలు పొందారు. తెలంగాణ ప్రభుత్వం సాంస్కృతిక శాఖ ప్రోత్సాహంతో లలిత కల్చరల్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో ఉత్తమ గాయకుడుగా అవార్డు అందుకున్నారు. ఒకవైపు బాధ్యతాయుతమైన ప్రభుత్వ ఉద్యోగాన్ని నిర్వహిస్తూనే మరోవైపు పాటల ప్రేమికుడిగా అవకాశం దొరికితే ఎక్కడైనా ఎప్పుడైనా గానామృతాన్ని పంచేందుకు సిద్ధంగా ఉంటానని ఆయన తెలిపారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఖమ్మం-భద్రాద్రి కొత్తగూడెం
సోమవారం | మార్చి 04, 2024 | www.navatelangana.com

రెడ్డిపాలెం గ్రామంలో ముగిసిన జాతర

నవతెలంగాణ-బూర్గంపాడు

బూర్గంపాడు మండల పరిధిలోని నాగినేనిప్రోలు రెడ్డిపాలెం గ్రామంలో దేవరబాల కొండపర్తి సత్య నారాయణ స్వామి ఆధ్వర్యంలో గత రెండు రోజులుగా జరుగుతున్న సమ్మక్క, సారక్క, దుర్గ మ్మ జాతర ఆదివారంతో ముగిసింది. జాతరలో భాగంగా అగ్నిగుండం నిర్వహించగా అగ్ని గుండం తొక్కుతూ భక్తులు తమ మొక్కులు చెల్లించుకు న్నారు. ఆదివారం భక్తులకు అన్న దాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్ర మంలో కమిటీ నిర్వా హకులతో పాటు భక్తులు పెద్దసం ఖ్యలో పాల్గొన్నారు.



మొదటి రోజు పోలియో శిబిరం విజయవంతం

నవతెలంగాణ-అశ్వారావుపేట

పల్స్ పోలియో చుక్కలు నమోదు మొదటి రోజు విజయ వంతం అయింది. మండల వ్యాప్తంగా వినాయక పురం,గుమ్మడి వల్లి రెండు ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు పరిధిలో 5800 మంది అయిదు ఏండ్లు లోపు పిల్లలు ఉండగా మొదటి రోజు ఆదివారం 5495 మంది పోలియో చుక్కలు వేసారు. ఈ పోలియో చుక్కలు కార్యక్రమాన్ని ఎమ్మెల్యే జారే ఆదినారాయణ వినాయకపురం, జెడ్పీటీసీ చిన్నంశెట్టి వరలక్ష్మి గుమ్మడివల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో, ఎంపీపీ జల్లిపల్లి శ్రీరామమూర్తి బస్టాండ్‌లో ఏర్పాటు చేసిన శిబిరంలో లాంచనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ వైద్యులు రాందాస్, దీపక్ రెడ్డి, మధుళిక, సీడీ పీఓ రోజా రాణి, ఎస్ఒయు ఎ.వెంకటేశ్వరరావు,హెచ్.ఎస్ లు శ్రీనివాస్,దుర్గ ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

పిహెచ్‌సి	0 - 5 పిల్లలు	చుక్కలు వేసింది
వినాయక పురం	4306	4086
గుమ్మడి వల్లి	1494	1409
మొత్తం	5800	5495

భార్య పై దాడికి పాల్పడిన భర్త పై కేసు నమోదు

నవతెలంగాణ - అశ్వారావుపేట

భార్య పై భర్త తో పాటు కుటుంబ సభ్యులు దాడికి పాల్పడిన సంఘటన లో కేసు నమోదు అయింది. బాధితురాలు పొంది రమాదేవి రాతపూర్వక పిర్యాదు మేరకు ఎస్.ఐ శివరాం క్రిష్ణ తెలిపిన వివరాలు. మండల పరిధిలోని కోయ రంగాపురం పంచాయితీ ఖమ్మం పాడు కు చెందిన గొంది లక్ష్మడు - రమాదేవి కి ఇరవై ఏండ్ల క్రితం వివాహం అయింది.వీరికి ఇరువురు సంతానం ఉన్నారు. ఈ భార్యాభర్తలు గత కొంత కాలం మనస్పర్ధలు తో సతమతం అవుతున్నారు.ఈ క్రమంలో ఈ నెల ఒకటో తేది శుక్రవారం రమాదేవి పై భర్త లక్ష్మడు కుటుంబ సభ్యులు దాడికి పాల్పడిన భౌతికంగా హింసించారు.ఆమె పిర్యాదు మేరకు ఆదివారం భర్త ,మరో అయిదు గురి పై కేసు నమోదు చేసినట్లు ఎస్.ఐ శివరాం క్రిష్ణ తెలిపారు.

ఘనంగా ఆంజనేయ విగ్రహ ప్రతిష్ట

నవతెలంగాణ-చర్ల

చర్ల మండలంలోని మారుమూల గ్రామమైన నాయకుల కొత్తూరులో ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ట ధర్మజాగరణ సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం అత్యంత వైభవంగా జరిగింది. హిందూ ధర్మ పరిరక్షణ కోసం పాటుపడుతున్న ధర్మ జాగరణ సంస్థ నాయకుల కొత్తూరు గ్రామానికి హనుమాన్ విగ్రహాన్ని అందించారు. శనివారం ముత్యాలమ్మ, సారలమ్మ బొడ్రాయి గ్రామదేవతలను పూజించిన అనంతరం ఆలయం ముందు చలువ పందిరి వేశారు. ఇల్లందు నుండి తీసుకువచ్చిన హనుమాన్ విగ్రహాన్ని తాలిపేరు నదికి తీసుకువెళ్లి గంగ స్నానం చేయించి బెస్త కొత్తూరు నాయకులకు కొత్తూరు గ్రామాలలో భక్తుల జయ జయ ధ్వనుల మధ్య ఊరేగించారు. శనివారం రాత్రి విగ్రహ ప్రతిష్టాపనకు సంబంధించిన పూజలు మొదలుపెట్టిన అర్చకులు కృష్ణమూర్తి తొలుత విఘ్న నాయకుడైన వినాయకుడిని పూజించి, అష్టదిక్పాలకులను మండపంలో ఆవాహన చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆంజనేయ స్వామి విగ్రహానికి గ్రామంలోని ప్రతి ఇంటి నుండి సేకరించిన వడ్లు నిలువెత్తున పోసి ధాన్యావాసం, ఇరవై ఒక్క రకాల పండ్లతో ఫలావాసం, వివిధ రకాల పుష్పాలతో పుష్పాభిషేకం నిర్వహించారు. ఆంజనేయ స్వామికి అత్యంత ప్రీతిపాత్రమైన పండ్లు, కూరగాయలతో చేసిన ఫలావాసం భక్తులను ఎంతగానో ఆకట్టుకుంది. ఆదివారం తెల్లవారుజామున స్వామి విగ్రహానికి గ్రామంలోని భక్తులందరూ అభిషేకం చేసి ప్రత్యేక హెూమం జరిపి ధ్రువమూర్తి దర్శనానంతరం సీతారాములకు కళ్యాణం నిర్వహించారు. రెండు రోజులు నాయకుల కొత్తూరు గ్రామం జైశ్రీరామ్ జై వీరాంజనేయ నామ స్మరణతో మారుమోగింది. ఆదివారం మధ్యాహ్నం అన్నదానం నిర్వహించారు. విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమానికి గ్రామ పెద్దల మార్గదర్శకత్వంలో గ్రామంలోని యువత అన్ని పనులు తమ భుజస్కందాలపై వేసుకొని కార్యక్రమానికి ఏ లోటుపాట్లు రాకుండా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు జీడిగుంట బుల్లబ్బాయి, తన్నీరు వెంకటయ్య, పాలెం సత్యనారాయణ, బట్ట రాధాకృష్ణ, చింతల పెద్ద వెంకటేశ్వర్లు, పెద్దారపు హరిప్రసాద్, ధర్మేంద్ర, జీడిగుంట రాజారావు, జీడిగుంట సతీష్, తన్నీరు రమేష్, చింతల చిన్న వెంకటేశ్వర్లు, పుట్ట సత్యం, గడప కన్నయ్య, జీడిగుంట బాబురావు, గుంజి విజయ్, యూత్ కమిటీ సభ్యులు బట్ట బాలకృష్ణ, పూజారి సాయి లోకేష్, గంజి వంశీ, పసల సాగర్, పసల అనిల్, తన్నీరు ప్రసాద్, పాలెం అరవింద్, సంతోష్, బట్ట నాగేంద్ర, సింగ నాగరాజు, పుట్ట మహేష్ తదితరులు పాల్గొన్నారు.

రామవరంలో వైన్ షాప్ సీజ్

నవతెలంగాణ-కొత్తగూడెం

అధిక ధరలకు మద్యం విక్రయిస్తున్న వైన్ షాపును ఎక్సైజ్ ప్రొహిబిషన్ శాఖ అధికారులు సీజ్ చేసిన సంఘటన పట్టణంలో చోటు చేసుకుంది. కొత్తగూడెం మున్సిపల్ పరిధిలోని రామవరం ప్రాంతానికి చెందిన ఒక వైన్ షాపులో అధిక ధరలకు మద్యం విక్రయిస్తున్నట్లు టాస్క్ ఫోర్స్ అధికారులకు సమాచారం అందింది. ఈ నేపథ్యంలో వారు నేరుగా రంగాల్లోకి దిగారు. నిఘా పెట్టి అధిక ధరలకు మద్యం విక్రయిస్తుండడంతో రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు. విచారణ అనంతరం షాప్ సీజ్ చేసిన సమాచారం. ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఎవరైనా వైన్ షాపు దుకాణదారుడు అధిక ధరలకు వినియోగం దారులకు మద్యం విక్రయిస్తే ఫిర్యాదు చేయాలని, అట్టి వైన్ షాప్ వారిపై చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు.

లక్ష రూపాయలు రివార్డు గల మహిళా మావోయిస్టు నిర్బంధం

- వివరాలు వెల్లడించిన బీజాపూర్ జిల్లా ఎస్పీ

నవతెలంగాణ- చర్ల

లక్ష రూపాయలు రివార్డు గల మహిళా మావోయిస్టు కె ఎ ఎమ్ ఎస్ (కిసాన్ గిరిజన మజ్దూర్ సంగతన్) అధ్యక్షురాలును ఆదివారం అరెస్టు చేసినట్లు బీజాపూర్ ఎస్పీ జితేంద్ర యాదవ్ తెలిపారు.పామెడ్, కోబ్రా 204, పిఆర్పిఎఫ్ 151 పోలీస్ స్టేషన్ యొక్క ఉమ్మడి చర్య లో భాగంగా మహిళా మావోయిస్టు ను నిర్బంధించినట్లు ఎస్పీ తెలిపారు. జిల్లాలో మావోయిస్టు వ్యతిరేక ప్రచారంలో భాగంగా, శనివారం పామేడు పోలీస్ స్టేషన్ నుండి డిస్ట్రిక్ట్ ఫోర్స్, కోబ్రా 204 , సిఆర్పిఎఫ్ 151 సంయుక్త బృందం జర్పల్లి, య్యాపూర్ వైపు మావోయిస్టు వ్యతిరేక ప్రచారం కోసం వెళ్ళిందని ఆపరేషన్ సమయంలో, కమలాపూర్ కె ఎ ఎమ్ ప్రెసిడెంట్ రాంబాయి తండ్రి దివంగత లచ్చా కట్టం చిరునామా కమలాపూర్ పోలీస్ స్టేషన్ ఉసూర్ జిల్లా బీజాపూర్ జాయింట్ ఫోర్స్ పామెడ్ ఏరియా కమిటీ ఆధ్వర్యంలోని జర్పల్లి అడవి నుండి పట్టుకున్నారు. మహిళా మావోయిస్టు వద్ద నుంచి కుక్కర్ బాంబు, జిలెటిన్ రాడ్, కార్డెక్స్ వైర్, టీసీఓసీకి సంబంధించిన కరపత్రం స్వాధీనం చేసుకున్నారు. పేలుడు పదార్థాల చట్టం , ఛత్తీస్‌గఢ్ స్పెషల్ పబ్లిక్ సేఫ్టీ యాక్ట్ 2005 యొక్క సంబంధిత సెక్షన్ల కింద చట్టపరమైన విచారణల తర్వాత, పోలీస్ స్టేషన్ పమెడలో పట్టుబడిన మహిళా మావోయిస్టును జ్యుడీషియల్ రిమాండ్‌పై బీజాపూర్ జిల్లా కోర్టు ముందు హాజరుపరిచినట్లు ఎస్పీ వివరించారు.

కళారంగాన్ని ఆదరించే డిపీఆర్ఓ శీలం శ్రీనివాస్

- డిపీఆర్ఓ శీలం శ్రీనివాస్ సన్మాన సభలో గజల్ కవి రాజేష్

నవతెలంగాణ-కొత్తగూడెం



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సమాచార , పౌర సంబంధాల శాఖ అధికారి శీలం శ్రీనివాస్ బదిలీ అయిన సందర్భంగా జిల్లా సాంస్కృతిక సారధులు, కవులు కళాకారులు ఏర్పాటు చేసిన శీలం శ్రీనివాస్ ఆత్మీయ సన్మాన కార్యక్రమంలో గజల్ కవి రాజేష్ పాల్గొని గజల్లు వినిపించారు. ఆ సందర్భంగా రాజేష్ మాట్లాడుతూ డిపీఆర్వో శ్రీనివాస్ ఎంత ఎదిగినా ఒదిగి ఉండే వ్యక్తి, ఉత్తమ అధికారిగా జిల్లాకు ఎంతో సేవ చేశారని, కవులకు కళాకారులకు వెన్నుదన్నుగా వుంటు వారిని ప్రోత్సహించే వారని, ఎప్పుడూ అధికార దర్పాన్ని ప్రదర్శించేవారు కాదని, అందరితో ఆత్మీయంగా వుండే వారని తెలిపారు . అలాంటి వ్యక్తి బదిలీపై జిల్లాను వీడడం కొంత బాధగా వుందని అన్నారు. అనంతరం రాజేష్ పాడిన గజళ్ల సభికులను అలరించాయి. రాజేష్ తాను చిత్రించిన చిత్రాన్ని శ్రీనివాస్ కి బహూకరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, కవులు కళకారులు పాల్గొని ప్రసంగించారు.

1300 దరఖాస్తుల పరిష్కారం

ధరణి సమస్యల పరిష్కారానికి పటిష్ట కార్యాచరణ

ప్రత్యేక డ్రైవ్ కు ముందు 10,265 పెండింగ్

ఆదివారం ఒక్కరోజే 510 దరఖాస్తుల పరిష్కారం

800 దరఖాస్తుకు ఆమోదం.. పాస్ బుక్‌ల జారీ

అధికారులతో సమీక్షలో జిల్లా కలెక్టర్ వీపీ గౌతమ్

నవతెలంగాణ - ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

ధరణి పెండింగ్ దరఖాస్తుల పరిష్కారానికి చర్యలు వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ వి.పి. గౌతమ్ అన్నారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో అదనపు కలెక్టర్, కలెక్టరేట్, ధరణి పర్యవేక్షకులతో పెండింగ్ దరఖాస్తుల పరిష్కారంపై కలెక్టర్ ఆదివారం సమీక్ష నిర్వహించారు. జిల్లాలో ధరణి పెండింగ్ దరఖాస్తుల పరిష్కారంపై మార్చి 1 నుండి ప్రత్యేక డ్రైవ్ చేపట్టినట్లు తెలిపారు. జిల్లాలో ప్రత్యేక డ్రైవ్ కు ముందు 10,265 ధరణి దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నట్లు తెలిపారు. క్షేత్రస్థాయి, రికార్డ్స్ నమోదు పరిశీలనల అనంతరం ప్రత్యేక డ్రైవ్‌లో 1,300 దరఖాస్తులు పరిష్కరించినట్లు చెప్పారు. వీటిలో 800 దరఖాస్తులను ఆమోదించి, రైతులకు పాస్‌బుక్‌ల జారీకి సిఫారసు చేశామన్నారు. జిల్లా వ్యాప్తంగా ఆర్డీవో, కలెక్టరేట్ కార్యాలయాల్లో ఆదివారం కూడా ప్రత్యేక డ్రైవ్ చేపట్టినట్లు తెలిపారు. ఆదివారం సుమారు 510 దరఖాస్తులను పరిష్కరించామన్నారు. దరఖాస్తుల పరిష్కారానికి పటిష్ట కార్యాచరణ చేస్తున్నామని అన్నారు. దరఖాస్తుల ప్రకారం రికార్డులు క్షేత్ర స్థాయిలో పరిశీలన చేపడుతున్నట్లు తెలిపారు. మండలాల్లో అధికారులతో బందాలు ఏర్పాటు చేశామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ఆయా మండలాల పరిధిలో ధరణి మాడ్యూల్స్ ప్రకారం చర్యలు చేపట్టాలన్నారు. గ్రామాల వారీగా వ్యవసాయ విస్తరణ అధికారులు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు, ఆర్ఐలు, డీటీ లతో బందాలు ఏర్పాటుచేసి, మండల స్థాయిలో తహసీల్దార్లు, డివిజన్ స్థాయిలో ఆర్డీవోలు, జిల్లా స్థాయిలో కలెక్టర్, ఆపైన సీసీఎల్ఏ వరకు ప్రతి దరఖాస్తు నమోదు చేస్తున్నట్లు తెలిపారు. రికార్డుల ప్రకారం క్షేత్ర స్థాయిలో పరిశీలనకు గ్రామస్థాయిలో అర్జీదారుల భూముల వరకు బృందాలు వెళుతున్నట్లు చెప్పారు. క్షేత్ర స్థాయిలో వాస్తవ పరిస్థితులను నమోదు చేసుకుని, రికార్డులో ఉన్న వాటిని సరిపోల్చుకొని నిర్ణయం తీసుకోనున్నట్లు చెప్పారు. మండలాల నుండి వచ్చిన దరఖాస్తులు, జిల్లా స్థాయిలో కలెక్టరేట్‌లోని పర్యవేక్షకులచే పరిశీలన చేయించనున్నట్లు తెలిపారు. ఒక్కో పర్యవేక్షకునికి 5 మండలాల చొప్పున బాధ్యతలు అప్పగించామన్నారు. తహసీల్దార్ల నుండి ఆర్డీవో, అదనపు కలెక్టర్‌ల ద్వారా కలెక్టర్‌కు సమర్పించిన ఫైళ్లు, పర్యవేక్షకులు క్షుణ్ణంగా పరిశీలించి, ఆంగీకారం/తిరస్కరణ విషయమై తగు నివేదికతో కలెక్టర్‌కు సమర్పించి, కలెక్టర్ ఆమోదం తర్వాత ధరణిలో అప్లోడ్ చేస్తారని అన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ డి.మధుసూదన్ నాయక్, ఎస్డీసీ ఎం.రాజేశ్వరి, కలెక్టరేట్ ఏవో అరుణ, పర్యవేక్షకులు మదన్ గోపాల్, మీనన్, సత్యనారాయణ, రాంబాబు, ఓఎస్డీ నాగేశ్వరరావు, ధరణి కోఆర్డినేటర్ శ్రీనివాస్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అవినీతిని అరికట్టి

ఆరు గ్యారంటీల అమలు : ఎంఎల్ఏ

నవతెలంగాణ-కారేపల్లి

తెలంగాణవాదంను అడ్డం పెట్టుకొని గత ప్రభుత్వ అవినీతితో రాష్ట్రాన్ని అధోగతి పాలు చేసిందని, అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం అవినీతిని అరికట్టి ఆరు గ్యారంటీల అమలుకు నడుంబిగించదని వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్‌నాయక్ అన్నారు. కారేపల్లి మండలంలో వైరా ఎమ్మెల్యే ఆదివారం వివిధ అభివృద్ధి పనులను ప్రారంభించారు. కారేపల్లి మండల పరిధిలోని ఎర్రబోడు, మాణిక్యారం, చీమలపాడు. తవిసిబోడు, గేటురేలకాయలపల్లి, బస్వాపురం గ్రామాల్లో ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో చేపట్టనున్నా సీసీ రోడ్డు పనులను ఎమ్మెల్యే ప్రారంభించారు. గృహజ్యోతి పథకాన్ని ఆయన ప్రారంభించారు. ఈ పథకంతో మండలంలో 9 వేల మందికి లబ్ధిచేరుకుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మాలోత్ శకుంతల, జడ్పీటీసీ వాంకుడోత్ జగన్, సొసైటీ చైర్మన్ దుగ్గినేని శ్రీనివాసరావు, సంత ఆలయ చైర్మన్ అడ్డగోడ ఐలయయ్య, డైరక్టర్ బానోత్ హీరాలాల్, ఎంపీటీసీ ఆలోత్ ఈశ్వరినందరాజ్, బానోత్ రమేష్, మాజీ ఎంపీపీబానోత్ దేవ్లానాయక్, పీసీసీ మహిళ ఉపాధ్యక్షురాలు పగడాల మంజుల పాల్గొన్నారు.

16న జాతీయ లోక్ అదాలత్

నవతెలంగాణ-ఖమ్మం లీగల్

వివిధ కోర్టులలో పెండింగులో ఉన్న కేసులు మరియు ప్రీ లిటిగేషన్ కేసుల పరిష్కార నిమిత్తం ఈనెల 16న జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి మహమ్మద్ అబ్దుల్ జావేద్ పాషా తెలియజేశారు. జాతీయ లోక్ అదాలత్ రెండవ శనివారం నిర్వహించాల్సి ఉండగా వరుసగా వస్తున్న సెలవుల కారణంగా రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ మార్చి 16కు వాయిదా వేసినట్లు ఆయన తెలిపారు. జాతీయ లోక్ అదాలత్ విజయవంతం కోసం తగిన చర్యలు తీసుకోవడంతో పాటు లోక్‌అదాలత్ బెంచెలను జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆదేశాల మేరకు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇలా ఏర్పాటు చేసిన బెంచీలు ఈనెల 1వ తేదీ నుండి ప్రీ లోక్ అదాలత్ పరిష్కార ప్రక్రియను ప్రారంభించాయని అన్నారు. దీనిలో భాగంగానే ఈనెల 5న న్యూ ఇండియా అషుర్యెన్స్ కంపెనీ వారి మోటారు వాహన ప్రమాద నష్టపరిహార కేసులను పరిష్కరించ నున్నట్లు తెలిపారు. కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ప్రజాస్వామ్యబద్ధపాలన ప్రజల ఆకాంక్ష

ప్రజా పోరాటాలలో రాచర్ల పాత్ర చెరగనిది

చీమలపాడులో రాచర్ల మహాలక్ష్మి సంస్మరణ సభలో వక్తలు

నవతెలంగాణ-కారేపల్లి



ప్రజాస్వామ్య బద్ధ పాలనను ప్రజలు ఆకాంక్ష అని దానికి అనుగుణంగానే గత ఎన్నికల్లో బీఆర్ఎస్ మట్టి కరిపించి, కాంగ్రెస్‌కు పగ్గం కట్టారని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు పి.సోమయ్య అన్నారు. ఆదివారం కారేపల్లి మండలం చీమలపాడులో అమరజీవి రాచర్ల మహాలక్ష్మి సంస్మరణ సభ యనమగండ్ల రవి అధ్యక్షతన జరిగింది. ఈసభలో సోమయ్య మాట్లాడుతూ కేసీఆర్ ఇచ్చిన హామీ అమలు చేయకుండా తాత్సరం కూడా ఓటమికి కారణమైందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రావటానికి ఆరు గ్యారంటీల హామీలు ఇచ్చిందని వాటిని అర్హులందరికి అమలు చేస్తేనే ప్రభుత్వంపై భరోసా పెరుగుతుందన్నారు. పాలక, ప్రతిపక్ష నాయకులు భేషాజాలకు పోకుండా నిర్మాణాత్మక పాత్ర పోషించి ప్రజల మెప్పు పొందాలని సూచించారు. కారేపల్లి మండలంలో సీపీఎం నిర్వహించిన ప్రజాపోరాటాలలో రాచర్ల కుటుంబం పాత్ర చెరగనిదని మహాలక్ష్మి భర్త సాయుధపోరాట యోధుడు రాచర్ల జయరామయ్య చీమలపాడు ప్రాంతంలో అమరజీవి మాలోత్ నాను తో కలిసి అనేక పోరాటాలలో పాలుపంచుకోని పార్టీ అభివృద్ధికి పాటుపడ్డారన్నారు. రాచర్ల కుటుంబం పార్టీకి ఉద్యమకేంద్రమని వారి కుమారులు అమరజీవులు రాచర్ల శ్రీను,శేఖర్‌లు సైతం కడవరకు పార్టీ కోసం శ్రమించారని కొనియాడారు. మహాలక్ష్మి భర్త జయరామయ్య వెంట నడిచిన ఆదర్శమూర్తి అని కొనియాడారు అమరుల ఆశయాలకు అనుగుణంగా ప్రజాపోరాటాలు నిర్మించాలని సూచించారు. ఈకార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బండి రమేష్, జిల్లా కమిటీ సభ్యులు కొండబోయిన నాగేశ్వరరావు, మెరుగు సత్యనారాయణ, మెరుగు రమణ, మండల కార్యదర్శి కే.నరేంద్ర. నాయకులు వజ్జా రామారావు, సూరబాక ధనమ్మ, పల్లబోయిన కొండలరావు, మన్నెం బ్రహ్మయ్య సర్వయ్య కరపటి రాంబాయమ్మ, ఎరిపోతు భద్రయ్య, మాలోత్ శోభన్ మాలోత్ రామకోటి, వీరస్వామి, కిషన్, రణధీర్, మహాలక్ష్మి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు

యూటీఎఫ్ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం

నవతెలంగాణ - ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి



తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు ఆదివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని టీఎస్ యూటీఎఫ్ ఖమ్మం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సంఘం ఉపాధ్యక్షులు షేక్ యూసఫ్ సైదా అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రసూతి వైద్య నిపుణులు డాక్టర్ రెహనా బేగం, శ్రామిక మహిళ జిల్లా కన్వీనర్ పారుపల్లి ఝాన్సీ కుమారి అతిథులుగా పాల్గొని ప్రసంగించారు.అంతర్జాతీయ మహిళా దినోత్సవం అనేక పోరాటాలు, త్యాగాల ఫలితంగా సిద్ధించిందని, దానిని నిలబెట్టుకునేందుకు మహిళలు ఉద్యమాలలో విరివిగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. అంతర్జాతీయ కార్మిక స్ఫూర్తితో సాధించుకున్న 8 గంటల పని దినం, రాత్రి షిఫ్టులో మహిళలు పనిచేయరాదనే చట్టాలు కేంద్ర ప్రభుత్వ విధానాల ఫలితంగా నీరుగారుతున్నాయన్నారు. నేడు కేంద్రంలో అధికారంలో ఉన్న ప్రభుత్వం భారత రాజ్యాంగాన్ని కాదని మనుధర్మ శాస్త్రాన్ని అమలు చేయాలని చూస్తుందని, స్త్రీ, స్వాతంత్ర్య మర్హతి అన్న మనువు మాటలు వారికి శిరోధార్యం అని, అదే జరిగితే మహిళలకు స్వాతంత్ర్యం, హక్కులు, విద్యా మొదలైనవి నిరాకరించబడతాయని, ఇటువంటి మతోన్మాద శక్తులు అధికారంలో కొనసాగటం దేశ ఐక్యతకు, మహిళా హక్కులకు భంగకరమని వివరించారు. కాలుష్యాన్ని పెంచుతున్న, అనారోగ్యాలకు కారణమవుతున్న జంక్ ఫుడ్స్, కూల్ డ్రింక్స్, అల్యూమినియం పాత్రలు, ప్లాస్టిక్ వినియోగం మొదలైన వాటిని తగ్గించాలని, ఉపాధ్యాయులుగా పిల్లలకు ఈ విషయంలో అవగాహన కలిగించాలని డాక్టర్ రెహనా బేగం సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జీవి నాగమల్లేశ్వరరావు, పారుపల్లి నాగేశ్వరరావు, కార్యదర్శులు కంగల గీత, బుర్రి వెంకన్న, షేక్ రంజాన్, పి సురేష్, లక్ష్మీకుమారి, లక్ష్మీ నర్మదా, సౌభాగ్య లక్ష్మి సీనియర్ నాయకులు ఏ రమాదేవి పాల్గొన్నారు.

కాంగ్రెస్ హయాంలో ఉచిత విద్యుత్ సంతృప్తినిచ్చింది

- ఎమ్మెల్యే జారె ఆదినారాయణ

నవతెలంగాణ-ములకలపల్లి



గతంలో నిరుపేదలు కరెంటు బిల్లు కట్టాలంటే ఎన్నో అవస్థలు పడేవారని.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆరు గ్యారెంటీల్లో గృహజ్యోతితో 200 యూనిట్లలోపు ఉచిత విద్యుత్‌ను అందించడం సంతృప్తినిచ్చిందని ఎమ్మెల్యే జారె ఆదినారాయణ అన్నారు. ఆదివారం మండల పరిధిలోని జగన్నాధపురంలో గృహజ్యోతి కార్యక్రమంలో భాగంగా జీరో బిల్లు తీసి లబ్దిదారునికి అందించారు. ఈ సందర్బంగా జారె మాట్లాడుతూ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను తప్పకుండా అమలుచేస్తుందని, ఇచ్చిన మాట ప్రకారం ఆరు గ్యారెంటీల్లో ఇప్పటికే నాలుగు గ్యారెంటీలను అమలుచేసిన ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వమన్నారు. ఈ కార్యక్రమంలో విద్యుత్‌శాఖ అధికారులు, మండల కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

పాలకుర్తికి ఎమ్మెల్యే పరామర్శ....

మండల పరిధిలోని పొగళ్లపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకులు పాలకుర్తి రత్నభూషణం గత కొన్ని రోజులుగా జ్వరంతో బాధపడుతున్నారు. చికిత్స పొందుతూ ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే జారె ఆదినారాయణ ఆదివారం ఆయన ఇంటికి వెళ్లి రత్నభూషణాన్ని పరామర్శించారు. ఆయన వెంట కాంగ్రెస్ మండల నాయకులు, ఎంపీటీసీలు, మాజీ సర్పంచ్లు ఉన్నారు.

అంగవైకల్యాన్ని ఎదుర్కొనే ఏకైక ఆయుధం రెండు పోలియో చుక్కలే

- జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అలా

నవతెలంగాణ-పాల్వంచ



బిడ్డ అంగవైకల్యాన్ని ఎదుర్కొనే ఏకైక ఆయుధం మనీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అలా అన్నారు జిల్లా వైద్య శాఖ ఆధ్వర్యంలో పాల్వంచ మండలం శేఖరం బంజర పీహెచ్సీలో పల్స్ పోలియో కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా హాజరైన పోలియో చుక్కలు వేసి పోలియో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ రెండు పోలియో చుక్కలేనని , పోలియో రహిత సమ సమాజస్థాపనకు ప్రతి తల్లిదండ్రులు 0 నుండి 5 సం" వయసున్న చిన్నారులకు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని కలెక్టర్ తెలిపారు. పోలియో చుక్కలు వేసేందుకు జిల్లాలో 97,572 మంది చిన్నారులను గుర్తించినట్లు వివరించారు. 925 కేంద్రాలతో పాటు అదనంగా 38 మొబైల్ టీములు, 33 ట్రాన్సిట్ పాయింట్లు ద్వారా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది 427 మంది, అంగన్వాడీ సిబ్బంది 1933, ఆశా కార్యకర్తలు 1440, ఇతరులు 191 మొత్తం 3991 మంది ఈ కార్యక్రమంలో పాల్గొంటున్నట్లు వివరించారు. గోదావరి పరివాహక ప్రాంతాలైన ఇసుకదిబ్బలో పోలియో కార్యక్రమం నిర్వహణకు బోటు ఏర్పాటు చేశామని, అదేవిధంగా కొండవాయిలో వ్యాక్సిన్ వేసేందుకు మోటారు బైక్ టీము ద్వారా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. రానున్న మూడు రోజుల పాటు ఆశాలు, ఏఎన్ఎం లతో ఇంటింటి సర్వే నిర్వహించి ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు పరిశీలన చేపించి చుక్కలు వేయు విధంగా చర్యలు తీసుకుంటామని చెప్పారు. పోలియో చుక్కలు కార్యక్రమం నూరు శాతం పూర్తి చెయ్యాలని కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అల అధికారులను ఆదేశించారు .ఈ కార్యక్రమాల్లో వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ జేవీఎల్. శిరీష, డాక్టర్ బాలాజీ నాయక్ పిఓ సి.హెచ్.ఐ, డాక్టర్ కృష్ణ కుమారి ,నాగభూషణం సి.హెచ్.ఓ వైద్య సిబ్బంది ,పాల్వంచ డిప్యూటీ తహసిల్దార్, పట్టణ ఆరోగ్య కేంద్ర ఏఎన్ఎం లు తదితరులు పాల్గొన్నారు.

పోలియో చుక్కల కార్యక్రమం విజయవంతం



నవతెలంగాణ-పాల్వంచ

జిల్లాలో 96శాతం పోలియో చుక్కల కార్యక్రమం విజయవంతం అయిందని డిఎంహెచ్ఓ డాక్టర్ శిరీష తెలిపారు. మిగిలిన నాలుగు శాతం రెండురోజుల్లో పూర్తికి వైద్య సిబ్బంది ఇలాగే శ్రమించాలి సూచించారు. పోలియో చుక్కల కార్యక్రమనికి భద్రాద్రి జిల్లా ప్రజల నుంచి మంచి స్పందన లభించిందని ,మార్చ్3 మొదటి రోజు జిల్లా వ్యాప్తంగా నిర్దేశించిన 98,358 లక్ష్యానికి గాను 94,270 మంది పిల్లలకు పోలియో చుక్కలు వేయడం జరిగిందని ,నిర్దేశించిన లక్ష్య సాధనలో ఇంకా నాలుగు శాతం పోలియో చుక్కల కార్యక్రమ లక్ష్యాన్ని సోమవారం న ప్రతి ఆరోగ్య కార్యకర్త ఇంటింటికి వెళ్లి పూర్తి చేయాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ జేవీఎల్ శిరీష పేర్కొన్నారు.

లక్ష్మీదేవిపల్లి : రేగళ్ల పెద్ద తండా ఆశ్రమ పాఠశాలలో పోలియో చుక్కల కేంద్రంలో ఆదివారం ఎంపీపీ భూక్య సోనా పోలియో చుక్కలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సోనా మాట్లాడారు. ఈ కార్యక్రమంలో రేగళ్ల పిహెచ్సి వైద్యురాలు స్వప్న, ఏఎన్ఎం, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

జూలూరుపాడు : జూలూరుపాడు మండలంలో ఆదివారం పల్స్ పోలియో కార్యక్రమం విజయవంతమైంది. ఈ కార్యక్రమంలో డాక్టర్ రాకేష్, డాక్టర్ తేజస్వి, డాక్టర్ వెంకటేశ్వర్లు, సిహెచ్ఓ వెంకటేశ్వర్లు, హెల్త్ సూపర్‌వైజర్ రత్నకుమార్, రాధిక (హెల్త్ సూపర్‌వైజర్) , సుభద్ర (హెల్త్ సూపర్‌వైజర్) , కృష్ణ (హెల్త్ అసిస్టెంట్) , ఏఎన్ ఎం లు మరియు ఆశలు పాల్గొన్నారు.

చంద్రుగొండ : పోలియో చుక్కలు వేయించండి పోలియో రహిత సమాజాన్ని నిర్మిద్దామని మండల ప్రాథమిక వైద్యురాలు కనకం తనూజ అన్నారు. ఆదివారం చంద్రుగొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని బెండాలపాడు గొత్తి కోయ గ్రామములో0-5 సంవత్సరాల పిల్లలకు పోలియో చుక్కలు 41 మందికి వేశారు. ఇంటి ఇంటికి తిరిగిఅడిగి తెలుసుకొని అప్పుడే పుట్టిన బిడ్డ దగ్గరి నుండి 5 సంవత్సరాల లోపు వయస్సు గల పిల్లలకు పోలియో చుక్కలు వేశారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్ వైసర్ ఇమామ్,హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాస్,ఆశా రాజేశ్వరి పాల్గొన్నారు.



బూర్గంపాడు : పల్స్ పోలియో నిర్మూలన అందరి బాధ్యత అని, నిండు జీవితానికి రెండు పోలియో చుక్కలు అని బూర్గంపాడు జెడ్పిటిసి కామిరెడ్డి శ్రీలత అన్నారు. బూర్గంపాడు మండలం లక్ష్మీపురం గ్రామంలోని అంగన్‌వాడి కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన 0-5 సంవత్సరాల పిల్లలకు పల్స్ పోలియో చుక్కల కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించి పలువురు చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. పోలియో మహమ్మారిని అంతమం దించేందుకు ఆరోగ్యశాఖ ద్వారా ఈ మహత్తర మైన కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. పిల్లలు నిండు జీవితానికి రెండు పోలియో చుక్కలు ఎంతో కీలకమన్నారు. పోలియోను శాశ్వతంగా నిర్మూలించి ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మిస్తామన్నారు. పోలియో నిర్మూలనకు వైద్య ఆరోగ్యశాఖకు సహకారం అందిస్తూ ఈ మూడు రోజులపాటు ప్రచారం చేసి 0 నుండి 5 సంవత్సరాల పిల్లలందరికీ పోలియో చుక్కలు వేయించాలన్నారు. పోలియో చుక్కలు వేయడానికి మండల వ్యాప్తంగా ప్రత్యేక కేంద్రాలను ఆరోగ్యశాఖ ఏర్పా టు చేసిందని తెలిపారు. తల్లిదండ్రులు నిర్ల క్ష్యం వహించకుండా కేంద్రా ల వద్దకు వెళ్లి పిల్లల్ని తీసుకువెళ్లి పోలియో చుక్కలు వేయించాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ లక్ష్మీ సాహితి, సిడిపిఓ ప్రమీల, సిహెచ్ఓ సోమ్లా, డిపిఎం శ్రీనివాసరావు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

అన్నపురెడ్డిపల్లి : మండల పరిధిలోని అన్ని గ్రామాలలో వైద్య సిబ్బంది చిన్నారులకు పోలియో చుక్కలు ఉదయం 6 గంటల నుండి ప్రారంభించారు. డాక్టర్ ప్రియాంక ఆదివాసీ గ్రామాల్లో ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేసి ఆమె స్వయంగా చిన్నారులకు పోలియో చుక్కలు వేసారు. మండలంలో మొత్తం 3091 మంది 5 సంవత్సరాలు లోపు చిన్నారులు వున్నారు అని ఆదివారం మొదటి రోజు 3147 మంది పిల్లలకు పోలియో చుక్కలు వేసి 98.2 శాతం పూర్తి చేసామని తెలిపారు. మిగిలిన పిల్లలు ప్రతి ఇంటికి వెళ్ళి అందరకి పోలియో చుక్కలు వేసి 100 శాతం పూర్తి చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ఓ పూలమ్మ డిపియంఓ వెంకటేశ్వరావు, హెడ్ నర్స్ ఎస్తేర్ రాణి, హెచ్ఈఓ కృష్ణయ్య, హెచ్‌విబి శారారాణి వైద్య సిబ్బంది, అంగన్వాడి సిబ్బంది, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

టేకులపల్లి : టేకులపల్లి మండలంలో పల్స్ పోలియో చుక్కలు కార్యక్రమం విజయవంతంగా కొనసాగిందని సులానగర్ ప్రాథమిక వైద్య అధికారి దినేష్ ఆదివారం తెలిపారు. మండలంలో 4606 మంది ఐదు సంవత్సరాలలోపు పిల్లలు ఉండగా,మొదటి రోజు 4441 మంది పిల్లలకు పోలియో చుక్కలు వేయడం జరిగిందని, 96.4 % శాతం మంది పిల్లలకు పోలియో చుక్కలు అందించడం జరిగింది అని మండల వైద్యాధికారి డాక్టర్ కందుల దినేష్ తెలిపారు. రేపు , ఎల్లుండి ఇల్లు తిరిగి సర్వే చేసే కార్యక్రమంలో మిగతా పిల్లలందరికీ కూడా పోలియో చుక్కలు అందించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ వజ్జా పార్వతి ,ఆరోగ్య విస్తరణ అధికారి దేవా, సూపర్వైజర్లు పోరండ్ల శ్రీనివాస్, గుజ్జా విజయ, ఫార్మసిస్ట్ ధర్మపురి రవికుమార్, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.

మహిళా సాధికారతే లక్ష్యంగా సంక్షేమ పథకాలు

- ప్రతి గ్యారంటీ పథకాన్ని తప్పనిసరిగా అమలు చేస్తాం: హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్
- గృహజ్యోతి లబ్దిదారులకు జీరో బిల్లులు అందజేత



నవతెలంగాణ-సిటీబ్యూరో

నిరుపేదలకు సంక్షేమ పథకాలను అందజేయడమే లక్ష్యంగా మహిళల ఆర్థికాభివృద్ధికి సంపూర్ణ సహకారం అందించేందుకు గృహజ్యోతి కార్యక్రమాన్ని అమలు చేస్తున్నామని రవాణా, బీసీ సంక్షేమ శాఖ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ఆదివారం హైదరాబాద్ అమీర్‌పేట్‌లోని ధరమ్ కరమ్ రోడ్డు పక్కనున్న గృహాల్లో గృహజ్యోతి కార్యక్రమాన్ని ప్రారంభించారు. స్వయంగా మీటర్ రీడింగ్ తీసి జీరో బిల్లులను మహిళలకు మంత్రి అందించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఎన్నికలకు ముందు ఇచ్చిన గ్యారంటీల్లో భాగంగా తెలంగాణ ప్రజలకు ఇప్పటికే పది లక్షల ఆరోగ్యశ్రీ తోపాటు, మహిళలకు ఉచిత ప్రయాణం, రూ.500కే గ్యాస్, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్‌ని చేశామన్నారు. మిగతా పథకాలను త్వరలో అమలు చేస్తామని తెలిపారు. 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అమలుతో దాదాపు వెయ్యి రూపాయల విలువైన కరెంట్‌ను ప్రతి మీటర్‌పై లబ్దిదారునికి ఇవ్వనున్నట్టు చెప్పారు. అసెంబ్లీ ఎన్నికల ఫలితాలొచ్చిన 90 రోజుల్లోనే ఇచ్చిన హామీలు అమలు చేస్తున్నామని గుర్తుచేశారు.

ఈనెల 11న ఇందిరమ్మ ఇండ్లతో పాటు మిగతా వాగ్దానాల్ని పూర్తి చేస్తామని తెలిపారు. మహిళలకు ఉచిత ప్రయాణం, ఉచిత విద్యుత్, 500కే గ్యాస్ అందించడం ద్వారా మహిళా సాధికారత వస్తుందని.. తద్వారా మహిళల జీవితాల్లో అభివృద్ధి జరుగుతుందన్నారు. కార్యక్రమంలో హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, విద్యుత్ శాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

స్వీయ ఆత్మరక్షణ.. అరుదైన ఘనత

- రాష్ట్ర, జిల్లా న్యాయ సేవాధికార సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో.. 11 వేల మందికి ఒకే సారి శిక్షణ..
- లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో నమోదు



నవతెలంగాణ-కంఠేశ్వర్

తెలంగాణ రాష్ట్ర, నిజామాబాద్ జిల్లా న్యాయ సేవాధికార సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని గిరిరాజ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో విద్యార్థినీలకు నిర్వహించిన స్వీయ ఆత్మరక్షణ శిక్షణా కార్యక్రమం అరుదైన ఘనతను సొంతం చేసుకుంది. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలకు చెందిన విద్యార్థినులతో పాటు వివిధ శాఖల్లో విధులు నిర్వర్తిస్తున్న మహిళా ఉద్యోగినులు వేలాదిగా శిక్షణా కార్యక్రమంలో పాల్గొనడం రికార్డు సృష్టించింది. ఏక కాలంలో 11 వేల మంది వరకు శిక్షణలో పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించడం ద్వారా 'లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్స్'లో చోటు దక్కించుకున్నారు.

విజయవంతంగా కొనసాగిన ఈ కార్యక్రమాన్ని ప్రత్యక్షంగా వీక్షించిన లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్స్ ప్రతినిధులు, శిక్షణా తరగతులు ముగిసిన మీదట అవార్డును ప్రకటిస్తూ జిల్లా జడ్జి సునీతా కుంచాలకు మెడల్ బహూకరించారు. లిమ్కా బుక్ ఆఫ్ రికార్డు నమోదు కావడంతో సర్వత్రా హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి. జిల్లా యంత్రాంగం, జిల్లా పోలీస్ శాఖల తోడ్పాటుతో న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్వీయ ఆత్మరక్షణ శిక్షణ కార్యక్రమంలో నగరంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కేజీబీవీ, రెసిడెన్షియల్, గురుకుల పాఠశాలలకు చెందిన హైస్కూల్ బాలికలు, ఇంటర్మీడియట్, డిగ్రీ కళాశాలలకు చెందిన విద్యార్థినులతో పాటు న్యాయ, అటవీ, వైద్యారోగ్య, పోలీస్ తదితర శాఖల్లో విధులు నిర్వర్తిస్తున్న మహిళా ఉద్యోగినులు సైతం పాల్గొన్నారు.

మోడీ హామీలు కాకుండా నిధులు కేటాయించాలి

- అఖిల పక్షం ఆధ్వర్యంలో పట్టణంలో ర్యాలీ
- నల్ల జెండాలు పట్టుకొని నినాదాలు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

నలభై ఏండ్ల తర్వాత ఆదిలాబాద్‌కు అధికారికంగా ప్రధానమంత్రి వస్తున్నారని, జిల్లాలోని సమస్యలను పరిష్కరించేలా హామీలు కాకుండా నిధులు కేటాయించాలని ఆదిలాబాద్ అభివృద్ధి సాధన కమిటీ కన్వీనర్ బండి దత్తాత్రి అన్నారు. ఆదివారం అఖిల పక్షం ఆధ్వర్యంలో ఆదిలాబాద్ పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. స్థానిక ఆర్ అండ్ బీ అతిథి గృహం నుంచి ప్రారంభమైన బైక్ ర్యాలీ పట్టణంలోని పలు కూడళ్ల మీదుగా సాగింది. నల్ల జెండాలను పట్టుకొని ప్రధాని పర్యటనలో జిల్లాకు న్యాయం జరిగేలా చూడాలని నినాదాలు చేశారు.

ఈ సందర్భంగా బండి దత్తాత్రి మాట్లాడుతూ.. బీజేపీ అధికారంలోకి వచ్చిన పదేండ్లలో ఆదిలాబాద్‌ను ఎలాంటి అభివృద్ధి చేయలేదన్నారు. గత ఎన్నికల్లో సీసీఐ పునరుద్ధరణ, ఎయిర్‌పోర్టు, ఆదిలాబాద్ టూ ఆర్మూర్ రైల్వేలైన్ తదితర హామీలు ఇచ్చారని, కానీ ఇప్పటివరకు వాటి ఊసే తీయడం లేదన్నారు. ఈనెల 4న ఓట్లు అడగడానికి ఆదిలాబాద్‌కు వస్తున్న ప్రధాని నరేంద్ర మోడీ వీటిపై స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనాదిగా ఆదిలాబాద్‌లో అభివృద్ధి మరుగున పడిందన్నారు. గత ఎన్నికల హామీలను బీజేపీ నెరవేర్చకుండా ఎన్నికల సమయంలోనే ఆదిలాబాద్ పర్యటనలకు రావడం ప్రజానీకాన్ని తీవ్ర నిరాశకు గురి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో అఖిల పక్షం నాయకులు దర్శనాల మల్లేష్, ప్రభాకర్ రెడ్డి, సచిన్, గోవర్ధన్, రాములు, గంద్రత్ రమేష్, బాలూరి గోవర్ధన్ రెడ్డి, గుడిపెల్లి నగేష్, దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఇండియా కూటమి గెలుపు ఖాయం

- డాక్టర్ దిడ్డి సుధాకర్


నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాబోయే ఎన్నికల్లో ఇండియా కూటమి గెలుపు ఖాయమని ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్ తెలిపారు. ఆదివారం పార్టీ రాష్ట్ర కోర్ కమిటీ సమావేశాన్ని జూమ్ ద్వారా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈడీ, సీబీఐలను ఉపయోగించి, కేజ్రీవాల్ ను అరెస్టు చేస్తే ఇండియా కూటమి దెబ్బతింటుందని మోడీ కంటున్న కలలు కల్లలవుతాయని హెచ్చరించారు. పార్టీ జాతీయ నాయకత్వం అనుమతిస్తే చేవెళ్ల, మల్కాజ్‌గిరి పార్లమెంటు నియోజకవర్గాల నుంచి పోటీ చేసేందుకు ఆప్ రాష్ట్ర కమిటీ సిద్ధంగా ఉందని తెలిపారు.

భూ యాజమాన్యాన్నీ గుర్తించాలి

కుల గణనలో దీనినీ చేర్చాలి

- నిపుణులు, విశ్లేషకుల సూచన



న్యూఢిల్లీ : భారత్‌లో కుల గణన డిమాండ్ ప్రజాదరణ పొందుతున్నది. గతేడాది అక్టోబరులో బీహార్ జనాభా లెక్కలను ప్రచురించిన తర్వాత దాని డిమాండ్ మరింత పెరిగింది.ముఖ్యంగా, కేంద్రంలోని మోడీ సర్కారుపై దీని ఒత్తిడి పడింది. కుల గణన దేశవ్యాప్తంగా జరపాలనే డిమాండ్ దేశంలోని అనేక వర్గాల నుంచి వచ్చింది. అయితే, మోడీ సర్కారు కులగణనపై మౌనమే సమాధానంగా ఉంటున్నది.

బీహార్ కుల గణన తర్వాత కర్నాటకలోనూ అలాంటి డిమాండ్‌లే వచ్చాయి. ఏపీ కుల గణనను ప్రారంభించింది. కేరళ, తమిళనాడు, యూపీ, పశ్చిమ బెంగాల్‌లో ఇదే విధమైన కసరత్తు చేయాలనే పిలుపులు పెరుగుతున్నాయి.

భారత్‌లో 2024 సార్వత్రిక ఎన్నికలు త్వరలో జరగనున్నాయి. ఈ నేపథ్యంలో కుల గణన అంతగా అవసరం లేదనే వాదనలకు సమాధానంగా...పేదరికం, నిరుద్యోగం, వనరుల పంపిణీ సంబంధిత సమస్యలు తెరపైకి వచ్చినప్పుడు ఎన్నికల తర్వాత దాని ప్రాముఖ్యత స్పష్టంగా కనిపిస్తుందని విశ్లేషకులు చెప్తున్నారు.

ఇప్పటివరకు కుల గణన చర్చల్లో ఎక్కువగా కుల సంఘాల జనాభాను నిర్ధారించటం, జాతి పేర్లకు సంబంధించిన సమస్యలను పరిష్కరించడంపై దృష్టి ఉండేది. అదే సమయంలో, కులాల వారీగా భూ యాజమాన్యాన్ని కొలిచే కసరత్తుపై సమాన శ్రద్ధ వహించాల్సిన అవసరం ఉన్నదని విశ్లేషకులు అంటున్నారు. కుల గణనలు భారత్‌లో అధికారం 'భూమిలో' ఎలా చిక్కుకుపోయిందో కీలకమైన నమూనాలను వెల్లడిస్తుందనీ, మరీ ముఖ్యంగా, కుల గణనతో భూసంస్కరణలను మళ్లీ రాజకీయ ఎజెండాలకు చేర్చే అవకాశం ఉన్నదని చెప్తున్నారు.

భూ యాజమాన్యం ఎందుకు?

భారత్‌లో సామాజిక, రాజకీయ శక్తికి భూమి కీలకమైన మూలం. భూమి ఆహారం, జీవనోపాధికి మూలం. అలాగే, ఆస్తి, స్థిరత్వం వంటి అంశాలూ ఇందులో మిళితమై ఉంటాయి. నేషనల్ శాంపిల్ సర్వే ఆర్గనైజేషన్ నిర్వహించిన ఆలిండియా డెట్ అండ్ ఇన్వెస్ట్‌మెంట్ సర్వే నుంచి అందు బాటులో ఉన్న తాజా డేటా ప్రకారం.. భారతీయులకు భూమి అత్యంత ముఖ్యమైన ఆస్తిగా ఉన్నది. 2019లో గ్రామీణ భారత్‌లో మొత్తం ఆస్తి విలువలో 69 శాతం, పట్టణ భారత్‌లో 49 శాతంగా ఉన్నది. 2020-2021లో జరిగిన రైతు నిరసనల నుంచి భూమికి ఇచ్చిన విలువ స్పష్టంగా తెలుస్తున్నదనీ, భారతీయులు ఇప్పటికీ భూమితో ఎంత దృఢంగా అనుబంధం కలిగి ఉన్నారో వారు సూచిస్తున్నారని విశ్లేషకులు చెప్తున్నారు. అదే సమయంలో, భూమి యాజమాన్యం కులం ద్వారా చాలా వక్రీకరించబడిందని అంటున్నారు. ఉదాహరణకు, దేశంలోని 18 శాతం కుటుంబాలను కలిగి ఉన్న షెడ్యూల్డ్ కులాల సభ్యులు భారత్‌లో 8.5 శాతం భూమిని మాత్రమే కలిగి ఉన్నారని కొన్ని గణాంకాలు సూచిస్తున్నాయి. మరోవైపు, 22 శాతం ఉన్న అగ్రవర్ణ హిందూ కుటుంబాలు 28 శాతం భూమిని కలిగి ఉన్నాయి. అయినప్పటికీ, భూమి యాజమాన్యం గురించిన సమాచారం అస్పష్టంగా ఉన్నదని విశ్లేషకులు అంటున్నారు. సామాజిక-ఆర్థిక కులగణన 2011 కుల-విభజన డేటాను ప్రజలకు అందుబాటులో ఉంచలేదని విశ్లేషకులు చెపుతున్నారు. ఈ విషయంలో స్పష్టమైన సమాచారాన్ని ప్రభుత్వం సేకరించాలని వారు అంటున్నారు.

ఉద్యోగస్తులకు ఒకటో తేదీనే జీతాలు

గత ప్రభుత్వ హయాంలో జీతాల కోసం ఎదురు చూపులు : డిప్యూటీ ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క



నవతెలంగాణ-ఎర్రుపాలెం

బీఆర్ఎస్ పాలనలో ప్రభుత్వ ఉద్యోగులకు సరైన సమయానికి జీతాలు అందక పలు ఇబ్బందులు పడ్డారని, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన అనంతరం రాష్ట్రంలో ఉన్న ఆర్థిక పరిస్థితులను అధిగమించి ఒకటవ తేదీనే ప్రభుత్వ ఉద్యోగులకు జీతాలు అందిస్తున్నామని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. ఖమ్మం జిల్లా ఎర్రుపాలెం మండలం భీమవరం గ్రామంలోని పూర్ణ చంద్రారెడ్డి గృహంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో భట్టి మాట్లాడారు. మార్చి ఒకటో తేదీన 3,65,262 మంది రెగ్యులర్ ఉద్యోగులకు, 2 లక్షలా 85 వేల మంది పెన్షన్‌దారులకు వేతనాలను వారి ఖాతాల్లో జమ చేశామన్నారు. సంక్షేమ పథకాలు, ఆరు గ్యారంటీల హామీల అమలులో అలసత్వం లేకుండా ఉద్యోగులు పారదర్శకంగా, బాధ్యతాయుతంగా పని చేయాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో నిరుద్యోగ యువతీ యువకులకు ఉద్యోగ నియామకాల కోసం టీఎస్పీ ఎస్సీని ప్రక్షాళన చేశామన్నారు. ఖాళీగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగాలన్నీ భర్తీ చేస్తామని హామీ ఇచ్చిన మూడు నెలల్లోనే 25 వేల ఉద్యోగాలను భర్తీ చేస్తున్నామని తెలిపారు. గ్రూప్-1, డీఎస్సీ తదితర ఉద్యోగాల కోసం ఈ ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం నోటిఫికేషన్ విడుదల చేస్తామన్నారు. పోటీ పరీక్షలకు సిద్ధం కావడానికి పేద, మధ్య తరగతి నిరుద్యోగ యువతీ యువకులు హైదరాబాద్‌కు వచ్చి లక్షల రూపాయలు వెచ్చించే ఆర్థిక స్తోమత లేనందున వారికి వెసులు బాటు కల్పించడం కోసం రాష్ట్ర ప్రభుత్వం 119 నియోజకవర్గాల్లో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ నాలెడ్జి కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. వాటి భవన నిర్మాణాలకు నిధులు మంజూరు చేయడం జరిగిందని, మరి కొద్ది రోజుల్లోనే శంకుస్థాపన చేయనున్నట్టు చెప్పారు. రాష్ట్ర రాజధాని హైదరా బాద్ నగరం నడిబొడ్డున ఉన్న జ్యోతిరావుపూలే ప్రజాభవన్ నందు అద్భుతమైన స్టూడియో నిర్మించి నిష్ణాతులైన లెక్చరర్లతో ఆన్‌లైన్ ద్వారా కోచింగ్ సెంటర్ ఏర్పాటు చేస్తామన్నారు. కోచింగ్‌కు సంబంధించి టైం టేబుల్ ముందుగానే ప్రకటించి దానికి అనుగుణంగా తరగతులు నిర్వహిస్తామ న్నారు. సమావేశంలో డీసీసీబీ డైరెక్టర్ ఐలూరి వెంకటేశ్వర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు వేమిరెడ్డి సుధాకర్‌రెడ్డి, నాయకులు బండారు నరసింహారావు, శీలం శ్రీనివాసరెడ్డి, అనుమోలు వెంకటకృష్ణారావు, తలపురెడ్డి నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులను మంజూరు చేయాలి

సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ పునరుద్ధరించాలి : టీఎస్‌యూటీఎఫ్ డిమాండ్



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలోని ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లకు సంబంధించిన పెండింగ్ బిల్లులను వెంటనే మంజూరు చేయాలని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్‌యూటీఎఫ్) రాష్ట్ర కమిటీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఖజానా కార్యాలయాల్లో ఆమోదం పొంది ఆర్థిక శాఖ వద్ద రెండేండ్లుగా పెండింగ్‌లో ఉన్న మెడికల్ రీయింబర్స్‌మెంట్, జీపీఎఫ్, టీఎస్‌జీఎల్ఐ, పీఆర్సీ, డీఏ బకాయిలు, సప్లిమెంటరీ జీతాలు, పెన్షన్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని కోరింది. టీఎస్‌యూటీఎఫ్ ఆఫీస్ బేరర్ల సమావేశాన్ని ఆదివారం హైదరాబాద్‌లో ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కె జంగయ్య అధ్యక్షతన నిర్వహించారు. అనంతరం అధ్యక్షులు కె జంగయ్య, ప్రధాన కార్యదర్శి చావ రవి ఒక ప్రకటన విడుదల చేశారు. గత ఆర్థిక సంవత్సరానికి చెందిన బిల్లులు మంజూరు కాకపోవటం వల్ల ఈ ఆర్థిక సంవత్సరంలో గత ఏప్రిల్ తర్వాత రీవ్యాలిడేషన్ లేదా తిరిగి సమర్పించాల్సి వచ్చిందని తెలిపారు. ఈ నెలాఖరులోగా మంజూరు కాకపోతే మళ్లీ అదే పరిస్థితి పునరావృతం అయ్యే ప్రమాదముందని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మ్యానిఫెస్టోలో పేర్కొన్న విధంగా పెండింగ్ బిల్లులన్నీ మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని కోరారు. మూడు వాయిదాల డీఏ బకాయిలను విడుదల చేయాలని తెలిపారు. పదోన్నతులు, బదిలీలకు గల ఆటంకాల తొలగింపునకు చొరవ తీసుకోవాలని పేర్కొన్నారు. ప్రభుత్వ స్థలాలు, సొమ్ముతో ప్రయివేటు యాజమాన్యంలో పబ్లిక్ పాఠశాలల ఏర్పాటు సరైంది కాదనీ, ఇది విద్యా ప్రయివేటీకరణను ప్రోత్సహిస్తుందనీ, ఈ ఆలోచనను విరమించుకోవాలని డిమాండ్ చేశారు. మోడల్ స్కూల్, గురుకుల ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులను నూతన నియామకాలకు ముందుగానే పూర్తి చేయాలని కోరారు. ఆ ఉపాధ్యాయులపై బోధనేతర పనుల భారం తగ్గించాలని సూచించారు. కేజీబీవీ, యూఆర్ఎస్, సమగ్ర శిక్ష ఉద్యోగులకు బేసిక్ పే ఇవ్వాలని తెలిపారు. మెగా డీఎస్సీ ప్రకటన, విద్యాకమిషన్ ఏర్పాటు, 317 జీవో సమస్యలపై మంత్రివర్గ ఉపసంఘం నియామకాన్ని ఆహ్వానిస్తున్నామని పేర్కొన్నారు. ఈనెల తొమ్మిది, పది తేదీల్లో హైదరాబాద్‌లో టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కార్యాలయంలో రాష్ట్ర కమిటీ వార్షిక విస్తృత సమావేశాలను నిర్వహిస్తున్నామనీ, రాష్ట్ర విద్యారంగం అభివృద్ధిపై విస్తృతంగా చర్చించాలని తీర్మానించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు సిహెచ్ రాములు, సిహెచ్ దుర్గాభవాని, కోశాధికారి టి లక్ష్మారెడ్డి, కార్యదర్శులు కె సోమశేఖర్, ఎం రాజశేఖర్‌రెడ్డి, ఎ వెంకట్, ఈ గాలయ్య, డి సత్యానంద్, జి నాగమణి, బి రాజు, ఎస్ మల్లారెడ్డి, కె రవికుమార్, ఎస్ రవిప్రసాద్‌గౌడ్, ఎ సింహాచలం, వై జ్ఞానమంజరి, పి మాణిక్ రెడ్డి, మహబూబ్ అలీ తదితరులు పాల్గొన్నారు.

స్టార్ హోటళ్లలో కల్లు బార్లు

బీఆర్ఎస్ పాలనలో కృష్ణా నది పరివాహక ప్రాంతం ఎడారి :ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు

- కాంగ్రెస్ పాలనలో పేదల సంక్షేమానికి స్వర్ణయుగం
- ట్యాంక్ బండ్‌పై సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహానికి శంకుస్థాపన
- బీసీ సంక్షేమ శాఖ, రోడ్డు రవాణా శాఖ : మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్



నవతెలంగాణ -మహబూబ్‌నగర్

రాష్ట్రవ్యాప్తంగా గీత కార్మికులకు ఉపాధి కల్పించేందుకు సహజ సిద్ధమైన కల్లుకు మోడ్రన్ గుర్తింపు తెచ్చే విధంగా స్టార్ హోటల్స్‌లో బార్లు తెరుస్తామని, తమ పాలనలో పేదల సంక్షేమానికి స్వర్ణ యుగం ప్రారంభమైందని మంత్రులు పొన్నం ప్రభాకర్, జూపల్లి కృష్ణారావు అన్నారు. ఆదివారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని పీఎస్ఎస్ గార్డెన్‌లో గౌడ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు నాగరాజ్ గౌడ్ అధ్యక్షతన ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా గౌడ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ.. ఎంతో ధైర్యశాలయిన సర్వాయి పాపన్న గౌడ్.. నిజాం నవాబులపై తిరుగుబడి గోల్కొండ కోటపై జెండా ఎగరేసిన చరిత్ర ఉందని తెలిపారు. గత బీఆర్ఎస్ పాలనలో గౌడ వృత్తిదారుల అభివృద్ధి పూర్తిగా కుంటుపడిందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో మొదలుకొని పట్టణాల్లో వరకు కల్తీ లేని కల్లు దుకాణాలను మూసివేసి ఉపాధి లేకుండా చేశారని ఆరోపించారు. అందుకే వారికి ఉపాధి కల్పించేందుకు అవసరమైతే స్టార్ హోటల్స్‌లో కల్లు బార్లు తెరిచి నీరాకు మార్కెట్ సౌకర్యం కల్పిస్తామని హామీ ఇచ్చారు. కృష్ణా ట్రిబునల్ ప్రకారం కృష్ణానది 68 శాతం ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో ప్రవహిస్తున్నా టీఆర్ఎస్ పాలనలో ఈ ప్రాంత మంతా ఎడారిగా మారిందని ఆరోపించారు. మహబూబ్ నగర్ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న వంశీకృష్ణారెడ్డిని, స్థానిక సంస్థల ఎమ్మెల్సీని భారీ మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

మంత్రి మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ .. హైదరాబాద్‌లోని ట్యాంక్‌బండ్‌పై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహానికి శంకుస్థాపన చేయనున్నట్టు తెలిపారు. రాష్ట్రంలో గౌడ కులస్తుల సమస్యలు పరిష్కరించేందుకు ఒక్క అడుగు ముందే ఉంటానన్నారు. పదేండ్ల నియంతృత్వ ప్రగతి భవన్ పాలనకు విముక్తి పలికి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడంలో ఎంతో కృషిచేసిన బీసీ సామాజిక తరగతికి ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. బీసీ సంక్షేమ శాఖ మంత్రిగా తాను బాధ్యతలు చేపట్టిన తర్వాత లెక్కలు చూస్తే బీసీ సంక్షేమానికి రూ.1000 కోట్లు కేటాయించినట్టు ఉందని, కానీ ఖర్చులో మాత్రం రూ.1000 కూడా కనిపించలేదని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన 90 రోజుల్లోనే పథకాల అమలుకు పూను కున్నామని, కొన్నింటినీ ఇప్పటికే అమలుచేస్తున్నట్టు తెలిపారు. అలాగే, 11వ తేదీన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి సీఎం శంకుస్థాపన చేస్తున్నట్టు చెప్పారు. దేశాన్ని పాలిస్తున్న బీజేపీ ప్రభుత్వం ఏ చిన్న అవకాశం దొరికినా తెలంగాణను అల్లా కొల్లలం చేసేందుకు కుట్ర చేస్తోందని, వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు వారికి అవకాశం ఇవ్వకుండా బుద్ధి చెప్పాలని విజ్ఞప్తి చేశారు. మహబూబ్‌నగర్ కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ అభ్యర్థి వంశీ చందర్ రెడ్డి మాట్లాడుతూ.. నేను ఎమ్మెల్యేగా పని చేసినప్పుడే బీసీలు, వారి కష్టసుఖాలపై అసెంబ్లీలో ప్రస్తావించానని గుర్తుచేశారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో తనకు అవకాశం కల్పించాలని, ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ అన్ని వర్గాలను కలుపుకొని పని చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు శ్రీనివాస్ రెడ్డి, జై మధుసూదన్ రెడ్డి, వాటి శ్రీహరి, రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మెన్ ఓబేదుల్లా కొత్వాల్, రాష్ట్ర యువజన కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దేవసేన రెడ్డి, మహబూబ్‌నగర్ మున్సిపల్ చైర్మెన్ ఆనంద్ కుమార్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో పోలియో నిర్మూలనే లక్ష్యం

- వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ
- జోగిపేటలో పల్స్‌పోలియో కార్యక్రమాన్ని ప్రారంభించిన మంత్రి



నవతెలంగాణ-జోగిపేట

రాష్ట్రంలో పోలియో నిర్మూలనే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తున్నదని వైద్యారోగ్య శాఖ మంత్రి సీ.దామోదర్ రాజనర్సింహ అన్నారు. సంగారెడ్డి జిల్లా జోగిపేటలోని ప్రభుత్వాస్పత్రిలో పల్స్ పోలియో చుక్కల పంపిణీ కార్యక్రమాన్ని మంత్రి ఆదివారం ప్రారంభించారు. అనంతరం సదాశివపేట పరిధిలోని ఎంఆర్ఎఫ్ కంపెనీ జోగిపేట ప్రభుత్వాస్పత్రికి అందజేసిన అంబులెన్స్‌ను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆరు గ్యారంటీల్లో ఇప్పటివరకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, 10 లక్షల ఆరోగ్య బీమా, గృహ జ్యోతి, రూ.500 గ్యాస్ వంటి పథకాలు అమలోకి తెచ్చామన్నారు. ఈనెల 11న ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని ప్రారంభించనున్నట్టు తెలిపారు. అత్యవసర సమయాల్లో అంబులెన్స్ సేవలను వినియోగించుకోవాలని, రోగులకు అంబులెన్స్‌ను అందుబాటులో ఉంచాలని మంత్రి ఆదేశించారు. అంబులెన్స్‌ను అందజేసిన ఎంఆర్ఎఫ్ యజమాన్యాన్ని మంత్రి అభినందించారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ ఆర్ చంద్రశేఖర్, డీఎంహెచ్‌వో డాక్టర్ గాయత్రీదేవి, చైల్డ్ హెల్త్ డైరెక్టర్ డాక్టర్ సుధీర, డీసీహెచ్ఎస్ డాక్టర్ సంగారెడ్డి, ఆర్‌బీఎస్‌కే డాక్టర్ శ్రీనాథ్, చైల్డ్ హెల్త్ రాష్ట్ర అధికారి భానుకిరణ్, డబ్ల్యూహెచ్‌ఓ సందీప్ పాటిల్, డీఐఓ శశాంక్ దేశ్‌పాండే, యునిసెఫ్ కన్సల్టెంట్ రవినాయుడు, ప్రోగ్రామ్ అసిస్టెంట్ శ్రీధర్, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రమేశ్, ఆర్‌డీవో పాండు, మున్సిపల్ చైర్మెన్ మల్లయ్య, మున్సిపల్ కమిషనర్ తిరుపతి, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

కురాకుల శ్రీనివాస్‌కు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

సిద్ధిపేట జిల్లాకు చెందిన కురాకుల శ్రీనివాస్‌కు సర్వేపల్లి రాధాకృష్ణన్ జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు-2024 లభించింది. ఆదివారం హైదరాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో బహుజన సాహిత్య అకాడమి జాతీయ అధ్యక్షులు నల్లా రాధాకృష్ణ, ప్రధాన కార్యదర్శి యు సుబ్రమనియన్, రాష్ట్ర అధ్యక్షులు ఎంఎం గౌతమ్‌ల చేతులమీదుగా ఆయన ఈ అవార్డును అందుకున్నారు. వృత్తి నిబద్ధత, సమాజానికి ఆయన చేసిన సేవలు, ఉపాధ్యాయ వృత్తిలో చేసిన కృషికిగాను ఈ అవార్డును ప్రకటించామని రాధాకృష్ణ చెప్పారు. వృత్తి నిబద్ధత, అంకితభావానికి దక్కిన గొప్ప గుర్తింపు అని కురాకుల శ్రీనివాస్ అన్నారు. కురాకుల శ్రీనివాస్‌కు అవార్డు రావడం పట్ల టీఎస్‌సీపీఎస్ఈయూ రాష్ట్ర అధ్యక్షులు గంగాపురం స్థితప్రజ్ఞ, ప్రధాన కార్యదర్శి కల్వల్ శ్రీకాంత్, కోశాధికారి నరేష్‌గౌడ్, ఉపాధ్యక్షులు మ్యాన పవన్‌కుమార్, వెంకటేశ్ శుభాకంక్షలు తెలిపారు.

మహాత్మా జ్యోతిబా పూలే గురుకుల ప్రవేశ పరీక్షకు 89.39 శాతం హాజరు

- మల్లయ్య బట్టు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్రవ్యాప్తంగా ఆదివారం నిర్వహించిన గురుకుల పాఠశాల బ్యాక్‌లాగ్ సీట్ల భర్తీ కోసం నిర్వహించిన ప్రవేశ పరీక్షకు77,449 మంది దరఖాస్తు చేసుకోగా వారిలో 69,230 మంది విద్యార్థులు హాజరయ్యారని మహాత్మ జ్యోతిబాపూలే గురుకుల విద్యాసంస్థల కార్యదర్శి డాక్టర్ మల్లయ్య బట్టు ఒక ప్రకటనలో తెలిపారు. ఆరో తరగతి ప్రవేశ పరీక్షకు 36,335 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా వారిలో 32,590 మంది విద్యార్థులు, ఏడో తరగతి ప్రవేశ పరీక్షకు 21,764మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా వారిలో 19,327మంది విద్యార్థులు , ఎనిమిదో తరగతి ప్రవేశ పరీక్షకు 19,350 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా వారిలో 17,313 మంది విద్యార్థులు హాజరయ్యారని పేర్కొన్నారు.

మెగా డీఎస్సీ వేయడం పట్ల సీఎంకు తపస్ అభినందనలు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

మెగా డీఎస్సీ నోటిఫికేషన్‌ను విడుదల చేయడం పట్ల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఆదివారం హైదరాబాద్‌లో తపస్ అధ్యక్షులు హన్మంతరావు, ప్రధాన కార్యదర్శి నవాత్ సురేష్ నేతృత్వంలో కలిసి అభినందనలు తెలిపారు. విద్యారంగ, ఉపాధ్యాయ సమస్యలను వెంటనే పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. బదిలీలు, పదోన్నతులు చేపట్టాలనీ, స్కావెంజర్లను నియమించాలని తెలిపారు. 317 జీవో మంత్రివర్గ ఉపసంఘం త్వరగా చర్యలు చేపట్టాలనీ, మూడు డీఏలను, పీఆర్సీ కమిటీని సమయానికి పూర్తి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏబీఆర్ఎస్ఎం ప్రతినిధి సూరం విష్ణువర్ధన్‌రెడ్డి, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు నరేందర్‌రావు, ఉపాధ్యక్షులు బి రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



అలెగ్జాండ్రా మిఖైలోవ్నా కొల్లంతాయ్...
కమ్యూనిస్టు విప్లవకారిణి. బోల్షివిక్ పార్టీలో కీలక పాత్ర పోషించిన నాయకి. ఆధునిక రాజ్యాలు ఏర్పడిన తర్వాత ప్రభుత్వాలలో భాగస్వామి అయిన ప్రపంచంలోనే మొట్టమొదటి మహిళ. ఆనాటి లెనిన్ ప్రభుత్వంలో సంక్షేమం కోసం పీపుల్స్ కమీషనర్‌గా పనిచేసిన వ్యక్తి. అలాగే కేబినెట్ మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన మొదటి మహిళ అంతేనా మొదటి మహిళా దౌత్యవేత్త. ఈ పురుషాధిక్య సమాజంలో వందేండ్ల కిందటే స్వేచ్ఛా ప్రేమను సమర్థించిన సాహసి. 'లైంగికత అనేది ఆకలి లేదా దాహం వంటి సహజమైన మానవ స్వభావం' నొక్కి చెప్పిన వనిత. మహిళా విముక్తి కోసం అలుపెరుగక పోరాడిన ధీర. ఈ రోజు మనం అంతర్జాతీయ మహిళా దినోత్సవం జరుపుకుంటున్నామంటే ఇలాంటి మహిళా మూర్తులు చేసిన పోరాటాలు, త్యాగాల ఫలితమే.



మహిళా విముక్తికి ఛాంపియన్

కొల్లంతాయ్ ఇంపీరియల్ రష్యన్ ఆర్మీ జనరల్ కూతురు. ఆమె 1890లలో కమ్యూనిస్టు రాజకీయాలను స్వీకరించారు. 1899లో రష్యన్ సోషల్ డెమోక్రటిక్ లేబర్ పార్టీలో చేరారు. ఈ పార్టీలో చీలికలు వచ్చినపుడు మెన్షివిక్‌లకు దగ్గరయ్యారు. 1908లో రష్యా నుండి బహిష్కరించబడిన ఆమె పశ్చిమ ఐరోపా, యునైటెడ్ స్టేట్స్‌లో పర్యటించి మొదటి ప్రపంచ యుద్ధానికి వ్యతిరేకంగా ప్రచారం చేశారు. 1915లో ఆమె మెన్షివిక్‌లతో తెగతెంపులు చేసుకొని బోల్షివిక్‌లలో సభ్యురాలిగా చేరారు. 1917 ఫిబ్రవరి విప్లవం తర్వాత ఆమె రష్యాకు తిరిగి వచ్చారు. ఆనాడు ఆమె కార్మికుల పక్షాన పోరాడుతున్న లెనిన్ ప్రతిపాదనలకు మద్దతుగా నిలిచారు. మొదటి సోవియట్ ప్రభుత్వంలో సాంఘిక సంక్షేమానికి పీపుల్స్ కమీషనర్‌గా నియమితులయ్యారు. 1919లో సోవియట్ యూనియన్‌లో మహిళల స్థితిని మెరుగు పరచడానికి ఉద్దేశించిన సెంట్రల్ కమిటీ ఓ కొత్త మహిళా విభాగం జెనోటోడెల్ ఏర్పాటు చేశారు. దీన్ని నిర్మించడంలో కొల్లంతాయ్ ముఖ్య పాత్ర పోషించారు. మహిళా విముక్తికై పోరాడుతున్న కమ్యూనిస్ట్ పార్టీపై నిప్పులు చెరిగే వారికి ఆమె ధైర్యంగా సమాధానం చెప్పేవారు. 1922 నుండి ఆమె నార్వే, మెక్సికో, స్వీడన్‌లలో దౌత్యవేత్తగా బాధ్యతలు నిర్వహించారు. 1943లో స్వీడన్‌కు రాయబారిగా పదోన్నతి పొందింది. 1945లో ఆ బాధ్యతల నుండి రిటైర్ అయ్యారు.

కుటుంబ నేపథ్యం

కొల్లంతాయ్ తండ్రి, జనరల్ మిఖాయిల్ అలెక్సీవిచ్ డోమోంటోవిచ్. ప్స్కోవ్‌కు చెందిన డొమంటాస్ వంశానికి చెందిన ఉక్రేనియన్ కుటుంబం వీరిది. తల్లి, అలెగ్జాండ్రా అలెగ్జాండ్రోవ్నా మసాలినా. ఈమె తన మొదటి భర్తతో జీవితాన్ని గడపలేక అతనికి విడాకులిచ్చి డోమోంటోవిచ్‌ను వివాహం చేసుకుంది. ఈ కారణంలో ఎన్నో అవమానాలు ఎదుర్కోవలసి వచ్చింది. అధికారికంగా పెండ్లి చేసుకున్నప్పటికీ తన తల్లిదండ్రులు కలిసి జీవించేందుకు సుదీర్ఘ పోరాటం చేయవలసి వచ్చింది. ఈ ప్రభావం కొల్లంతాయ్‌పై తీవ్రంగా ఉండేది. కాబట్టే స్త్రీ, పురుష సంబంధాలు, లైంగికత, వివాహం గురించి ఆమె చాలా స్పష్టంగా ఉండేది. వాటినే బాహాటంగా చర్చించేది.

ఉన్నత విద్య కోసం...

కొల్లంతాయ్ మార్చి 1872, మార్చి 31న సెయింట్ పీటర్స్‌బర్గ్‌లో జన్మించారు. ఆమె తండ్రికి ఎంతో సన్నిహితంగా ఉండేది. చరిత్ర, రాజకీయ విషయాల గురించి ఆయనతో ఆసక్తిగా పంచుకునేది.



పాఠశాలలో మంచి విద్యార్థిగా పేరు తెచ్చుకుంది. తండ్రి ద్వారా అనేక భాషల్లో ప్రావీణ్యం సంపాదించింది. పాఠశాల తర్వాత విశ్వవిద్యాలయంలో తన చదువు కొనసాగించాలనుకుంది. కానీ తల్లి అంగీకరించలేదు. అమ్మాయిలకు ఉన్నత విద్య అవసరం లేదని ఆమె భావన. కాబట్టి వెంటనే పెండ్లి చేసుకోవాలంది. దాంతో ఆమె తన 19 ఏండ్ల వయసులో తన బంధువు, కాబోయే భర్త అయిన వ్లాదిమిర్ లుడ్విగోవిచ్ కొల్లంతాయ్‌ను కలుసుకుంది. మిలిటరీ ఇన్‌స్టిట్యూట్‌లో చేరిన ఇంజనీరింగ్ విద్యార్థి అతను. అతను పేదవాడు కావడంతో తల్లి వారి వివాహానికి అభ్యంతరం చెప్పింది. ఎలాగైనా ఆమె వ్లాదిమిర్‌ను మరచిపోవాలని కూతురిని పశ్చిమ ఐరోపా పర్యటనకు పంపారు. కానీ అనుకున్నట్టు జరగదు. 1893లో ఇద్దరూ వివాహం చేసుకున్నారు. 1894లో ఆమెకు కొడుకు పుట్టాడు. ఆ విశ్రాంతి సమయాన్ని మార్క్సిస్ట్ రాజకీయ సాహిత్యం చదవడానికి, రాయడానికి తన సమయాన్ని వెచ్చించింది.

రాజకీయ జీవితం

కొల్లంతాయ్ మొదట్లో మీర్ కమ్యూన్ ఆధారంగా సమాజాన్ని పునర్నిర్మించాలనే ఆలోచనలకు ఆకర్షితురాలయింది. అయితే కొన్ని కారణాల రీత్యా దాన్ని విడిచిపెట్టింది. ఆ తర్వాత మార్క్సిజం, ఫ్యాక్టరీ కార్మికుల సమస్యలు, కార్మికులు పోరాటం చేసి అధికారాన్ని చేజిక్కించుకోవడం, పరిశ్రమల్లో పెరిగిపోతున్న దోపిడీని నొక్కిచెప్పేవారు. దాంతో రష్యాలోని మేధావి వర్గంలో కొల్లంతాయ్‌కు మంచి గుర్తింపు వచ్చింది.

ఆనాడు ప్రజల్లో ఉన్న పిరికితనాన్ని పోగొట్టడం. దానికోసం పట్టణ కార్మికులకు ప్రాథమిక అక్షరాస్యత అందించేందుకు తన చెల్లెలు జెనియాతో కలిసి ప్రతి ఆదివారం తరగతులు నిర్వహించేది. అక్షరాలు నేర్పిస్తూనే సోషలిస్ట్ ఆలోచనలు ఎక్కించేది. కొన్ని వ్యక్తిగత కారణాల వల్ల ఆమె ప్రేమించి పెండ్లి చేసుకున్న భర్త నుండి విడిపోయింది. చిన్నవాడైన కొడుకుని తల్లిదండ్రుల వద్ద విడిచి స్విట్జర్లాండ్‌లోని జ్యూరిచ్‌లో ప్రొఫెసర్ హెన్రిచ్ హెర్క్‌నర్‌తో కలిసి ఆర్థిక శాస్త్రాన్ని అభ్యసించింది. తర్వాత ఇంగ్లాండ్‌కు వెళ్ళింది. అక్కడ సిడ్నీ, బీట్రైస్ వెబ్‌లతో సహా బ్రిటిష్ సోషలిస్ట్ ఉద్యమ సభ్యులను కలుసుకుంది. 1899లో రష్యాకు తిరిగి వచ్చి లెనిన్‌ని కలిసింది.

మార్క్సిస్ట్ ఆలోచనలపై ఆసక్తి

హెర్క్‌నర్ ఆధ్వర్యంలో జ్యూరిచ్‌లో పని చేసే ఉద్యమాల చరిత్రను అధ్యయనం చేస్తున్నప్పుడు కొల్లంతాయ్ మార్క్సిస్ట్ ఆలోచనలపై ఆసక్తి పెంచుకుంది. తన 27 ఏండ్ల వయసులో 1899లో రష్యన్ సోషల్ డెమోక్రాటిక్ లేబర్ పార్టీలో సభ్యురాలయింది. 1903లో జూలియస్ మార్టోవ్ ఆధ్వర్యంలోని మెన్షివిక్‌లు, లెనిన్ నేతృత్వంలోని బోల్షివిక్‌ల మధ్య రష్యన్ సోషల్ డెమోక్రటిక్ లేబర్ పార్టీలో చీలిక ఏర్పడిన సమయంలో ఆమె మొదట ఏ పక్షం వైపు మొగ్గు చూపలేదు. రెండు వర్గాలకు తన సేవలను అందించింది. అయితే 1906లో మెన్షివిక్‌లలో చేరాలని నిర్ణయించుకుంది. 1908లో జర్మనీకి ప్రవాసంలోకి వెళ్లింది. పశ్చిమ ఐరోపా అంతటా ప్రయాణించి కార్ల్ కౌట్స్కీ, క్లారా జెట్‌కిన్, రోసా లక్సెంబర్గ్, కార్ల్ లైబ్‌నెచ్ట్ వంటి వారితో పరిచయం పెంచుకుంది.

యుద్ధానికి వ్యతిరేకంగా...

1914లో మొదటి ప్రపంచ యుద్ధంలో రష్యా ప్రవేశించడంతో కొల్లంతాయ్ యుద్ధాన్ని తీవ్రంగా వ్యతిరేకించింది. దానికి వ్యతిరేకంగా బాహాటంగా మాట్లాడింది. 1915లో మెన్షివిక్‌లతో తెగతెంపులు చేసుకుని లెనిన్ నాయకత్వంలో సామాజిక దేశభక్తితో స్థిరంగా పోరాడిన బోల్షివిక్‌లలో చేరింది. జర్మనీని విడిచిపెట్టిన తర్వాత కొల్లంతాయ్ డెన్మార్క్‌కు వెళ్లింది. యుద్ధానికి వ్యతిరేకంగా మాట్లాడిందని స్వీడిష్ ప్రభుత్వం ఆమెను జైల్లో పెట్టింది. విడుదలైన తర్వాత నార్వేకు వెళ్లింది. అక్కడ ఆమె తన ఆలోచనలను అంగీకరించే ఒక సోషలిస్ట్ బృందాన్ని కలిసింది. 1917 వరకు నార్వేలోనే ఉంది. యుద్ధం, రాజకీయాల గురించి మాట్లాడంతో పాటు తన కొడుకు మిఖాయిల్‌ను కలిసేందుకు రెండుసార్లు యునైటెడ్ స్టేట్స్‌కు వెళ్లింది. 1917 ఫిబ్రవరి విప్లవం గురించి విన్న తర్వాత నార్వే నుండి రష్యాకు తిరిగి వచ్చింది.

రష్యన్ విప్లవం



ఏప్రిల్ 1917లో బోల్షివిక్‌ల ఏకైక ప్రధాన మహిళా నాయకురాలు కొల్లంతాయ్. ఆమె పెట్రోగ్రాడ్ సోవియట్ ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యురాలు. 1917లో రష్యాలో ఒక స్పీకర్‌గా, కరపత్ర రచయితగా, బోల్షివిక్ మహిళా పేపర్ రాబోట్నిట్సాలో కార్మికురాలిగా విప్లవం కోసం నిరంతరం ఉద్యమించింది. అక్టోబరు 26న జరిగిన రెండవ ఆల్-రష్యన్ కాంగ్రెస్ ఆఫ్ సోవియట్‌లో ఆమె మొదటి సోవియట్ ప్రభుత్వంలో సోషల్ వెల్ఫేర్ పీపుల్స్ కమీషనర్‌గా ఎన్నికయ్యారు. సోవియట్ పరిపాలనలో అత్యంత ప్రముఖ మహిళగా ఉన్న ఆమె 1919లో 'మహిళల విభాగం స్థాపనకు కీలక పాత్ర పోషించారు. ఈ సంస్థ సోవియట్ యూనియన్‌లో మహిళల జీవిత పరిస్థితులను మెరుగుపరచడానికి, నిరక్షరాస్యతతో పోరాడటానికి, విప్లవం ద్వారా కొత్త వివాహం, విద్య, ఉద్యోగ చట్టాల గురించి మహిళలకు అవగాహన కల్పించడానికి పనిచేసేది.

మహిళా హక్కులపై...

కొల్లంతాయ్ ఉదార స్త్రీవాద భావజాలాన్ని వ్యతిరేకించింది. అదే సమయంలో ఆమె మహిళా విముక్తి ఛాంపియన్. 1946లో ఒక రష్యన్ మ్యాగజైన్‌కు ఆమె రాసిన ఒక వ్యాసాన్ని చదివితే మహిళా హక్కులపై సోవియట్ యూనియన్ సాధించిన విజయాలు మనకు కనిపిస్తాయి. వాటిని ఆమె ఎంతో ప్రశంసించింది. అంతర్జాతీయ మహిళా దినోత్సం కోసం అహర్నిశలూ పోరాడిన వారిలో కొల్లంతాయ్ కూడా ఒకరు. అలాంటి ఆమె పుట్టింది, మరణించింది మార్చి నెలలోనే. కొల్లంతాయ్ మాస్కోలో 9 మార్చి 1952న తన ఏనభై ఏండ్ల వయసులో మరణించింది.

ప్రశ్నించే తత్వాన్ని వదల్లేదు

అక్టోబర్ విప్లవానికి నాయకత్వం వహించిన బోల్షెవిక్‌ల సెంట్రల్ కమిటీలో 1950 వరకు కొనసాగిన ఏకైక సభ్యురాలు ఆమె. ఆమె కొన్నిసార్లు తీవ్రంగా విమర్శించబడింది, ధిక్కారం కూడా ఎదుర్కొంది. అయినా తన ప్రశ్నించే తత్వాన్ని వదులుకోలేదు. 1970లలో స్త్రీవాద ఉద్యమానికి కొల్లోంటై జీవితం, రచనలపై కొత్త ఆసక్తిని రేకెత్తించింది. చరిత్రకారులు కాథీ పోర్టర్, బీట్రైస్ ఫార్న్స్‌వర్త్, బార్బరా ఎవాన్స్ క్లెమెంట్స్‌లు ఆమె జీవితంతో పాటు అనేక పుస్తకాలు, కరపత్రాలు ప్రచురించారు. 1982లో రోసా వాన్ ప్రౌన్‌హీమ్ కొల్లోంటై రాసిన నవల ఆధారంగా రెడ్ లవ్ అనే చిత్రాన్ని నిర్మించారు.

తునికాకు సేకరణ ఎప్పుడు?



(మొదటిపేజి తరువాయి)

చేపట్టకుంటే లక్షలాది మంది పేదల ఉపాధికి గండి పడే అవకాశముంది. తునికాకు సేకరణ పనుల జాప్యంతో దీనిపై ఆధారపడిన ఆదివాసీలు, గిరిజనులు, గిరిజనేతరులు ఆందోళనలో ఉన్నారు.

మన రాష్ట్రంలో ప్రతి ఏటా కాళేశ్వరం, మంచిర్యాల, బాసర, రాజన్న, భద్రాద్రి, చార్మినార్, జోగులాంబ సర్కిళ్ల పరిధిలోని 14 జిల్లాల్లో (భద్రాద్రి కొత్తగూడెం, ములుగు, ఆదిలాబాద్, కొమ్రంభీమ్, వరంగల్, ఖమ్మం, మహబూబాబాద్, మంచిర్యాల, పెద్దపల్లి, భూపాలపల్లి, వికారాబాద్, మహబూబ్‌నగర్, కామారెడ్డి, నిజామాబాద్) తునికాకు సేకరణను చేపడతారు. దీనిపై ఆధారపడి ప్రత్యక్షంగా ఐదు లక్షలకుపైగా ఆదివాసీలు, గిరిజనులు, గిరిజనేతర పేదలు లబ్ది పొందుతున్నారు. పరోక్షంగా వేలాది మందికి ఉపాధి లభిస్తున్నది. ప్రతి ఏటా టెండర్ల ప్రక్రియ పూర్తిచేసిన తర్వాత ఫిబ్రవరి చివరి వారంలో కొమ్మకొట్టుడు(ప్రూనింగ్)పనులను ప్రారంభిస్తారు. ప్రూనింగ్ తర్వాత 45 రోజులకు తునికాకు ఏపుగా పెరిగి కోతకు వస్తుంది. సకాలంలో, ఎక్కువ ప్రాంతంలో ప్రూనింగ్ జరిగితే ఎక్కువ ఆకు దిగుబడి వచ్చే అవకాశముంటుంది. తద్వారా ఆదివాసీలు, గిరిజనులు, గిరిజనేతర పేదలకు ఉపాధి ఎక్కువగా దొరుకుతుంది. అయితే, తునికాకు సేకరణకు సంబంధించిన ప్రక్రియలో జాప్యం నెలకొంది. ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, జార్ఖండ్, మహారాష్ట్ర, ఒడిశా రాష్ట్రాల్లో టెండర్లు 90 శాతం దాకా పూర్తయ్యాయి. ఇక్కడ అటవీ శాఖ చొరవ తీసుకుని సరిగా స్పందించడం లేదని దీనిని బట్టే అర్థమవుతున్నది. సకాలంలో కొమ్మకొట్టుడు పనులు పూర్తికాకుంటే పెద్ద ఎత్తున ఉపాధిని కార్మికులు కోల్పోయే ప్రమాదం పొంచి ఉంది. తునికాకు సీజన్‌లో ఒకొక్క కుటుంబం 30 వేల రూపాయల నుంచి 50 వేల రూపాయల వరకు సంపాదించుకుంటుంది. అంతే మొత్తాన్ని బోనస్ రూపంలో రాష్ట్ర ప్రభుత్వం వారికి ఇస్తుంది. ఈ తునికాకు సీజన్ ద్వారా వచ్చే ఆదాయాన్ని దృష్టిలో పెట్టుకునే ఆదివాసీ గిరిజనులు పెండ్లి, తదితర శుభకార్యాలను పెట్టుకుంటారు. దీనిపై ఆధారపడే సంతల్లో, మార్కెట్‌లో ఆర్థిక కార్యకలాపాలు బాగా పుంజుకుంటాయి. ట్రాన్స్‌పోర్టు రంగంలో గోడౌన్ల వద్ద లోడింగ్, అన్‌లోడింగ్ పనులు ద్వారా వేలాది మందికి ఉపాధి లభిస్తుంది. ఇదంతా ఒక గొలుసుకట్టు చర్య. ఇలా తునికాకు సేకరణపై ఆధారపడి రాష్ట్రంలో ఐదు లక్షలకుపైగా కుటుంబాలు లబ్ది పొందుతున్నాయి. టెండర్ల సమయంలో ప్రభుత్వానికి రాయల్టీ రూపంలో కాంట్రాక్టర్లు చెల్లించిన మొత్తాన్ని ఖర్చులు పోనూ మిగతా డబ్బును కార్మికులకే తిరిగి బోనస్ రూపంలో చెల్లించడం ఆనవాయితీ. దీన్ని 2006 నుంచి అమల్లోకి తెచ్చారు. అయితే, గత బీఆర్ఎస్ ప్రభుత్వమూ బోనస్ విషయంలో తీవ్ర అన్యాయం చేసింది. 2016 నుంచి పెండింగ్‌లో పెట్టింది. ఆదివాసీ, గిరిజన సంఘాల పోరాటల తర్వాత జిల్లాలకు అమౌంట్ విడుదల చేశామని సీసీఎఫ్ ప్రకటించారు. కానీ, జిల్లా, రేంజ్ అధికారుల నుంచి తునికాకు సేకరణ కూలీలకు మాత్రం అందలేదు. 50 శాతానికిపైగా కార్మికులకు ఇంకా బోనస్ చెల్లించలేదు.

రాష్ట్ర ప్రభుత్వం, అటవీశాఖ చొరవ చూపకుంటే తునికాకు సేకరణ కూలీలకు అన్యాయం

ఆదివాసీ, గిరిజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బండారు రవికుమార్

రాష్ట్ర ప్రభుత్వం, అటవీశాఖ జాప్యం వల్ల రాష్ట్రవ్యాప్తంగా ఉన్న తునికాకు సేకరణ కార్మికుల్లో ఆందోళన నెలకొంది. రాష్ట్ర ప్రభుత్వం చొరవ చూపకపోతే సీజన్‌లో జరిగే నష్టానికి ప్రభుత్వమే బాధ్యత వహించాలి. మార్చి ఆరో తేదీన జరిగే టెండర్ల ప్రక్రియలోనైనా జాప్యం లేకుండా మిగిలిపోయిన 168 యూనిట్లన్నింటిలోనూ ఖరారయ్యే విధంగా చర్యలు తీసుకోవాలి. పెండింగ్‌లో ఉన్న తునికాకు బోనస్ చెల్లింపులు కూడా వేగవంతం చేయాలి. ఇప్పటిదాకా 50 ఆకుల తునికాకు కట్టకు రూ.3 మాత్రమే ఇస్తున్నారు. ఇది సరిగాదు. కనీసం కట్టకు రూపాయినైనా పెంచి రూ.4 చెల్లించాలి. తునికాకు సేకరణ కూలీలకు కనీస సౌకర్యాలు కల్పించాలి.

కిక్కే దిక్కా..!



(మొదటిపేజి తరువాయి)

సైతం ఆదాయం పెంపుపై దిశా నిర్దేశం చేయడంతో అధికారులు పాత ఫైళ్ల బూజు దులుపి ఎలైట్ బార్లను తెరపైకి తెచ్చేందుకు కసరత్తు చేస్తున్నారు. ఎలైట్ బార్ల ఏర్పాటుకు సంబంధించి గత ప్రభుత్వం 2017లో జీవో విడుదల చేసింది. ఈ జీవోలో కొన్ని మార్పులు చేసి అమలు చేయాలా? యథావిధిగా అమలు చేయాలా? అనే అంశంపై ఎక్సైజ్ శాఖ కసరత్తు చేస్తోంది. రెగ్యులర్ బార్లకు ప్రాంతాలను బట్టి రూ.40 లక్షల నుంచి రూ.50 లక్షల వరకు చెల్లించాల్సి ఉంటుంది. అదే ఎలైట్ బార్లకు సాధారణ బార్లకు చెల్లించే లైసెన్స్ ఫీజు కన్నా 25 శాతం అదనంగా చెల్లించాల్సి ఉంటుంది. అలాగే ప్రతి ఏడాది 25 శాతం ఫీజు పెంచుతారు. బార్లకు నిర్దేశించిన ఫీజు ఉండటం వల్ల అదే స్థాయిలో ఆదాయం వచ్చే అవకాశం ఉంది. వైన్ షాపుల మాదిరిగా టెండర్ల విధానంలో నోటిఫికేషన్ జారీ చేసి కేటాయింపు చేపడితే ఎలా ఉంటుందనే విషయాన్ని కూడా అంచనా వేస్తున్నారు. పోటీ అధికంగా ఉంటే టెండర్లే ఖజానాకు అధిక అధిక ఆదాయం తెచ్చి పెట్టనున్నాయని భావిస్తున్నారు. ఈ విషయంలో ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని తెలుస్తోంది. ప్రభుత్వం నుంచి వచ్చే ఫీడ్ బ్యాక్ ఆధారంగా రెగ్యూలర్ విధానమా? టెండర్లా అనే విషయాన్ని ఫైనల్ చేయనున్నారు. సాధారణ బార్లకంటె ఎక్కువ ఖర్చుతో కూడకున్నందున ముందుగా హైదరాబాద్‌లో 100, రాష్ట్ర వ్యాప్తంగా జిల్లా కేంద్రాలతో పాటు ప్రధాన పట్టణాల్లో మరో 100 మొత్తం 200 ఎలైట్ బార్లను ఏర్పాటు చేయాలని లక్ష్యంగా నిర్ణయించారు.

ప్రధాన ఆదాయ వనరుగా మద్యం

రాష్ట్రం ఏర్పడిన తొలి ఏడాదైన 2014లో మద్యం ద్వారా ఖజానాకు రూ. 10,863 కోట్లు సమకూరగా, అ తర్వాత ఏడాది రూ.12,500 కోట్ల మార్కును దాటింది. వరుసగా పెరుగుదల రేటును నమోదు చేసుకుంటూ 2021లో రూ.30 వేల కోట్లు, 2022లో రూ.36 వేల కోట్లకు చేరింది. ఈ రకంగా రాష్ట్ర ఖజానాకు మద్యమే ప్రధాన ఆదాయ వనరుగా మారింది. పదేండ్లలో దాదాపు రూ.2.5లక్షల కోట్లకు పైగా ఆదాయం ఈ విభాగం నుంచే సర్కారుకు వచ్చింది. అయితే గత ఏడాది 2023లో రూ. 40 వేల కోట్లు వస్తుందని లక్ష్యం నిర్దేశించుకున్నప్పటికి అంతకు ముందు ఏడాది 2022 కంటె దాదాపు రూ. 2 వేల కోట్లు తక్కువగా ఆదాయం వచ్చింది. దాంతో మరింత ఆదాయం పెంచుకునేందుకు ఎక్సైజ్ శాఖ కసరత్తు ప్రారంభించింది. లిక్కర్ ధరలు పెంచితే జనం నుంచి వ్యతిరేకత వస్తుందనే భయంతో కొత్త మార్గాలను అన్వేషిస్తోంది. ఇటీవల ఉపముఖ్యమంత్రి నిర్వహించిన ఉన్నతస్థాయి సమీక్షలో ఎలైట్ బార్లను తెరపైకి తేచ్చేందుకు నిర్ణయం తీసుకున్నట్టు సమాచారం. ఇందుకు సంబంధించి త్వరలో నోటిఫికేషన్ విడుదయ్యే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది.

అదనపు సౌకర్యాలు

ఎలైట్ బార్లలో రెగ్యులర్ బార్లకంటె అదనపు సౌకర్యాలు ఉంటాయి. 10 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏర్పాటు చేయాలి. బార్ మొత్తం సెంట్రల్ ఏసీ, విశాలమైన పార్కింగ్ స్థలం, అల్ట్రామాడ్రన్ కిచెన్ అందుబాటులో ఉంటుంది. వినియోగదారులకు ఖరీదైన లిక్కర్ బ్రాండ్లనే అందుబాటులో ఉంచుతారు. ఉన్నత వర్గాలు, సంపన్నుల కోసం ఈ బార్లను గతంలో డిజైన్ చేశారు. లిక్కర్ విషయంలో ధరలో తేడా లేక పోయినా ఫుడ్ విషయంలో మాత్రం బార్లదే తుది నిర్ణయం. హైదరాబాద్, సికింద్రాబాద్ తర్వాత రాష్ట్రంలో టూ టైర్ పట్టణాలుగా వేగంగా అభివృద్ధి చెందుతున్న వరంగల్, కరీంనగర్, నిజామాబాద్, ఖమ్మం తదితర పట్టణాల్లో వీటికి భారీ ఎత్తున పోటీ ఉంటుందని భావిస్తున్నారు.

బీజేపీలో టికెట్ల చిచ్చు

(మొదటిపేజి తరువాయి)

ఆటంకాలు సృష్టించినా జాతీయ నాయకత్వం అండతో టికెట్ దక్కించుకున్న ఈటలను మరోమారు ఓడగొట్టేందుకు సొంత పార్టీ శ్రేణులే సన్నద్ధమవుతుండటం ఆ పార్టీని కలవరపెడుతున్నది. తనకు మల్కాజిగిరి స్థానం దక్కకపోవటంపై పార్టీలో హార్డ్‌కోర్ నాయకుడిగా పేరున్న మురళీధర్‌రావు అలకపాన్పు ఎక్కటం ఇబ్బందిగా మారింది. ఈటలకు టికెట్ ఇవ్వడాన్ని నిరసిస్తూ కూన శ్రీశైలంగౌడ్, తూళ్ల వీరేందర్‌గౌడ్ బీజేపీని వీడుతారనే చర్చ నడుస్తున్నది. మరోవైపు ఆ నియోజకవర్గానికి చెందిన పలువురు బీజేపీ కీలక నేతలు ఈటలకు వ్యతిరేకంగా గ్రూపు కట్టి ఆయన్ను పనిగట్టుకుని ఓడించే పనిలో ఉన్నట్టు ప్రచారం జరుగుతున్నది. ఓ విద్యాసంస్థల అధినేతకు టికెట్ ఇస్తామని కొందరు బీజేపీ రాష్ట్ర అగ్రనేతలు కొమురయ్యను ఆర్థికంగా వాడుకున్నారనే విమర్శ బలంగా వినిపిస్తున్నది. ఈ విషయంపై ఆ పార్టీ జాతీయ నాయకత్వం సీరియస్ అయ్యి హెచ్చరించినట్టు ప్రచారం జరుగుతున్నది. ఆ పార్టీ జాతీయ మాజీ అధ్యక్షులు బంగారు లక్ష్మణ్ కుమార్తె శృతి తనకు నాగర్ కర్నూల్ స్థానం కేటాయించకపోవడంపై ఆగ్రహంతో ఉన్నారు. ఇన్నేండ్లు పార్టీ కోసం కష్టపడిన తనను కాదని భరత్‌కు ఇవ్వడాన్ని ఆమె జీర్ణించుకోలేకపోతున్నారు. ఈ నేపథ్యంలో ఆమె పార్టీ మారబోతున్నారనే చర్చా మొదలైంది. సీఎం రేవంత్‌రెడ్డిని ఆమె కలవడం దానికి మరింత బలం చేకూరింది.

ఈసారి తమకే గన్‌షాట్ టికెట్లు అని పోటీ చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేసుకుంటున్న సోయం బాపూరావు(ఆదిలాబాద్), డీకే అరుణ (మహబూబ్‌నగర్), రఘునందన్‌రావు(మెదక్) తమకు ఇంకా టికెట్ ఖరారు చేయకపోవడంపై పార్టీ నాయకత్వంపై కుతకుత ఉడికిపోతున్నారు. మెదక్ నుంచి ఆర్థికంగా, సామాజికంగా బలమైన నేతను రంగంలోకి దింపాలనే యోచనతోనే రఘునందన్‌రావును నాయకత్వం పక్కన బెట్టినట్టు తెలిసింది. ఒకవేళ టికెట్లు దక్కకపోతే వారు పార్టీలో ఉండటమూ కష్టమే. తరుచూ గిరిజనులకు వ్యతిరేకంగా నోరుపారేసుకోవడం, సొంతింటికి ఎంపీ నిధులను ఉపయోగించుకున్నారనే ఆరోపణలు రావటం, పార్టీ శ్రేణులను కలుపుకుని పోకుండా ఒటెత్తు పోకడలకు పోవడం వంటి వాటివల్లనే బాపూరావుకు అభ్యర్థిత్వం ఖరారు కాలేదనే చర్చ బీజేపీలో నడుస్తున్నది. ఆ స్థానం నుంచి మాజీ ఎంపీలు రమేశ్‌రాథోడ్, నగేశ్‌లలో ఒకరిని బరిలోకి దింపాలనే నిర్ణయానికి జాతీయ నాయకత్వం వచ్చింది. దీనిపై బాపూరావు గుర్రుగా ఉన్నారు. ఆదిలాబాద్‌లో ప్రెస్‌మీట్ పెట్టి మరీ 'సెకండ్ లిస్టులో నా పేరుంటుందనే విశ్వాసం ఉంది. 2019లో జెండా పట్టుకునేందుకు కూడా సరిగా కార్యకర్తలు లేని సమయంలో కాంగ్రెస్‌ను వీడి బీజేపీలో చేరాను. ధైర్యంగా ఆదిలాబాద్ ఎంపీ నియోజకవర్గ పరిధిలోని బీజేపీని ముందుకు తీసుకెళ్లాను. 42 ఎంపీటీసీలు, 6 జెడ్పీటీసీలు, అనేక మంది సర్పంచులను దగ్గరుండి గెలిపించాను. రాష్ట్రంలో బీజేపీ నుంచి ఎనిమిది మంది ఎంపీలు గెలుపొందితే అందులో నలుగురు ఎమ్మెల్యేలు నా నియోజకవర్గం వారే. ఈస్థాయిలో పార్టీని డెవలప్‌మెంట్ చేసినంక నాకెందుకు టికెట్ ఇవ్వరు?' అంటూ బాంబు పేల్చారు. నల్లగొండ నుంచి బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే సైదిరెడ్డిని, ఖమ్మం నుంచి బీఆర్ఎస్ ఎంపీ నామానాగేశ్వర్‌రావును, మహబూబాబాద్ నుంచి తాజా బీఆర్ఎస్ ఎంపీ కవిత కాదంటే హుస్సేన్ నాయక్, వరంగల్ నుంచి ఆరూరు రమేశ్‌ను రంగంలోకి దింపాలని బీజేపీ జాతీయ నాయకత్వం భావిస్తున్నట్టు తెలిసింది. ఇప్పటికే రాష్ట్ర కీలక నేతలు వారితో సంప్రదింపులు జరుపుతున్నారు. ఈ నేపథ్యంలోనే ఆ స్థానాలను పెండింగ్‌లో పెట్టారు. తొలి విడత టికెట్ల పంపకం తర్వాత బీజేపీలో జరుగుతున్న పరిణామాలను చూస్తుంటే...బీజేపీ అభ్యర్థులను ఓడించడానికి వేరే వారు అవసరం లేదు..సొంతగూటి నేతలే సరిపోతారనే చర్చ అప్పుడే మొదలైంది. టికెట్ల పంచాయతీ మునుముందు ఎలాంటి పరిణామాలను దారితీస్తుందో చూడాల్సిందే.

రాష్ట్రాలుగా విడిపోయినా... మనుషులుగా కలిసుందాం

(మొదటిపేజి తరువాయి)

సీఎం రేవంత్‌రెడ్డి ఆవిష్కరించి మాట్లాడారు. జాతీయ రాజకీయాల్లో నీలం సంజీవరెడ్డి, పీవీ నర్సింహారావు, ఎన్టీఆర్ వంటి నేతలు ప్రధాన పాత్రలు పోషించారనీ, వెంకయ్యనాయుడు, ఎస్ జైపాల్‌రెడ్డి వంటి నేతలు ఆ సంప్రదాయాన్ని కొనసాగించారని గుర్తుచేశారు. కానీ ప్రస్తుతం ఆ స్థాయిలో జాతీయ రాజకీయాల్లో తెలుగువారు లేకపోవడం లోటుగా అనిపిస్తున్నదని చెప్పారు. ఫుల్ టైం బిజినెస్ చేసే వారు పాలిటిక్స్‌ను పార్ట్ టైంగా భావించడం దీనికి కారణమై ఉండొచ్చని అభిప్రాయపడ్డారు. తెలుగువారు అందరూ కలిసి అభివృద్ధి పథంలో పనిచేయాలనీ, దేశ రాజకీయాల్లో తెలుగువారి నిర్ణయాలు ఉండాలని అకాంక్షించారు. దేశంలో హిందీ తర్వాత అత్యధిక మంది మాట్లాడేది తెలుగు భాషే అనీ, కానీ ఆ గుర్తింపును రాజకీయాల్లో కోల్పోతున్నామని అన్నారు. గతంలో ఉత్తరాది వారికి ప్రధానమంత్రి పదవి లభిస్తే, తొలి ఐదు ప్రధానమైన కేంద్ర మంత్రి పదవుల్లో కచ్చితంగా దక్షిణాది వారు ఉండేవారనీ, ఆ విధంగా ప్రాంతాల మధ్య సమన్వయం ఉండేదని అన్నారు. పీవీ నర్సింహారావు ప్రధానమంత్రి అయ్యి, నంద్యాల నుంచి పోటీ చేస్తే, తెలుగు వ్యక్తి ప్రధాని అవుతున్నారని అప్పటి ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు అభ్యర్థిని పోటీకి పెట్టలేదని గుర్తుచేశారు. మన గౌరవం కోసం అలాంటి సంప్రదాయాన్ని పాటించడంలో తప్పు లేదని అన్నారు. స్వాతంత్ర్య పోరాటం మొదలు నిజాం పాలన, ఉమ్మడి రాష్ట్ర పరిపాలన, ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర పాలన, జై ఆంధ్ర ఉద్యమం వంటి అనేక చారిత్రక ఘట్టాలకు సాక్షులుగా నిలిచిన పెద్దలు తమ అనుభవాలను ప్రభుత్వంతో పంచుకోవాలనీ, దానికి తమ ప్రభుత్వం ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుందని చెప్పారు. జాతీయ రాజకీయాల్లో తెలుగువారి నిర్ణయాలు కచ్చితంగా ఉండాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో పుస్తక రచయిత పీఎస్ రామ్మోహన్‌రావు, మాజీ ఐపీఎస్ అధికారి రంగయ్యనాయుడు, డీజీపీ రవిగుప్తా, ఎమ్సీహెచ్చార్డీ డైరెక్టర్ జనరల్ జోయల్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌పై వ్యతిరేకత వచ్చింది


(మొదటిపేజి తరువాయి)

ఎన్నికల్లో రోడ్‌షోలు నిర్వహించాలనీ, తాను వాటిలో స్వయంగా పాల్గొంటానని చెప్పారు. పార్లమెంటు ఎన్నికల్లో బీఆర్ఎస్, బీజేపీ మధ్యే పోటీ ఉంటుందనీ, మండల స్థాయిలో పార్టీ సమావేశాలు పెట్టాలనీ, బస్సు యాత్రలు చేపట్టాలని అన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షులు, మాజీ మంత్రి కే తారకరామారావు మాట్లాడుతూ ఎల్ఆర్ఎస్ విషయంలో గతంలో బీఆర్ఎస్‌ను కాంగ్రెస్ పార్టీ విమర్శించిందని గుర్తు చేశారు. తాము అధికారంలోకి వస్తే ఎల్ఆర్ఎస్ ఉచితంగా చేస్తామని ఆపార్టీ మాట ఇచ్చిందనీ, దాన్ని ప్రజలకు గుర్తుచేయాలని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు నీళ్లు, కరెంటు ఇవ్వడం లేదన్నారు. ప్రాజెక్టుల్లో సమస్యలు రావడం సహజమనీ, మధ్యమానేరులో సమస్యలు వస్తే వెంటనే మరమ్మతులు చేసిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. అనవసర భేషజాలకు వెళ్లి ప్రభుత్వం ప్రజలకు నష్టం చేస్తుంటే చూస్తూ ఊరుకొనేది లేదని స్పష్టం చేశారు.

ఎన్నికల లావాదేవీలు చెక్కు ద్వారానే : సీఈసీ

(మొదటిపేజి తరువాయి)

ఎన్నికల సన్నద్ధతను సమీక్షించిన అనంతరం లక్నోలో మీడియా ప్రతినిధులతో మాట్లాడిన ఆయన.. అభ్యర్థులు డిజిటల్ లావాదేవీల్లో పాల్గొనేలా ప్రోత్సహిస్తామనీ, వారికి చెక్ బుక్‌లను కూడా అందజేస్తామని చెప్పారు. అనేక పార్టీలు ఈవీఎంలపై భయాందోళనలు వ్యక్తం చేశాయనీ, వాటిని ప్రభుత్వ వాహనాల్లో తరలించాలని కోరాయనీ, ఈ వాహనాలకు జీపీఎస్ ట్రాకింగ్ అమర్చబడిందని సీఈసీ చెప్పారు. అన్ని జిల్లాల మేజిస్ట్రేట్లు, పోలీసు సూపరింటెండెంట్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని రాజీవ్ కుమార్ కోరారు. ఎన్నికల ప్రక్రియలో అవకతవకలకు పాల్పడే వ్యక్తులపై చర్యలుంటాయని ఆయన అన్నారు.



ఉద్యోగుల సమస్యలు పరిష్కారమయ్యేనా ?

- రెండోవారంలో ఎన్నికల షెడ్యూల్ వచ్చే అవకాశం
- రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం కోసం ఎదురుచూపు
- డీఏల కోసం ఉద్యోగుల నిరీక్షణ..
- పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని డిమాండ్
- సీపీఎస్ రద్దు చేస్తామంటూ కాంగ్రెస్ హామీ
- మాట నిలబెట్టుకోవాలంటున్న ఉద్యోగ సంఘాలు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలోని ప్రభుత్వ ఉద్యోగులందరికీ నాలుగేండ్ల తర్వాత ఫిబ్రవరి వేతనాలను, పెన్షనర్లకు పింఛన్‌ను మార్చి ఒకటో తారీఖున చెల్లించడం పట్ల ఆనందం వ్యక్తమవుతున్నది. ఉద్యోగులు, ఉపాధ్యాయులకు ఒకటో తారీఖున వేతనాలు అందేలా చర్యలు తీసుకుంటామన్న హామీని కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేసింది. రాష్ట్రంలోని 3,69,200 మంది ఉద్యోగులకు జీతాలు, 2,88,000 మంది పెన్షనర్లకు పింఛన్ చెల్లించింది. బీఆర్ఎస్ పాలనలో రెండోవారం, మూడో వారం జీతాలు వచ్చే పరిస్థితి ఉండేది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక జీతాల చెల్లింపులో మార్పు వచ్చింది. దీనిపై హర్షం వ్యక్తమవుతున్నది. అయితే ఉద్యోగులు ఇతర సమస్యలతో సతమతమవుతున్నారు. జనవరితో కలిపితే నాలుగు కరువు భత్యం (డీఏ)లు పెండింగ్‌లో ఉన్నాయి. వాటి కోసం ఏడాదికిపైగా నిరీక్షిస్తున్నారు. అదే విధంగా ట్రెజరీల్లో ఆమోదం పొంది రెండేండ్లుగా ప్రభుత్వం వద్ద పెండింగ్‌లో ఉన్న జీపీఎఫ్, టీఎస్‌జీఎల్ఐ, పీఆర్సీ బకాయిలు, మెడికల్ రీయింబర్స్‌మెంట్, పెన్షన్ తదితర బిల్లులన్నీ వెంటనే విడుదల చేయాలని కోరుతున్నారు. పెండింగ్‌లో ఉన్న మూడు డీఏలను తక్షణమే చెల్లిస్తామని కాంగ్రెస్ ఎన్నికల మ్యానిఫెస్టోలో హామీ ఇచ్చింది. ఇంకోవైపు డీఏను సకాలంలో ప్రకటించి బకాయిలను నేరుగా చెల్లిస్తామని హామీ ఇచ్చింది. సప్లిమెంటరీ బిల్లులను 15 రోజుల్లో చెల్లిస్తామని ప్రకటించింది. కానీ అధికారంలోకి వచ్చి రెండు నెలలు దాటినా డీఏ, పెండింగ్ బిల్లులపై ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవడం గమనార్హం.

ఉద్యోగుల్లో ఆందోళన

పార్లమెంటు ఎన్నికల షెడ్యూల్ ఈనెల 10 తర్వాత ఎప్పుడైనా విడుదలయ్యే అవకాశమున్నది. ఇందుకు సంబంధించి ఈసీ కసరత్తు చేస్తున్నది. ఈలోపు రాష్ట్ర ప్రభుత్వం డీఏ, పెండింగ్ బిల్లుల విడుదలపై నిర్ణయం తీసుకుంటుందా? లేదా? అనే దానిపై ఉద్యోగుల్లో ఆందోళన నెలకొంది. ఎన్నికల కోడ్ వస్తే ఫలితాలు వచ్చేదాకా డీఏ, పెండింగ్ బిల్లుల కోసం ఎదురుచూడాల్సి ఉంటుంది. ఈలోపు డీఏలను ప్రకటించాలని ఉద్యోగులు, ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాయి. 2022, జులైలో 3.64 శాతం, గతేడాది జనవరిలో 3.64 శాతం, జులైలో 3.64 శాతం మూడు డీఏలు కలిపి 10.92 శాతం పెండింగ్‌లో ఉన్నాయి. ఈ ఏడాది జనవరిలో 3.64 శాతం డీఏ మంజూరు చేయాల్సి ఉన్నది. అదీ కలిపితే 14.56 శాతం రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వాల్సి ఉన్నది. ఎన్నికల షెడ్యూల్ విడుదల ప్రక్రియ సమీపిస్తుండడంతో ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకుంటోందని ఉద్యోగులు ఎంతో ఆశగా ఎదురుచూస్తున్నారు. 317 జీవోను సమీక్షించి బాధిత ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరిస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చింది. అందులో భాగంగానే దామోదర రాజనర్సింహ నేతృత్వంలో మంత్రివర్గ ఉపసంఘాన్ని నియమించింది. సభ్యులుగా మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్ ఉన్నారు.సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేస్తామని మ్యానిఫెస్టోలో ప్రకటించింది. దానిపై ఇప్పటి వరకు ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. ప్రభుత్వం ఏర్పడిన ఆర్నెల్లలోపుపీఆర్సీ సిఫారసులను అమలు చేస్తామని హామీ ఇచ్చింది. పీఆర్సీ కమిటీ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, ఆయా సంఘాల నుంచి అభిప్రాయాలను సేకరిస్తున్నది. వాటి సమర్పణకు గడువు సోమవారం వరకు గడువున్నది. పీఆర్సీ కమిటీ వాటిని క్రోడీకరించి రాష్ట్ర ఆర్థిక పరిస్థితి, ప్రభుత్వ హామీలు, సంక్షేమ పథకాల అమలు వంటి అంశాలను పరిశీలించి సిఫారసులను తయారు చేసి ప్రభుత్వానికి సమర్పిస్తుంది. ఆ తర్వాతే పీఆర్సీపై ప్రభుత్వం నిర్ణయం తీసుకునే అవకాశమున్నది.

డీఏ బకాయిలను విడుదల చేయాలి

రాష్ట్రంలోని ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లకు సంబంధించిన పెండింగ్ బిల్లులను వెంటనే మంజూరు చేయాలని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావ రవి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న మూడు వాయిదాల డీఏ బకాయిలను వెంటనే విడుదల చేయాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మ్యానిఫెస్టోలో పేర్కొన్న విధంగా పెండింగ్ బిల్లులన్నీ మంజూరు చేయాలని చెప్పారు. సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని కోరారు.

చావ రవి, టీఎస్‌యూటీఎఫ్ ప్రధాన కార్యదర్శి

ఎన్నికల షెడ్యూల్ వచ్చేలోపు డీఏ ప్రకటించాలి

ప్రభుత్వ ఉద్యోగులకు మొదటి తేదీన జీతాలు చెల్లించడం పట్ల రాష్ట్ర ప్రభుత్వానికి టీఎన్జీవో కేంద్ర సంఘం ప్రధాన కార్యదర్శి మారం జగదీశ్వర్ కృతజ్ఞతలు తెలిపారు. పార్లమెంటు ఎన్నికల షెడ్యూల్ విడుదలయ్యేలోపు పెండింగ్‌లో ఉన్న మూడు డీఏలను ప్రకటించాలని కోరారు. ఏడాదికిపైగా ఉద్యోగులు వాటికోసం ఎదురుచూస్తున్నారని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చెల్లిస్తే ఎంతో ఉపశమనం కలుగుతుందని తెలిపారు.

మారం జగదీశ్వర్, టీఎన్జీవో ప్రధాన కార్యదర్శి




స్టార్ క్రికెటర్లు అవసరం లేదు

- యువ జట్టుతోనూ విజయాలు సాధించగలం
- లిటిల్ మాస్టర్ సునీల్ గవాస్కర్ వ్యాఖ్యలు

ముంబయి : భారత క్రికెట్ దిగ్గజం, లిటిల్ మాస్టర్ సునీల్ గవాస్కర్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. టెస్టు క్రికెట్‌లో భారత జట్టు లోతైన బెంచ్ బలంపై ప్రశంసలు కురిపిస్తూనే, అగ్ర క్రికెటర్లపై పదునైన వ్యాఖ్యలు చేశారు. క్రికెట్ జట్టుగా ఆడే క్రీడ. ఓ ఆటగాడిపై ఆధారపడేది కాదు. ఈ సంగతి తెలుసుకోవాలని చురకలు అంటించారు. 'నేను ఎప్పుడూ చెబుతాను, జట్టులో అగ్ర క్రికెటర్ల అవసరం లేదు. ఎవరైనా అగ్ర క్రికెటర్ తను లేకుంటే జట్టు విజయం సాధించలేదని అనుకుంటే..2021 ఆస్ట్రేలియా సిరీస్, 2024 ఇంగ్లాండ్ సిరీస్‌లు అది నిజం కాదని చూపించాయి. అగ్ర క్రికెటర్లు జట్టులో ఉన్నా లేకపోయినా అది పెద్ద విషయమే కాదు. క్రికెట్ టీమ్ స్పోర్ట్. ఓ ఆటగాడిపై ఆధారపడదు' అని సునీల్ గవాస్కర్ అన్నాడు. 'స్వదేశంలో ఇంగ్లాండ్ టెస్టు సిరీస్‌లో జట్టును నడిపించిన తీరు అమోఘం. ఈ ఘనత కెప్టెన్ రోహిత్ శర్మ కోచ్ రాహుల్ ద్రవిడ్‌కు దక్కుతుంది. యువ క్రికెటర్లకు అవకాశాలు ఇచ్చారు, వెన్నుతట్టి మద్దతుగా నిలిచారు, సహజశైలిలో ఆడే స్వేచ్ఛ కల్పించారు. జట్టులో అగ్ర క్రికెటర్లు ఉన్నా లేకపోయినా.. పెద్ద మనసు కలిగిన ఆటగాళ్లతో సిరీస్ విజయం సాధించగలమని నిరూపించింది' అని గవాస్కర్ అన్నారు.

2020-21 ఆస్ట్రేలియా పర్యటనలో తొలి టెస్టులో భారత్ దారుణ ఓటమి చవిచూసింది. కెప్టెన్ కెప్టెన్ విరాట్ కోహ్లి వ్యక్తిగత కారణాలతో స్వదేశం వెళ్లిపోగా.. రహానె సారథ్యంలోని యువ



జట్టు గొప్పగా పుంజుకుంది. రిషబ్ పంత్, మహ్మద్ సిరాజ్ సీనియర్లు లేని వేళ రెచ్చిపోయారు. భారత్‌కు చారిత్రక టెస్టు సిరీస్ విజయం కట్టబెట్టారు. ఇక తాజా ఇంగ్లాండ్‌తో సిరీస్‌కు విరాట్ కోహ్లి వ్యక్తిగత కారణాలతో దూరంగా ఉన్నాడు. గాయంతో కెఎల్ రాహుల్, మహ్మద్ షమి దూరమయ్యారు. అయినా, యువ ఆటగాళ్లు ధ్రువ్ జురెల్, సర్ఫరాజ్ ఖాన్, ఆకాశ్ దీప్‌లు అవకాశాలను సద్వినియోగం చేసుకున్నారు. హైదరాబాద్ టెస్టు ఓటమి నుంచి పుంజుకున్న టీమ్ ఇండియా వరుసగా విశాఖపట్నం, రాజ్‌కోట్, రాంచి టెస్టుల్లో విజయాలు సాధించింది. 3-1తో ఐదు మ్యాచుల టెస్టు సిరీస్‌ను సొంతం చేసుకుంది. భారత్, ఇంగ్లాండ్ టెస్టు సిరీస్‌లో చివరి మ్యాచ్ గురువారం నుంచి ధర్మశాల వేదికగా జరుగనుంది.

ఎందుకో ఎవరికీ తెలియదు! :

బీసీసీఐ కాంట్రాక్టు జాబితా నుంచి శ్రేయస్ అయ్యర్, ఇషాన్ కిషన్‌లను తప్పించటంపై సునీల్ గవాస్కర్ బోర్డుపై విమర్శలు చేశారు. 'బీసీసీఐ వార్షిక కాంట్రాక్టు క్రికెటర్ల జాబితా విడుదల చేసింది. రంజీ ట్రోఫీలో ఆడలేదని కారణంతో శ్రేయస్ అయ్యర్, ఇషాన్ కిషన్‌లపైయ వేటు వేశారని చెబుతున్నారు. కానీ ఇషాన్ కిషన్ ఎందుకు రంజీ టోర్నీలో ఆడటం లేదో ఎవరికీ తెలియదు. ఇంగ్లాండ్‌తో టెస్టు సిరీస్ ముంగిట అయ్యర్ రంజీ ట్రోఫీలో ఆడాడు. దేశవాళీలో ఆడనని అయ్యర్ ఎన్నడూ అనలేదు. వెన్నునొప్పితో మూడో టెస్టులో ఆడలేనని అయ్యర్ ఫిజియోకు ఫిర్యాదు చేశాడు. ఎన్‌సీఏ వైద్య బృందం శ్రేయస్ ఫిట్‌నెస్‌కు క్లియరెన్స్ ఇచ్చారు. వైద్యుల క్లియరెన్స్ అయ్యర్‌పై ప్రతికూల ప్రభావం చూపించింది. ఓ ఆటగాడి గాయం నొప్పి ఏ ఫిజియో సైతం తీర్పు చెప్పలేడు' అని మిడ్‌డేకు రాసిన ఓ వ్యాసంలో సునీల్ గవాస్కర్ రాసుకొచ్చారు.

శార్దూల్ శతక జోరు



ముంబయి : తమిళనాడు, ముంబయి రంజీ ట్రోఫీ సెమీఫైనల్లో శార్దూల్ ఠాకూర్ (109, 105 బంతుల్లో 13 ఫోర్లు, 4 సిక్స్‌లు) ధనాధన్ సెంచరీతో చెలరేగాడు. తనుష్ (74 నాటౌట్, 109 బంతుల్లో 10 ఫోర్లు), హార్దిక్ (35, 92 బంతుల్లో 3 ఫోర్లు) స్ఫూర్తిదాయక ఇన్నింగ్స్‌లతో రాణించారు. ముంబయి తొలి ఇన్నింగ్స్‌లో 106 పరుగులకే ఏడు వికెట్లు కోల్పోయి కష్టాల్లో కూరుకుంది. ఈ దశలో హార్దిక్, తనుశ్ తోడుగా శార్దూల్ రెండు కీలక భాగస్వామ్యాలు నిర్మించాడు.ముంబయి తొలి ఇన్నింగ్స్‌లో రెండో రోజు ఆట ముగిసే సమయానికి 353/9 పరుగులు చేసింది. తొలి ఇన్నింగ్స్‌లో విలువైన 207 పరుగుల ఆధిక్యంలో నిలిచింది. తమిళనాడు బౌలర్ సాయికిశోర్ (6/97) ఆరు వికెట్లతో చెలరేగాడు.

మెరిసిన హిమాన్షు మంత్రి

రంజీ ట్రోఫీ
పైమధ్యప్రదేశ్ పట్టు

నాగ్‌పూర్ : మధ్యప్రదేశ్, విదర్భ రంజీ ట్రోఫీ సెమీఫైనల్లో హిమాన్షు మంత్రి (126, 265 బంతుల్లో 13 ఫోర్లు, 1 సిక్స్) వన్‌మ్యాన్ షోతో అదరగొట్టాడు. యశ్ దూబె (1), హర్ష్ (25), శుభమ్ (1), వెంకటేశ్ అయ్యర్ (0) విఫలమైనా ఓ ఎండ్‌లో నిలబడిన హిమాన్షు బాధ్యతాయుత సెంచరీతో మధ్యప్రదేశ్ ఇన్నింగ్స్‌ను నిలబెట్టాడు. సాగర్ సోలంకి (26), జైన్ (30)లు హిమాన్షుకు సహకారం అందించారు. హిమాన్షు సెంచరీతో మధ్యప్రదేశ్ తొలి ఇన్నింగ్స్‌లో 94.3 ఓవర్లలో 252 పరుగులు చేసింది. విదర్భ తొలి ఇన్నింగ్స్‌లో 170 పరుగులకు కుప్పకూలగా.. మధ్యప్రదేశ్ 82 పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం సాధించింది. రెండో ఇన్నింగ్స్‌లో విదర్భ 13/1తో పోరాడుతుంది. విదర్భ తొలి ఇన్నింగ్స్‌లో మరో 69 పరుగుల వెనుకంజలో కొనసాగుతుంది.

నవచిత్రం



ఆ షరతులు ఏంటి?

చైతన్య రావు, భూమి శెట్టి జంటగా నటించిన చిత్రం 'షరతులు వర్తిస్తాయి'. కుమారస్వామి(అక్షర) దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని స్టార్ లైట్ స్టూడియోస్ బ్యానర్‌పై నాగార్జున సామల, శ్రీష్ కుమార్ గుండా, డాక్టర్ కృష్ణకాంత్ చిత్తజల్లు నిర్మించారు. ఈ సినిమా ఈ నెల 15వ తేదీన గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు రెడీ అవుతోంది. తాజాగా ఈ సినిమా ట్రైలర్‌ని రిలీజ్ చేశారు.

ఈ సందర్భంగా నిర్మాత డాక్టర్ కృష్ణకాంత్ చిత్తజల్లు మాట్లాడుతూ, 'ఒక మంచి సినిమాతో మా సంస్థ లాంచ్ అవుతుండటం హ్యాపీగా ఉంది. మా ప్రొడక్షన్‌కు ఒక లాంగ్ రన్ ఉండాలని ప్లాన్ చేస్తున్నాం. అందులో ఫస్ట్ స్టెప్ ఈ సినిమా. ఈ నెల 15న ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నాం. ఏషియన్ ఫిలిమ్స్, సురేష్ ప్రొడక్షన్స్ మా సినిమాను థియేటర్స్‌లో రిలీజ్ చేస్తున్నారు. ఇప్పటికి 60 థియేటర్స్ కన్ఫర్మ్ అయ్యాయి. మా టీమ్‌కు సపోర్ట్‌గా ఉన్న మామిడి హరికృష్ణ, మధుర శ్రీధర్ రెడ్డికి థ్యాంక్స్' అని అన్నారు.

'మా సినిమా థియేట్రికల్ రిలీజ్ మంచి సంస్థల ద్వారా జరుగుతుండటం హ్యాపీగా ఉంది. సినిమా అనేది ఆర్ట్ బిజినెస్. ఇందులో మంచి పాయింట్‌తో పాటు కమర్షియల్ ఎలిమెంట్స్ ఉంటాయి. మిమ్మల్ని ఎంగేజ్ చేసేలా సినిమా ఉంటుంది. ఫ్యామిలీతో కలిసి చూడాల్సిన సినిమా. ఇందులో మీకు ఇబ్బందికరమైన సన్నివేశాలు ఒక్కటి కూడా ఉండవు' అని దర్శకుడు కుమారస్వామి చెప్పారు. హీరో చైతన్య రావ్ మాట్లాడుతూ, 'మా ట్రైలర్ మీకు నచ్చిందని ఆశిస్తున్నాను. మీకు నచ్చితే మిగతా వారికి షేర్ చేయండి. మీరొక మంచి సినిమా సజెస్ట్ చేశారని వారు భావిస్తారు. అందరూ చూడాల్సిన సినిమా ఇది. మధ్య తరగతి, దిగువ మధ్య తరగతి వాళ్ల జీవితాల్లో ఉండే సంతోషాలు, బాధలు, అన్ని ఎమోషన్స్ ఈ కథలో ఉంటాయి. మన మధ్య జరుగుతున్న కథలా ఉంటుంది. కుమారస్వామి మంచి డైరెక్టర్ మాత్రమే కాదు మంచి వ్యక్తి కూడా. "షరతులు వర్తిసాయి" నా కెరీర్ లో గుర్తుండిపోయే సినిమా అవుతుంది. ఫ్యామిలీ ఆడియెన్స్‌కు నన్ను దగ్గర చేస్తుందని ఆశిస్తున్నాను' అని తెలిపారు. 'ఇదొక న్యూ ఏజ్ సినిమా. ఇదొక మంచి మూవీ. కరీంనగర్ నేపథ్యంలో చేశాం. నేను తెలంగాణ యాస నేర్చుకుని డైలాగ్స్ చెప్పాను. ఇలాంటి ట్రెండ్‌లో కూడా మంచి కాన్సెప్ట్‌తో సినిమా చేసిన మా నిర్మాతలకు కృతజ్ఞతలు' అని హీరోయిన్ భూమి శెట్టి అన్నారు.



విజయ్ దేవరకొండ, మృణాల్ ఠాకూర్

ఈ ఫ్యామిలీ స్టార్ మెప్పిస్తాడట..

హీరో విజయ్ దేవరకొండ నటిస్తున్న "ఫ్యామిలీ స్టార్" సినిమా టీజర్ రిలీజ్ డేట్ అండ్ టైమ్ ఫిక్స్ చేశారు మేకర్స్. ఈ సినిమా టీజర్‌ను నేటి (సోమవారం) సాయంత్రం 6:30 నిమిషాలకు విడుదల చేయబోతున్నారు. ఈ టీజర్ రిలీజ్ అనౌన్స్ మెంట్ సందర్భంగా ఓ కొత్త పోస్టర్ రిలీజ్ చేశారు. విజయ్ దేవరకొండ సరసన మృణాల్ ఠాకూర్ హీరోయిన్‌గా నటిస్తోంది. ఈ సినిమాను ప్రతిష్టాత్మక నిర్మాణ సంస్థ శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌లో ప్రొడ్యూసర్స్ దిల్ రాజు, శిరీష్ నిర్మిస్తున్నారు. ఈ హోల్ సమ్ ఎంటర్‌టైనింగ్ డైరెక్టర్ పరశురామ్ పెట్ల రూపొందిస్తున్నారు.

ఈ చిత్రానికి క్రియేటివ్ ప్రొడ్యూసర్‌గా వాసు వర్మ వ్యవహరిస్తున్నారు. ఈ సినిమాను ఏప్రిల్ 5వ తేదీన గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు తీసుకు రాబోతున్నారు. మరో నెల రోజుల టైమ్ మాత్రమే ఉండటంతో ప్రమోషన్ యాక్టివిటీస్ స్పీడప్ చేసింది మూవీ టీమ్. ఇప్పటికే ఈ సినిమా నుంచి రిలీజ్ చేసిన టైటిల్ గ్లింప్స్, పోస్టర్స్, నందనందనా లిరికల్ సాంగ్‌ను ఆడియెన్స్ బాగా రిసీవ్ చేసుకున్నారు. ఇవన్నీ ఫ్యామిలీ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కిన సినిమా సూపర్ హిట్ కానుందనే ఇండికేషన్స్ ఇస్తున్నాయి అని చిత్ర బృందం భావిస్తోంది. జయ్ దేవరకొండ, మృణాల్ ఠాకూర్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ : కేయూ మోహనన్, సంగీతం : గోపీసుందర్, ఆర్ట్ డైరెక్టర్ : ఏ ఎస్ ప్రకాష్, ఎడిటర్ : మార్తాండ్ కె వెంకటేష్, క్రియేటివ్ ప్రొడ్యూసర్ : వాసు వర్మ, నిర్మాతలు : రాజు - శిరీష్, రచన, దర్శకత్వం - పరశురామ్ పెట్ల.

ఈనెల 8న బ్రహ్మ రాక్షసుడిని చూస్తారు



హీరో గోపీచంద్ నటించిన తాజా యాక్షన్ ఎంటర్‌టైనర్ 'భీమా'. ఈ సినిమాకి ఎ హర్ష దర్శకత్వం వహిస్తున్నారు. శ్రీ సత్యసాయి ఆర్ట్స్ పతాకంపై కె కె రాధామోహన్ నిర్మించారు. ప్రియా భవానీ శంకర్, మాళవిక శర్మ హీరోయిన్స్‌గా నటించారు. టీజర్, ట్రైలర్, పాటలు ఇలా సినిమాకు సంబంధించిన ప్రతి ప్రమోషనల్ కంటెంట్‌కు ట్రెమెండస్ రెస్పాన్స్ వచ్చింది. ఈనెల 8న మహా శివరాత్రి సందర్భంగా ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల కానుంది. ఈ నేపథ్యంలో హన్మకొండ వరంగల్‌లో మ్యాసీవ్ ప్రీరిలీజ్ ఈవెంట్ నిర్వహించారు. ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, పద్మశ్రీ గడ్డం సమ్మయ్య ఈ వేడుకకు అతిథులుగా హాజరయ్యారు. భారీ సంఖ్యలో అభిమానులు, ప్రేక్షకులు మధ్య ప్రీరిలీజ్ ఈవెంట్ చాలా గ్రాండ్‌గా జరిగింది. హీరో గోపీచంద్ మాట్లాడుతూ, 'ఈ సినిమా మొదలు కావడానికి కారణం మా కో ప్రొడ్యూసర్ శ్రీధర్. ఆయనే హర్షని పరిచయం చేశారు. సినిమా అవుట్ పుట్ అద్భుతంగా వచ్చింది. ప్రతి సీన్ చాలా బావుంటుంది. నేను సాధారణంగా ఇలా చెప్పను.. కానీ ఈ సినిమా కేక పుట్టిస్తుంది. అందులో సందేహం లేదు. ఇంత బాగా సపోర్ట్ చేసిన నిర్మాత రాధామోహన్‌కి ధన్యవాదాలు. సినిమా ఇంత బాగా రావడానికి కారణం ఆయనే. చాలా గ్రాండ్‌గా నిర్మించారు. మా మ్యూజిక్ డైరెక్టర్ రవి బస్రూర్ అద్భుతమైన మ్యూజిక్ ఇచ్చాడు. వేరే లెవల్‌లో కొట్టాడు. రామ్ లక్ష్మణ్, వెంకట్, రవి వర్మ చాలా ఎక్స్‌ట్రార్డినరీ ఫైట్ సీక్వెన్స్ ఇచ్చారు. ఇంటర్వెల్, క్లైమాక్స్ ఫైట్స్ గొప్పగా అలరిస్తాయి. అజ్జు చాలా పవర్ ఫుల్ డైలాగ్స్ రాశాడు. తను చాలా మంచి రైటర్ అవుతాడు' అని అన్నారు.

"భీమా' పేరు వింటేనే పవర్ మాస్ ఎనర్జీ. ఈ కథని గోపీచంద్‌కి చెప్పే అవకాశం కల్పించిన శ్రీధర్‌కి ధన్యవాదాలు. గోపిచంద్‌కి కథ నచ్చడంతో ఈ సినిమా మొదలైంది. ఇందులో ఎనర్జీ పవర్ ఉంది. ప్రేక్షకులకు నచ్చుతుందనే నమ్మకంతో మొదలుపెట్టాం. ఈనెల 8న బ్రహ్మరాక్షసుడు కనిపిస్తాడు. మిమ్మల్ని వందశాతం ఎంటర్‌టైన్ చేస్తుంది' అనని దర్శకుడు ఏ హర్ష చెప్పారు. హీరోయిన్ మాళవిక శర్మ మాట్లాడుతూ, 'ఇందులో విద్య అనే మంచి పాత్రని ఇచ్చిన దర్శకుడు హర్షకి థ్యాంక్స్. మంచి సినిమా చేశాం. మిమ్మల్ని తప్పకుండా మెప్పిస్తుంది' అని అన్నారు.

'ఈనెల 8న మహా శివరాత్రి సందర్భంగా విడుదల చేస్తున్నాం. ఈ సినిమాలో కామెడీ, యాక్షన్ ఎంటర్‌టైన్‌మెంట్ అన్ని రకాలు కలసి ఉన్నాయి' అని నిర్మాత కె కె రాధామోహన్ తెలిపారు.

ప్రేక్షకులకు ధన్యవాదాలు



శివ కందుకూరి హీరోగా నటించిన యూనిక్ క్రైమ్ థ్రిల్లర్ 'భూతద్ధం భాస్కర్ నారాయణ'. స్నేహాల్, శశిధర్, కార్తీక్ నిర్మించిన ఈ సినిమాకి పురుషోత్తం రాజ్ దర్శకత్వం వహించారు. డిఫరెంట్ కంటెంట్, కాన్సెప్ట్‌తో రూపొందిన ఈ సస్పెన్స్ థ్రిల్లర్ ఈనెల 1న ప్రపంచవ్యాప్తంగా విడుదలైన అన్ని వర్గాల ప్రేక్షకులను అలరించి థ్రిల్లింగ్-ప్యాక్డ్ బ్లాక్ బస్టర్ సక్సెస్‌ని అందుకుంది.

ఈ నేపథ్యంలో చిత్ర యూనిట్ నిర్వహించిన సక్సెస్ మీట్‌లో హీరో శివ కందుకూరి మాట్లాడుతూ, మేము అనుకున్న హిట్ ఈ సినిమాతో అందుకోవడం చాలా ఆనందంగా ఉంది. మాకు ఇంత మంచి బ్లాక్‌బస్టర్ విజయాన్ని ఇచ్చిన ఆడియన్స్ అందరికీ చాలా థ్యాంక్స్. సినిమాకి అద్భుతమైన రివ్యూస్ వచ్చాయి. మా కంటెంట్‌ని ప్రశంసిస్తూ ఇంత మంచి రివ్యూస్ ఇచ్చిన మీడియాకి ధన్యవాదాలు. సినిమా చూసిన ఆడియన్స్ చాలా ఎంజాయ్ చేస్తున్నారు. ప్రేక్షకులకు ఇవ్వాల్సిన విజువల్స్ ఎక్స్‌పీరియన్స్ ఈ సినిమాతో ఇవ్వడం చాలా ఆనందంగా ఉంది. నిర్మాతలు చాలా సపోర్ట్ చేశారు. స్నేహాల్, శశిధర్, కార్తీక్‌కి థ్యాంక్స్. తొలి సినిమాతో విజయాన్ని అందుకున్న పురుషోత్తం రాజ్‌కి అభినందనలు. శ్రీచరణ్ అద్భుతమైన బీజీఎం ఇచ్చారు. సినిమా చూసిన ప్రతి ఒక్కరూ మ్యూజిక్ బావుందని చెబుతున్నారు. విజయ్ రెండు బ్యూటీఫుల్ సాంగ్స్ ఇచ్చారు. షఫీ, అరుణ్, దేవి ప్రసాద్ అందరూ అద్భుతంగా నటించారు' అని అన్నారు.

సినిమాకి అద్భుతమైన స్పందన వస్తోంది. మంచి రివ్యూలు వచ్చాయి. ఇది థియేటర్ ఎక్స్‌పీరియన్స్ ఇచ్చే సినిమా. అందరూ థియేటర్స్‌లోనే చూడాలి. నిర్మాతలకు, నటీనటులకు ధన్యవాదలు. శివ ఈ సినిమాని బలంగా నమ్మారు. సినిమా హౌస్ ఫుల్ షోస్‌తో రన్ అవుతోంది' అని దర్శకుడు పురుషోత్తం రాజ్ చెప్పారు. నిర్మాతలు స్నేహాల్, శశిధర్ మాట్లాడుతూ,'ఫుల్ ఫాల్ ప్రతి షోకి పెరుగుతుంది. చాలా చోట్ల హౌస్‌ఫుల్ అవుతున్నాయి' అని తెలిపారు.

భిన్న ప్రేమకథతో శశివదనే

'పలాస 1978'లో అద్భుతమైన నటనతో అందరి ప్రశంసలు అందుకున్న రక్షిత్ అట్లూరి కథానాయకుడిగా నటిస్తోన్న చిత్రం 'శశివదనే'.

కోమలి కథానాయికగా నటిస్తోంది. 'మనసులో పుట్టే ప్రేమ మచ్చలేనిదైతే ఆ ప్రేమకు మరణం కూడా మనతోనే' అంటూ హృదయాన్ని హత్తుకునే గ్రామీణ నేపథ్యంలో ప్రేమకథాంశంగా తెరకెక్కిన ఈ చిత్రం ఏప్రిల్ 5న గ్రాండ్ రిలీజ్ అవుతోంది. ఇప్పటికే విడుదలైన ఈ మూవీ పాటలు, టీజర్‌కు అమేజింగ్ రెస్పాన్స్ వచ్చింది. ఈ నేపథ్యంలో తాజాగా మేకర్స్ ఈ సినిమా నుంచి 'ఏమిటో ఏమిటో..' అనే పాటను విడుదల చేశారు.

హీరోయిన్‌పై మనసుపడ్డ హీరో తన మనసులో చేలరేగె భావాలను పాట రూపంలో వ్యక్తం చేసే క్రమంలో పాట వచ్చే సందర్భంగా అనిపిస్తోంది. అదేంటో తెలుసుకోవాలంటే సినిమా రిలీజ్ వరకు ఆగాల్సిందేనంటున్నారు దర్శక, నిర్మాతలు. పి.వి.ఎన్.ఎస్.రోహిత్ పాడిన ఈ పాటను కరుణాకర్ అడిగర్ల రాశారు. శరవణ వాసుదేవన్ ఈ చిత్రానికి సంగీతాన్ని అందించారు. ఇప్పటివరకు వచ్చిన మూవీ కంటెంట్‌తో.. ఈ ప్రేమకథా చిత్రంలో గోదావరి జిల్లాల



రక్షిత్ అట్లూరి, కోమలి

అందాలను ఎలా చూపించబోతోన్నారు అనే దానిపై ఓ స్పష్టత వచ్చింది. భిన్న కథలను ముఖ్యంగా ప్రేమకథలను మన తెలుగు ప్రేక్షకులు బాగా ఆదరిస్తారు. ఓ స్వచ్ఛమైన ప్రేమకథగా రూపొందిన ఈ సినిమా కచ్చితంగా అందర్నీ అలరిస్తుందనే ధీమాని మేకర్స్ వ్యక్తం చేస్తున్నారు. గౌరీ నాయుడు సమర్పణలో ఏజీ ఫిల్మ్ కంపెనీ, ఎస్‌వీఎస్ స్టూడియోస్ ప్రైవేట్ లిమిటెడ్ బ్యానర్స్‌పై అహితేజ బెల్లంకొండ, అభిలాష్ రెడ్డి గోదాల ఈ చిత్రాన్ని నిర్మించారు. రైటర్, డైరెక్టర్ సాయి మోహన్ ఉబ్బన సినిమాను తెరకెక్కించారు.

ఈ చిత్రంలో రంగస్థలం మహేష్, శ్రీమాన్, జబర్దస్త్ బాబీ, ప్రవీణ్ యండమూరి మరియు దీపక్ ప్రిన్స్ కీలక పాత్రలు పోషించారు.

ఈ చిత్రానికి సమర్పణ : గౌరీ నాయుడు, రచన,దర్శకత్వం: సాయిమోహన్ ఉబ్బన, నిర్మాతలు: అహితేజ బెల్లంకొండ, అభిలాష్ రెడ్డి గోదాల, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: శ్రీపాల్ చొల్లేటి, సంగీతం: శరవణ వాసుదేవన్, బ్యాక్ గ్రౌండ్ స్కోర్: అనుదీప్ దేవ్, సినిమాటోగ్రఫీ: శ్రీ సాయికుమార్ దారా, ఎడిటర్: గ్యారీ బీహెచ్.

Printed and Published by Nandayla Narsimha Reddy on behalf of Navatelangana Printers Private Limited, Printed at Navatelangana Printers Private Limited Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Telangana State, Published at Navatelangana Printers Private Limited, Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Editor : R.Sudha Bhaskar. TEL TEL/2015/60886